ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
ప్రకాశం 5
జిల్లా వార్తలు
గురువారం 19, సెప్టెంబరు 2024



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా, పక్కన డీఈవో సుభద్ర

మధ్యాహ్న భోజనాన్ని సక్రమంగా అందించాలి

- కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశం

ఒంగోలు (కలెక్టరేట్), సెప్టెంబరు 18 : జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం సక్రమంగా అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. ప్రకాశం భవన్‌లో బుధవారం విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులతో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. మధ్యాహ్న భోజనం అమలులో ఆహారపట్టికను పక్కాగా పాటించాలన్నారు. ఆ విషయంలో ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తేవాలని సూచించారు. విద్యార్థులు భోజనాన్ని ఇష్టంగానే తింటున్నారా లేదా? అని అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు భోజనాన్ని తరుచూ పరిశీలిస్తుండాలని ఆదేశించారు. పాఠశాలల్లో రక్షిత మంచినీటిని అందుబాటులో ఉంచాలన్నారు. ఈ సందర్భంగా టీచర్లు, కుకింగ్ ఏజెన్సీల నిర్వాహకులు మాట్లాడుతూ వారంలో రెండు రోజులపాటు పులిహోర పెడుతున్నామని, దానిని ఒక రోజుకు కుదించాలని కోరారు. కోడిగుడ్లను ఉడికించి ఐదు రోజులు ఇస్తున్నామని.. రెండు, మూడు రోజులు కోడిగుడ్డు కర్రీ రూపంలో ఇస్తే బాగుంటుందని సూచించారు. అన్నం, సాంబరు విడిగా ఉంటే బాగుంటుందని ఉపాధ్యాయులు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. మెనూ చార్జీలు పెంచాలని, ప్రస్తుతం ఇస్తున్నవి సరిపోవడం లేదని ఏజెన్సీలు కలెక్టర్‌ను కోరారు. ఆయా అంశాలపై అన్సారియా మాట్లాడుతూ ఆహార పట్టికలో మార్పులు చేస్తూ ప్రభుత్వానికి నివేదికను పంపుతామన్నారు. మధ్యాహ్న భోజన పథకం అమలుపై ఉపాధ్యాయులు ప్రత్యేకశ్రద్ధ తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో డీఈవో సుభద్ర, డిప్యూటీ డీఈవో సుబ్బారావు, ఎంఈవోలు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వైద్యుల ఆందోళన

- జీవో నంబర్ 85ను రద్దు చేయాలని డిమాండ్



ఒంగోలు (కలెక్టరేట్), సెప్టెంబరు 18 : పీజీ విద్యలో ఇన్ సర్వీసు కోటాను తగ్గించడాన్ని వ్యతిరేకిస్తూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు చేపట్టిన ఆందోళన కొనసాగుతోంది. వారంరోజుల నుంచి వివిధ రూపాల్లో నిరసనలు తెలిపిన వైద్యాధికారులు బుధవారం విజయవాడలో జరిగిన ధర్నాకు తరలివెళ్లారు. పీజీ విద్యలో ఇన్ సర్వీసు కోటాను 15శాతానికి తగ్గించడాన్ని నిరసిస్తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రైమరీ హెల్త్ సెంటర్స్ డాక్టర్స్ అసోసియేషన్ పిలుపు మేరకు జిల్లాలోని వైద్యులు ఈ ఆందోళనలు చేస్తున్నారు. గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ల పట్ల ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తూ పీజీ విద్యలో ఇన్ సర్వీసు కోటాను తగ్గిస్తూ జీవో నెంబరు 85 జారీచేయడాన్ని ఖండించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే ఈ జీవోను రద్దుచేయాలని అసోసియేషన్ నాయకులు కోరారు.

ఇన్‌చార్జిల ఇష్టారాజ్యం

పంచాయతీరాజ్‌లో పర్యవేక్షణ కొరవడింది. కీలకమైన నాలుగు విభాగాలకు జిల్లా అధికారులుగా ఇన్‌చార్జిలే ఉన్నారు. అందులో రెండింటికి ఆరు నెలల నుంచి కొనసాగుతుండగా, తాజాగా ఖాళీ అయిన రెండింటికి ఏకంగా సుదూరంగా ఉండే గుంటూరు జిల్లా అధికారులే దిక్కయ్యారు. దీంతో వారు మొక్కుబడిగా విధులు నిర్వహిస్తున్నారు. క్షేత్రస్థాయి పర్యటనలు, సమీక్షలు, లోటుపాట్లు సరిదిద్దే ప్రయత్నాలు చేయడం లేదు. కొందరి తీరుతో శాఖలలో పాలన అస్తవ్యస్తంగా తయారైంది. కింది స్థాయి అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు.

- పర్యవేక్షణ లేని పంచాయతీరాజ్
- నాలుగు కీలకశాఖలకు పక్క వారే దిక్కు
- రెండింటికి గుంటూరు జిల్లా అధికారులు
- క్షేత్రస్థాయిపై దృష్టిపెట్టని దుస్థితి
- నామమాత్రంగానే విధుల నిర్వహణ
- మీనమేషాలు లెక్కిస్తున్న ప్రభుత్వ పెద్దలు
- కొన్నిశాఖల్లో మొదలైన గందరగోళం



పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ విభాగాల కార్యాలయాలు

ఒంగోలు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీరాజ్ శాఖల్లో ఇన్‌చార్జిల పాలన నడుస్తోంది. దీంతో అంతా అస్తవ్యస్తంగా తయారైంది. గ్రామీణ ప్రాంత ప్రజల అవసరాలు తీర్చే అత్యంత కీలకమైన విభాగం పంచాయతీరాజ్. దాని పరిధిలోనే జిల్లాలో నాలుగు విభాగాలు నడుస్తుంటాయి. అందులో మొత్తం గ్రామపంచాయతీలు డీపీవో పర్యవేక్షణలో, మండల, జిల్లా పరిషత్‌లు జిల్లా పరిషత్ సీఈవో పర్యవేక్షణలో నడుస్తాయి. గ్రామ పంచాయతీలు, మండల, జిల్లా పరిషత్‌ల పాలన వ్యవహారాలలో ఈ రెండూ అత్యంత కీలకం. అలాగే గ్రామీణ ప్రజల మౌలిక అవసరాలైన రోడ్లు, డ్రైన్లు, వివిధ నిర్మాణాలను పర్యవేక్షించేది పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం. కాగా ఆ విభాగం ఎస్ఈ పర్యవేక్షణలో నడుస్తోంది. ఇక పల్లె ప్రజల తాగునీటి సరఫరా పర్యవేక్షణ బాధ్యత గ్రామీణ నీటి సరఫరా విభాగం ఎస్ఈ పరిధిలో ఉంటుంది.

అవగాహన లేని ఉన్నతాధికారులు

ఇక జిల్లాలో ఆర్‌డబ్ల్యూఎస్ విభాగం కూడా ప్రధానమైంది. వందల కోట్ల రూపాయల విలువైన జలజీవన్ మిషన్ పనులు, అలాగే గ్రామస్థాయి రక్షిత తాగునీటి పథకాలు, ట్యాంకర్లతో నీటి సరఫరా, సాగర్ నీటితో ఎస్ఎస్ ట్యాంకులు, చెరువులు నింపడం వంటి కీలకమైన పనుల పర్యవేక్షణ ఆ శాఖ ఎస్ఈ పరిధిలో ఉంటాయి. ఆ పోస్టులో ఇక్కడ సుదీర్ఘకాలం పనిచేసిన మర్దన్‌అలీ ఆగస్టు 31న ఉద్యోగ విరమణ చేశారు. ఆ స్థానంలో జిల్లాలోని అధికారులకు కాకుండా గుంటూరు జిల్లా ఎస్ఈ సురేష్‌ను ఇన్‌చార్జిగా నియమించారు. ఆయన గుంటూరు ఎస్ఈతోపాటు అప్పటికే నెల్లూరు ఎస్ఈగా కూడా ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ముచ్చటగా మూడో జిల్లా ఎస్ఈగా ప్రకాశం బాధ్యతలను కూడా అప్పగించారు. ఒంగోలు ఎస్ఈగా ఒక్క పోస్టులో ఉంటేనే తీరిక లేని పని ఒత్తిడి ఉంటే ఈ పోస్టులో ఏకంగా మూడు జిల్లాల పర్యవేక్షణ ఎలా సాధ్యమన్నది ఉన్నతాధికారులకే తెలియాలి. జిల్లాపై అవగాహన లేకుండా ఉన్నతాధికారులు.. సమన్వయం, పర్యవేక్షణ లేనివిధంగా కీలక ప్రజాప్రతినిధులు వ్యవహరిస్తుండటంతో పంచాయతీరాజ్ విభాగంలో ఈ పరిస్థితి ఏర్పడింది. తక్షణం రెగ్యులర్ అధికారుల నియామకాలు చేపట్టకపోతే ఇప్పటికే అంతంతమాత్రంగా కనిపిస్తున్న పంచాయతీరాజ్ విభాగం పర్యవేక్షణ మరింత దిగజారే పరిస్థితి కనిపిస్తోంది.

ఒకే అధికారి రెండు పోస్టులకు ఇన్‌చార్జి


పంచాయతీరాజ్‌లో ఆ నాలుగు విభాగాలు అత్యంత కీలకం కాగా ప్రస్తుతం వాటి జిల్లాస్థాయి అధికారులు ఇన్‌చార్జిలుగా ఉంటూ మొక్కుబడిగా విధులు నిర్వహిస్తున్నారు. వీటిలో జడ్పీ సీఈవో, డీపీవో పోస్టులు ఆరు మాసాలకుపైగా ఇన్‌చార్జిల పాలనలో నడుస్తున్నాయి. జడ్పీ సీఈవోగా ఇక్కడ పనిచేస్తున్న జాలిరెడ్డి, డీపీవోగా ఉన్న నారాయణరెడ్డిలు సొంత జిల్లా వారు కావడమే కాక దీర్ఘకాలంగా ఇక్కడే పనిచేసిన నేపథ్యంలో సాధారణ ఎన్నికలకు ముందు ఎన్నికల కమిషన్ ఆదేశాలతో వారిని బదిలీ చేశారు. మార్చిలో అలా జరగ్గా అప్పటి నుంచి ఇన్‌చార్జి అధికారులే దిక్కయ్యారు. జడ్పీ సీఈవోగా కలెక్టరేట్‌లోని విపత్తుల నిర్వహణ విభాగంలో డిప్యూటీ కలెక్టర్ హోదాలో ఉన్న మాధురి ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. ఆమె అప్పటికే స్త్రీశిశుసంక్షేమశాఖ పీడీ ఎఫ్ఏసీగా ఉండటంతో ఏకంగా మూడు బాధ్యతలు నిర్వర్తించాల్సి వచ్చింది. అలాగే ఒంగోలు డివిజన్ అభివృద్ధి అధికారిగా ఉన్న ఉషారాణిని ఇన్‌చార్జి డీపీవోగా నియమించారు. ఆమె ఈ రెండింటితోపాటు సచివాలయాల నోడల్ అధికారిగా ఉండి అలా మూడు పోస్టుల్లో పనిచేస్తున్నారు. పనిభారంతో వారు దేనికీ సరిగా న్యాయం చేయలేని పరిస్థితి కనిపిస్తోంది.

పక్క జిల్లావారికి బాధ్యతలు

పంచాయతీరాజ్‌లో మరో ప్రధానమైన ఇంజనీరింగ్, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖల పరిస్థితి కూడా అలాగే ఉంది. ఇక్కడ పీఆర్ ఎస్ఈగా పనిచేస్తున్న కొండయ్య మే 31న ఉద్యోగ విరమణ చేయగా గుంటూరు ఎస్ఈగా ఉన్న జి.అశోక్‌ను ఇన్‌చార్జిగా నియమించారు. సాధారణంగా ఇలాంటి సమయంలో జిల్లాకేంద్రంలో లేదా కనీసం జిల్లాలో ద్వితీయశ్రేణిలో ఉండే ఈఈ స్థాయి అధికారికి ఇన్‌చార్జి ఇస్తారు. అయితే ఒంగోలు ఈఈ పోస్టు ఖాళీగా ఉండి కందుకూరు ఈఈ కోటేశ్వరరావు ఇక్కడ ఇన్‌చార్జిగా ఉండటం, మార్కాపురంలో ఉన్న రెండు ఈఈ పోస్టులకు ఒక్కరే కావడంతో గుంటూరు ఎస్ఈకి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించినట్లు చెప్తున్నారు. అయితే ఒంగోలు పీఐయూ విభాగంలో మరొక ఈఈ ఉన్నా ఆయనకు ఇన్‌చార్జి బాధ్యతపై ఉన్నతాధికారులు దృష్టిపెట్టలేదు. దీంతో గుంటూరు ఎస్ఈ అశోక్ ప్రస్తుతం ఉమ్మడి గుంటూరు జిల్లాతోపాటు ఉమ్మడి ప్రకాశం జిల్లా పర్యవేక్షణ చేయాల్సి రాగా జిల్లాకు చుట్టపుచూపుగా కూడా వస్తున్న పరిస్థితి లేదు. ఈ విభాగం పరిధిలో దాదాపు రూ.120 కోట్ల మేర తాజాగా ఉపాధి పథకం అనుసంధానం పనులు మంజూరు కాగా వాటి పర్యవేక్షణ ప్రశ్నార్థకంగా కనిపిస్తోంది.

వైసీపీకి బాలినేని షాక్

- జనసేనలో చేరికకు రంగం సిద్ధం
- నేడు పవన్‌కల్యాణ్‌తో భేటీ
- ఆయన బాటలో మరికొందరు నేతలు, కార్పొరేటర్లు
- జనసేనలో మిశ్రమ స్పందన
- జగన్ మారలేదు, మారడు : మాజీమంత్రి
- వైసీపీ తరపున రంగంలోకి వైవీ



(ఆంధ్రజ్యోతి, ఒంగోలు) అనుకున్నట్లే వైసీపీకి మాజీమంత్రి బాలినేని శ్రీనివాస రెడ్డి షాక్ ఇచ్చారు. ఆ పార్టీకి రాజీనామా చేశారు. జనసేనలో చేరేందుకు సిద్ధమయ్యారు. గురువారం మంగళగిరిలో జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌ను కలవబోతున్నారు. దీంతో జిల్లాలో కునారిల్లుతున్న వైసీపీ పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. బాలినేని విషయంలో జిల్లా జనసేన నాయకులలో మిశ్రమ స్పందన కనిపిస్తోంది. గత వైసీసీ ప్రభుత్వంలో మంత్రివర్గ విస్తరణలో స్థానం కోల్పోయినప్పటి నుంచి అసంతృప్తితో ఉన్న బాలినేని సార్వత్రిక ఎన్నికల సమయంలోనే పార్టీ మారే ప్రయత్నం చేశారు. అప్పట్లో టీడీపీలోకి వెళ్లే ప్రయత్నం జరిగింది. బాలినేని ఒంగోలు టికెట్ ఆశించగా దర్శి లేక మార్కాపురం ఇస్తామని టీడీపీ నాయకులు చెప్పారు. దీంతో ఆ ప్రతిపాదన ఆగిపోయింది. ఎన్నికల్లో ఓటమి అనంతరం వైసీపీ జిల్లా అధ్యక్షుడిగా తిరుపతి జిల్లాకు చెందిన చెవిరెడ్డిని నియమించేందుకు జగన్ సిద్ధమయ్యారు. ఆ ప్రతిపాదనతో బాలినేని విభేదించటంతో మరోసారి వారి మధ్య స్పర్థలు పెరిగాయి. ఇదేసమయంలో బాలినేని మంత్రిగా ఉన్న సమయంలో జరిగిన అక్రమాలపై విచారణ చేయాలన్న డిమాండ్‌ను తెరపైకి తెచ్చారు. ఈ విషయమై టీడీపీ ఎమ్మెల్యే జనార్దన్‌తోపాటు జనసేన జిల్లా అధ్యక్షుడు రియాజ్‌లు కూడా ముఖ్యమంత్రిని కలిసి బాలినేనిపై ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో బాలినేని రాజకీయ నిర్ణయం మారబోతుందన్న ప్రచారం మళ్లీ తెరపైకి వచ్చింది.

వ్యూహాత్మక అడుగులు

బాలినేని ముందస్తు వ్యూహంతోనే జనసేనలో చేరికకు రంగం సిద్ధం చేసుకున్నట్లు తెలుస్తోంది. బాలినేనికి వ్యతిరేకంగా జనసేన జిల్లా అధ్యక్షుడు రియాజ్, మరికొందరు అడుగులు వేస్తుండగా జిల్లాలోని జనసేన నేతల్లో రియాజ్‌ను వ్యతిరేకించే ముఖ్య నాయకులందరినీ బాలినేని దరి చేర్చుకోగలిగారు. తాజాగా మంగళవారం నాగబాబు, బాలినేని మధ్య భేటీ జరిగింది. ఒకట్రెండు సార్లు పవన్‌కల్యాణ్‌తో బాలినేని ఫోన్‌లో మాట్లాడారు. ఆ తర్వాత పవన్‌కల్యాణ్ గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో బాలినేని హడావుడిగా వైసీపీకి రాజీనామా చేసినట్లు తెలుస్తోంది. గురువారం తనను కలవాలని పవన్‌కల్యాణ్ సూచించడంతో బాలినేని బుధవారం రాత్రికే విజయవాడ చేరారు. గురువారం పవన్‌తో భేటీ అనంతరం అధికారికంగా జనసేనలో చేరే తేదీని వెల్లడించవచ్చని తెలుస్తోంది. ఇప్పటికే ఒంగోలులో ఎమ్మెల్యే దామచర్ల, బాలినేని మధ్య బహిరంగంగా సవాళ్లు, ప్రతిసవాళ్లు కొనసాగుతున్నాయి. మరికొన్ని నియోజకవర్గాలలో కూడా బాలినేనితోపాటు స్థానికంగా టీడీపీ నేతలతో సఖ్యతలో లేని వైసీపీ నాయకులు జనసేనలో చేరే అవకాశం ఉంది. దీంతో కూటమి పార్టీల మధ్య భవిష్యత్తులో సమన్వయం ఎలా ఉంటుందన్న అంశంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

చేరికకు ఎలాంటి షరతులు లేవు : బాలినేని

"వైసీపీ ఓటమి అనంతరం కూడా పార్టీ అధినేత జగన్‌లో మార్పు కనిపించటం లేదు. రాజకీయ, పాలనాపరమైన నిర్ణయాలలో ఆయన చేసిన తప్పులను ఎత్తిచూపినందుకు నన్ను ఇబ్బందులు పెట్టడమే గాక అవమానాలకు గురిచేశారు. ఆ తప్పులపై ఇప్పటికీ జగన్‌లో ఆత్మపరిశీలన కనిపించటం లేదు. రాజకీయాల్లో విలువలు లేకుండా ఆత్మాభిమానాన్ని చంపుకుని వైసీపీలో ఉండలేకే బయటకు వస్తున్నానని బాలినేని తెలిపారు. బేషరతుగా జనసేనలో చేరుతున్నానని పార్టీ, ప్రజాసేవకు పవన్‌కల్యాణ్ నిర్ణయానికి అనుగుణంగా ముందుకు పోవడమే నా లక్ష్యం" అని ఆంధ్రజ్యోతితో బాలినేని తెలిపారు.

వైసీపీలో అయోమయం

జిల్లాలో వైసీపీ ఇప్పటికే నాయకత్వలేమితో కొట్టుమిట్టాడుతోంది. బాలినేని ఇప్పటికే ఒంగోలులో వైసీపీతో ఉన్న 23మంది కార్పొరేటర్లతో చర్చలు జరిపారు. వారిలో రమారమి సగం మంది జనసేనలోకి వెళ్లే అవకాశం కనిపిస్తోంది. వైపాలెం ఎమ్మెల్యే చంద్రశేఖర్ నిర్ణయం ఎలా ఉంటుందనేది అనుమానాస్పదమే. అందుకే జగన్ ముందుగా చంద్రశేఖర్‌ను పిలిపించుకుని మాట్లాడినట్లు తెలిసింది. దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డిని పార్టీ జిల్లా అధ్యక్ష బాధ్యతలు స్వీకరించాలని జగన్ సూచించినట్లు సమాచారం. ముఖ్య నాయకులు బాలినేనితో వెళ్లకుండా చూసేందుకు జగన్.. వైవీ సుబ్బారెడ్డిని రంగంలోకి దించినట్లు సమాచారం. ఆయన, మరికొందరు నాయకులు జిల్లాలోని ముఖ్యనేతలతో మాట్లాడుతున్నట్లు తెలుస్తోంది. అయితే ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ఆయా నియోజకవర్గాలలో వైసీపీలోని ద్వితీయశ్రేణి నాయకులు బాలినేనితోపాటు జనసేనలోకి వెళ్లేందుకు సిద్ధమయ్యారు. అదే జరిగితే జిల్లాలో వైసీపీ పరిస్థితి మరింత దయనీయంగా మారే అవకాశం కనిపిస్తోంది.



పవన్‌తో మాట్లాడుతున్న దామచర్ల, పక్కన ముత్తుముల

పవన్‌తో దామచర్ల భేటీ

పవన్‌కల్యాణ్‌ను ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ బుధవారం కలిశారు. బాలినేని జనసేనలో చేరబోతున్న నేపథ్యంలో ఈ కలయిక చర్చనీయాంశమైంది. అందిన సమాచారం మేరకు బాలినేని వైసీపీకి రాజీనామా చేసి జనసేనలో చేరబోతున్నట్లు జరుగుతున్న ప్రచారాన్ని దామచర్ల ప్రస్తావించగా గత ఆరు మాసాలుగా ఇది నడుస్తున్నదని పవన్ అన్నట్లు తెలుస్తోంది. కాగా పవన్‌కల్యాణ్‌కు ఆయా సమస్యల పరిష్కారాన్ని కోరుతూ, అలాగే మరికొన్ని అంశాలతో కూడిన లేఖను దామచర్ల ఇచ్చినట్లు తెలిసింది.



ఉద్యోగాలు పొందిన వారితో డాక్టర్ లక్ష్మి, లలిత్‌సాగర్, పాపారావు

మెగా జాబ్ మేళాకు అనూహ్య స్పందన

- 2,300 మందికి పైగా యువత హాజరు
- 585 మందికి ఉద్యోగావకాశాలు
- పాల్గొన్న 42 కంపెనీలు

దర్శి, సెప్టెంబరు 18 : నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్ తమ సొంత నిధులతో దర్శి నిర్వహించిన మెగా జాబ్ మేళాకు అనూహ్య స్పందన లభించింది. మొత్తం 2,300 మంది యువతీ యువకులు పాల్గొన్నారు. టెక్ మహేంద్ర, అమర్‌రాజా బ్యాటరీస్ తదితర కంపెనీలతోపాటు మొత్తం 42 సంస్థల ప్రతినిధులు పాల్గొని ఇంటర్వ్యూలు నిర్వహించారు. దర్శి, మార్కాపురం, ఎర్రగొండపాలెం నియోజకవర్గాలతోపాటు జిల్లాలోని అనేక ప్రాంతాల నుంచి నిరుద్యోగులు వచ్చారు. కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించి 585 మందిని ఎంపిక చేశారు. మరో 200 మందిని పరిశీలనలో ఉంచారు. వారికి కూడా త్వరలో ఉద్యోగావకాశాలు లభించే అవకాశం ఉంది.

యువత చేతుల్లోనే దేశ భవిష్యత్తు

దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన యువతకు ఆమె డాక్టర్ లలిత్‌సాగర్‌తో కలిసి ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మి మాట్లాడుతూ యువత సన్మార్గంలో ముందుకు సాగి దేశాభివృద్ధికి దోహద పడాలని కోరారు. జాబ్ మేళాలను నిరంతరం కొనసాగిస్తామని చెప్పారు. హెచ్‌ఆర్‌సీ సంస్థ ద్వారా నియోజకవర్గంలో ఇంటింటి సర్వే చేపట్టి నిరుద్యోగ యువత వివరాలను తెలుసుకుంటామని, అవసరమైన వారికి శిక్షణ అందించి అందరికీ ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు పాల్గొన్నారు.

ముగ్గురు పంచాయతీ కార్యదర్శుల సస్పెన్షన్

ఎట్టకేలకు డీపీవో ఉత్తర్వులు

ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 18: జిల్లాలోని రెండు గ్రామ పంచాయతీల్లో అవినీతి, అక్రమాలకు పాల్పడిన ముగ్గురు గ్రామ పంచాయతీ కార్యదర్శులపై సస్పెన్షన్ వేటు పడింది. వాస్తవంగా ఆ ముగ్గురు కార్యదర్శులను బుధవారమే సస్పెండ్ చేసినా ఆ ఉత్తర్వులను బయటపెట్టకుండా దాచిపెట్టిన విషయంపై ఆంధ్రజ్యోతి వెలుగులోకి తెచ్చింది. దీంతో ముగ్గురు కార్యదర్శుల సస్పెన్షన్ ఉత్తర్వులను ఆయా ఎంపీడీవోలకు డీపీవో పంపారు. మండల కేంద్రమైన సింగరాయకొండ గ్రామ పంచాయతీ కార్యదర్శి జె.రామకోటయ్య రూ.79వేలను ఫోన్‌పే ద్వారా తన బ్యాంకు ఖాతాకు జమచేయించుకొని రికార్డులు చూపలేదు. జనన, మరణ ధ్రువీకరణ పత్రాలను గ్రామపంచాయతీ రికార్డు దాఖలు లేకుండా జారీచేయడంతో రామకోటయ్యపై చర్యలు తీసుకున్నారు. మద్దిపాడు మండలం దొడ్డవరప్పాడు పంచాయతీ ఇన్‌చార్జి కార్యదర్శి పి.శ్రీనివాసులు, పెదకొత్తపల్లి పంచాయతీ కార్యదర్శి (గ్రేడ్-5) ఎస్.వినోద్‌ను కూడా సస్పెండ్ చేశారు. దొడ్డవరప్పాడు పంచాయతీలో ఎటువంటి ముందస్తు నోటీసులు కానీ, వార్డుసభ్యుల ఆమోదం కానీ లేకుండా ఈ ఏడాది జనవరి 12, ఈ ఏడాది ఫిబ్రవరి 23న మీటింగ్ నిర్వహించినట్లుగా రికార్డుల్లో నమోదు చేశారు. సిమెంట్ రోడ్డు నిర్మాణం కోసం పంచాయతీ తీర్మానం చేశారు. సర్పంచ్ బెజవాడ శ్రీరామమూర్తి నిబంధనలకు విరుద్ధంగా రూ.7,36,400 తన సొంత ఖాతాకు నిధులు బదిలీ చేసుకున్నట్లు ఉప సర్పంచ్ మురళి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు డివిజనల్ పంచాయతీ అధికారి విచారణ చేసి ఆ నిధులకు సంబంధించి నివేదిక ఇచ్చారు. పంచాయతీ నిధులకు ఆమోదం లేకుండా నిధులు డ్రా చేసేందుకు సహకరించిన గ్రామ కార్యదర్శి, డ్రాయింగ్ అధికారి అయిన పి.శ్రీనివాసులు, గ్రేడ్-5 కార్యదర్శి వినోద్‌లను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

జిల్లా అభివృద్ధికి చర్యలు

- సీఎంను కోరిన ఎంపీ, ఎమ్మెల్యేలు
- పలువురు ప్రత్యేక నివేదికలు



సీఎం చంద్రబాబుతో మాట్లాడుతున్న కనిగిరి ఎమ్మెల్యే ఉగ్ర

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు) జిల్లా అభివృద్ధి కోసం ఇచ్చిన హామీల అమలుకు వెంటనే చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును జిల్లాకు చెందిన టీడీపీ ఎంపీ, పలువురు ఎమ్మెల్యేలు కోరారు. ప్రభుత్వం ఏర్పడి వంద రోజులైన సందర్భంగా బుధవారం కూటమి ఎమ్మెల్యేలు, ఎంపీలతో మంగళగిరిలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లాకు చెందిన టీడీపీ ఎంపీ, ఎమ్మెల్యేలు కొందరు చంద్రబాబును కలిశారు. ఒంగోలు ఎంపీ మాగుంట, ఎమ్మెల్యేలు దామచర్ల జనార్దన్, ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, అశోక్‌రెడ్డి, నారాయణరెడ్డి, ఏలూరి సాంబశివరావు తదితరులు ఆయా సమస్యలను ప్రస్తావించారు. ఎంపీ మాగుంట సమస్యల పరిష్కారాన్ని కోరుతూ ఓ ప్రత్యేక లేఖను సీఎంకు ఇచ్చారు. ఎమ్మెల్యే జనార్దన్ ఒంగోలు కార్పొరేషన్ అవసరాలపై ఓ లేఖను ఇచ్చారు. తాగునీటి సమస్యలు, ఇతర అంశాల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేలు ఉగ్రనరసింహారెడ్డి, అశోక్‌రెడ్డిలు లేఖలు అందజేశారు. ఆ తర్వాత ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను కలిసి కనిగిరి నియోజకవర్గంలో ట్రిపుల్ ఐటీ భవన నిర్మాణాలకు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను కలిసి కనిగిరి నియోజకవర్గంలో ఉన్న తాగునీటి సమస్యను వివరించి మంచినీటి పథకాల నిర్మాణాలకు అవసరమైన నిధులు ఇవ్వాలని కోరారు.

వరద బాధితుల కోసం విరాళం అందజేత



సీఎం చంద్రబాబుకు చెక్కును అందజేస్తున్న బార్ అసోసియేషన్ నాయకులు

ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 18: విజయవాడ వరద బాధితుల సహాయార్థం ఒంగోలు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు రూ.3.40 లక్షల చెక్కును బుధవారం అందజేశారు. బార్ అసోసియేషన్ ద్వారా సేకరించిన ఈ విరాళాలను అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్.మోహన్‌దాస్ ఈ చెక్కు సీఎంకు అందించారు. కార్యక్రమలో అసోసియేషన్ ప్రధానకార్యదర్శి ఏల్చూరి సురేంద్రబాబు, కోశాధికారి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆస్తుల కన్నా ఆరోగ్యం మిన్న : డీఎస్పీ



అరుగును ప్రారంభిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు

ఒంగోలు(కల్చరల్), సెప్టెంబరు 18: కోట్లాది రూపాయల ఆస్తులు ఉన్నా మనిషికి సరైన ఆరోగ్యం లేకపోతే అవి నిష్ప్రయోజనమని డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఒంగోలు రంగారాయుడు చెరువు కట్టపై వాకర్స్ విశ్రాంతి తీసుకోవటం కోసం ఆధునీకరించిన అరుగును ఆయన బుధవారం ప్రారంభించారు. గతంలో ఈ అరుగును సూర్యశ్రీ దివ్యాంగుల చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు మండవ మురళీకృష్ణ నిర్మించారు. అయితే అది శిథిలావస్థకు చేరిన నేపథ్యంలో ప్రవాస భారతీయుడు ఘట్టమనేని కార్తీక్ తన తండ్రి కృష్ణారావు జ్ఞాపకార్థం ఆ అరుగును గ్రానైట్ రాళ్లతో ఆధునీకరించారు. వాకర్స్ వాకింగ్, వ్యాయామం చేసిన తర్వాత కొద్దిసేపు విశ్రాంతి అవసరమని, అందుకోసం ఈ అరుగు ఎంతో ఉపయోగపడుతుందని మండవ మురళీకృష్ణ పేర్కొన్నారు. దాదాపు రూ.లక్షతో ఆధునీకరించినట్లు తెలిపారు. ట్రస్ట్ నిర్వాహకులు షేక్ షహనాజ్, సర్దార్ బాషా ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మండవ సుబ్బారావు, మారెళ్ల సుబ్బారావు, తమ్మిశెట్టి రమాదేవి, మేడిశెట్టి సుబ్బారావు, కిరణ్, జనసేవ శ్రీనివాసరావు, వాకర్స్ పాల్గొన్నారు.

పశువుల వేలం ద్వారా రూ.6.52 లక్షల ఆదాయం : డీడీ

నాగులుప్పలపాడు సెప్టెంబరు 18 : చదలవాడ పశుక్షేత్రంలో ఒంగోలు జాతి పశువుల వేలం ద్వారా రూ.6.52 లక్షల ఆదాయం సమకూరినట్లు క్షేత్రం డీడీ రవికుమార్ తెలిపారు. బుధవారం స్థానిక పశుక్షేత్రంలో వివిధ కేటగిరిలకు చెందిన 66 ఒంగోలు జాతి పశువులకు వేలం నిర్వహించగా 56 మంది రైతులు పాల్గొని 50 పశువులను దక్కించుకొన్నట్లు యన చెప్పారు. కార్యక్రమంలో గుంటూరు ఏపీఎల్‌డీఏ వైద్యులు గౌతమ్‌కుమార్, ఎ.రమేష్, ఏడీఏ నాగభూషణరావు తదితరులు పాల్గొన్నారు.

వినాయక లడ్డూ రూ.1.63లక్షలు



వినాయక విగ్రహం వద్ద లడ్డూతో అనిల్, భక్తులు

చీమకుర్తి, సెప్టెంబరు 18 : చీమకుర్తి పట్టణం తూర్పుబజార్ ఎన్టీఆర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన వినాయక విగ్రహ నిమజ్జన వేడుకలు బుధవారం అట్టహసంగా నిర్వహించారు. ఇక్కడ ఏర్పాటు చేసిన భారీ వినాయకవిగ్రహం వద్ద 11రోజులుపాటు పూజలో ఉంచిన లడ్డూకు నిర్వహించిన వేలంలో పలువురు భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు. గుడిపూడి అనిల్ అనే భక్తుడు లడ్డూని రూ.1.63లక్షలకు వేలంలో దక్కించుకన్నారు. విగ్రహం వద్ద ఏర్పాటుచేసిన కరెన్సీ దండను తూర్పుబజార్ మహిళలు రూ.30,116కు దక్కించుకున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

పారిశుధ్యం మెరుగుపై దృష్టి సారించాలి



పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న డీపీవో ఉషారాణి

సంతనూతలపాడు, సెప్టెంబరు 18: ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుకు పూర్తిస్థాయిలో దృష్టి సారించాలని డీపీవో ఉషారాణి ఆదేశించారు. బుధవారం సంతనూతలపాడులో స్వచ్ఛతాహిసేవా కార్యక్రమంలో భాగంగా సంతనూతలపాడు పంచాయతీలో జరుగుతున్న పారిశుధ్య పనులను డీపీవో పరిశీలించారు. జ్వరాలు రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. పారిశుధ్యం విషయంలో నిర్లక్ష్యం చూపొద్దని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ డి.నాగమణి, కార్యదర్శులు కె.రాధిక, కిరణ్, పారిశుధ్యకార్మికులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 18: భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కార్మిక సంఘాల నాయకులు కోరారు. బుధవారం ఒంగోలులోని కార్మికశాఖ కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్ పవన్ కుమార్‌ను కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. భవన నిర్మాణ రంగంలో పలు విభాగాల్లో పని చేస్తున్న కార్మికులకు సంక్షేమబోర్డు నుంచి సంవత్సరాల తరబడి పెండింగ్‌లో క్లైయిమ్స్ ఉన్నాయన్నారు. వాటిని వెంటనే విడుదల చేయడంతో పాటు కార్మికులకు గుర్తింపు కార్డులను ఇవ్వాలని కోరారు. కార్మికులకు సంక్షేమ పథకాలతో పాటు గుర్తింపుకార్డులు జారీ చేయాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నగర కార్యదర్శి టి.మహేష్, బిల్డింగ్‌వర్కర్స్ నగర కార్యదర్శి ఎస్‌డీ.హుస్సేన్, జి.రమేష్, పి.సుబ్బారావు, రంగయ్య, ఎస్‌కే.సుభాని పాల్గొన్నారు.



డిప్యూటీ కమిషనర్ పవన్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

అంగన్‌వాడీ కేంద్రాల్లో మెనూకు మంగళం

గత నాలుగు నెలలుగా లేని కందిపప్పు సరఫరా

అవస్థలు పడుతున్న నిర్వాహకులు

బాలింతలు, గర్భిణులు, చిన్నారులకు దక్కని పౌష్టికాహారం



సంతనూతలపాడు, సెప్టెంబరు 18: మద్దిపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని మండలాల్లోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు మెనూ ప్రకారం భోజనం అందడం లేదు. ఆకుకూర, కూరగాయలు, సాంబారుతో మధ్యాహ్న భోజనం పెట్టాల్సి ఉంది. అయితే గత నాలుగు నెలలుగా కందిపప్పు సరఫరా నిలిచిపోవడంతో బయట నుంచి కొనుగోలు చేసిన పప్పు అన్నం పెట్టాల్సి పరిస్థితి నెలకొంది. ఏ అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లి చూసినా మధ్యాహ్నబోజనంలో పప్పు కూరగాయలతో సాంబారు పెట్టిన పరిస్థితులు అరకొరగానే కన్పిస్తున్నాయి. గత వైసీపీ ప్రభుత్వ హయాం నుంచి అంగన్‌వాడీ కేంద్రాలకు నిలిచిన కందిపప్పు సరఫరా నేటికి పునరుద్ధరణ కాలేదు. దీంతో చిన్నారులకు పప్పు, సాంబారు భోజనంలో అందించక లేకపోతున్నారు. కొంతమంది సిబ్బంది అప్పు చేసి మరీ కందిపప్పు తెచ్చిపెడుతుండగా.. మరికొందరు మెనూకు మంగళం పాడేస్తున్నారు. కాగా మద్దిపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని సంతనూతలపాడు, చీమకుర్తి, నాగులుప్పలపాడు, మద్దిపాడు మండలాల్లో 286 అంగనవాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో బాలింతలు 1119, గర్భవతులు 1172, 3 సంవత్సరాలలోపు చిన్నారులు 1,101మంది, 3-6 ఏడాది చిన్నారులు 4,450 మంది ఉన్నారు.

మెనూలో పప్పు ఉండాల్సిందే..

అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే బాలింతలు, గర్భిణులు, పిల్లలకు మధ్యాహ్నభోజనం కింద సోమవారం దోసకాయ, మంగళవారం టమోటా, బుధవారం ఆకుకూర, గురువారం బీరకాయ, శుక్రవారం సొరకాయ, శనివారం వివిధ ఆకుకూరల పప్పు వడ్డించాలి. వీటితో పాటు బుధ, శుక్ర, శనివారాల్లో సాంబారు చేస్తారు. ప్రతీ కూరకు కందిపప్పు అవసరం. కందిపప్పు లేకుండా కూరలు వండాల్సిన పరిస్థితి నెలకొంది. అవి తినలేక కేంద్రాల్లో బాలింతలు, గర్భిణులు భోజనం చేయడమే మానేశారు. గర్భిణులకు, బాలింతలకు ఒక్కొక్కరికి రోజుకు 125గ్రాముల అన్నం, 30 గ్రాముల కందిపప్పు, 16 గ్రాముల నూనె అందించాలి. 3-6 ఏళ్ల చిన్నారులకు 75 గ్రాముల బియ్యం, 15 గ్రాముల కందిపప్పు, 5గ్రాముల నూనె ఇవ్వాలి. వీటితో కూరగాయలకోసం ఒక్కొక్క లబ్ధిదారులకు రూ.2లను కేటాయిస్తున్నారు. కొన్నేళ్ల కిందటి ధరలే నేటికీ అమలు చేస్తుండటంతో అంగనవాడీ నిర్వాహకులు ఇబ్బంది పడుతున్నారు.

త్వరలోనే కందిపప్పు సరఫరా - భారతి, సీడీపీవో

అంగన్‌వాడీ కేంద్రాల్లో కందిపప్పుతో కూడిన కూరలు, సాంబారు అరకొరగా అమలు కావడం వాస్తవమే. ఉన్నతాధికారులకు సమస్యను వివరించాం, మరికొన్ని అంగనవాడీ కేంద్రాలకు డీలర్ల వద్ద నుంచి కొంతమేర కందిపప్పు సరఫరా చేయించాం. త్వరలో అంగనవాడీ కేంద్రాలకు కందిపప్పు సరఫరా పూర్తిస్థాయిలో అమలు అవుతుంది. తద్వారా బాలింతలకు, గర్భిణులకు, చిన్నారులకు పౌష్టికాహారం అందుతుంది.

చీమకుర్తిలో కలెక్టర్ విస్తృత తనిఖీలు

హాస్టల్‌లో బాలికలతో ముఖాముఖి • సీహెచ్‌సీలో వైద్యసేవల పరిశీలన • కారుమంచి కెనాల్ పునరుద్ధరణకు ఆదేశం



విద్యార్థినులతో మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

చీమకుర్తి, సెప్టెంబరు 18 : చీమకుర్తిలో కలెక్టర్ తమీమ్ అన్సారియా బుధవారం విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ముందుగా స్థానిక బాలికల ఉన్నతపాఠశాల ఏర్పాటు చేయటంతో సమీపంలో ఉన్న ఎస్సీ బాలికల వసతిగృహంలో చేరే విద్యార్థినుల సంఖ్య పెరుగుతుండటంతో అక్కడి అదనపు గదుల నిర్మాణం, మౌలిక వసతుల కల్పన కోసం కలెక్టర్ సదరు వసతిగృహన్ని పరిశీలించారు. డీఎంఎఫ్ నిధులను గదుల నిర్మాణానికి, వసతుల కల్పనకు రూ.2కోట్లు మంజూరు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. బాలికలతో కలెక్టర్ ముఖాముఖి మాట్లాడారు. సమస్యలపై, అలాగే ఎలాంటి మెనూ కావాలని అడిగి తెలుసుకున్నారు. విద్యాభ్యాసంపై విద్యార్థినులు దృష్టిసారించాలని సూచించారు. కలెక్టర్ వెంట డీడీ లక్ష్మానాయక్, ఏఎస్‌డబ్ల్యూవో దానయ్య, అరుణ పాల్గొన్నారు.

కారమంచి మేజర్ పరిశీలన..

చీమకుర్తి శివారున గ్రానైట్ క్వారీల సమీపం నుంచి వెళ్తున్న కారుమంచి మేజర్ కెనాల్ కొంత మేర కుంగి పక్కనే ఉన్న క్వారీలో రెండేళ్ల క్రితం కుప్పకూలిపోయింది. తాత్కాలికంగా కాలువను మళ్లించి నీటిసరఫరాను చేస్తున్నా కేవలం తాగునీటి అవసరాలు తీర్చటానికి మాత్రమే పరిమితమైంది. దీంతో ఆయకట్టు రైతులు సాగునీటి కోసం ఇబ్బందిపడుతున్నారు. ఈక్రమంలో రైతు సంఘనాయకులు, టీడీపీ నాయకులు, రైతుల నుంచి కెనాల్ పునుద్ధరణ పనులు నిర్వహించాలని పెద్దఎత్తున ఫిర్యాదులు అందాయి. దీంతో కలెక్టర్ అన్సారియా దెబ్బతిన్న కారుమంచి మేజర్ కెనాల్‌ను, పక్కనే ఉన్న క్వారీలను పరిశీలించారు. ఇరిగేషన్, మైనింగ్ అధికారులను పునరుద్ధరణ పనులపై ప్రశ్నించారు. ఆయకట్టు కింద 16వేల ఎకరాలకు కాలువ ద్వారా 136 క్యూసెక్‌ల నీరు సరఫరా చేసేలా రూ.2.62కోట్లతో కెనాల్ పునరుద్ధరించటానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు ఇరిగేషన్ ఎస్ఈ మురళీమోహన్ వివరించారు. కాలువ సమీపంలో క్వారీ కార్యకలాపాలపై తీసుకోవాల్సిన చర్యలపై మైన్స్ డీడీ జగన్నాథరావుకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.

సీహెచ్‌సీలో మెరుగైన సేవలందించాలి

చీమకుర్తి సామాజిక కేంద్రంలో మెరుగైన వైద్యసేవలు అందించాలని కలెక్టర్ అన్సారియా వైద్యులను ఆదేశించారు. ఆసుపత్రికి ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోగులకు అందించే సేవలను పరిశీలించారు. ఆసుపత్రికి వైద్యసేల నిమిత్తం వచ్చిన వారితో అందుతున్న సేవలగురించి, డాక్టర్ల ప్రవర్తన గురించి అడిగి తెలుసుకున్నారు. పోస్టుమార్టం గది నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని పరిశీలించి సంబంధిత ప్రతిపాదనలపై వైద్యులతో చర్చించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాఘవేంద్ర, తహసీల్దార్ బ్రహ్మయ్య, అధికారులు పాల్గొన్నారు.

గుండ్లకమ్మ కాలువల్లో జమ్ము తొలగించాలి

• రైతు సంఘం నాయకుల వినతి



ఎమ్మెల్యే విజయ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నాగులుప్పలపాడు సెప్టెంబరు 18 : గుండ్లకమ్మ ప్రాజెక్ట్ పరిధిలోని ప్రధాన కాలువల్లో ఉన్న జమ్ము, చిల్లచెట్లను తొలగించి చివరి ఆయకట్టు రైతులకు సాగునీరు అందించాలని రైతు సంఘం నాయకులు కోరారు. బుధవారం ఒంగోలులో ఎమ్మెల్యే బీఎస్.విజయ్‌కుమార్‌ను కలిసి ఈమేరకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గుండ్లకమ్మ ప్రాజెక్ట్ పరిధిలో ఖరీఫ్‌లో 40వేలు, రబీలో 80 వేల ఎకరాలకు సాగునీరు, ఐదు మండలాల ప్రజలకు తాగునీరు అందించేలా రూపకల్పన చేశారన్నారు. గత ఏడాది ప్రాజెక్టు గేట్లు కొట్టుకొని పోయి గత వైసీపీ పాలకులు పట్టించుకోకపోవడంతో ఒక్కతడి సాగునీరు అందే పరిస్థితి లేక రైతులు పంటలు నష్టపోయారని చెప్పారు. తాగునీటికి సైతం ఇబ్బందులు తలెత్తాయన్నారు. దాంతో పాటు ప్రాజెక్టు పనులు కూడా పూర్తి కాలేదని తెలిపారు. ప్రస్తుతం ఆరుతడి పంటలకు ప్రాజెక్టు ద్వారా నీరు అందుతున్నాయని వివరించారు. ఈ నేపథ్యంలో ప్రాజెక్టు కాలువలు జమ్ము, చిల్లచెట్లుతో నిండిపోయి నీరు ముందుకు కదలక చివరి భూముల రైతులకు సాగునీరందని పరిస్థితి నెలకొందని వివరించారు. దీని వల్ల ప్రాజెక్టు నుంచి నీరు విడుదల చేసిన సమయంలో కాలువ కట్టలు తెగే ప్రమాదముందని అధికారులు తెలిపారని, కాలువలు అభివృద్ధి చేయాలని కోరగా నిధులు లేవని తెలిపినట్లు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. తక్షణమే నిధులు కేటాయించి కాలువల్లోని జమ్ము, చిల్లచెట్లు, పూడికను తొలగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జాలా అంజయ్య, మాబు, జుజ్జూరి జయంతి బాబు, పమిడి వెంకట్రావు, అబ్బూరి వెంకట్రావు, తూబాటి శ్రీకాంత్, యోనా పాల్గొన్నారు.

జత్వానీ కేసులో నీలి మీడియా తప్పుడు రాతలు

• తెలుగు మహిళలు ధ్వజం



సమావేశంలో మాట్లాడుతున్న రావుల పద్మజ

ఒంగోలు(కార్పొరేషన్), సెప్టెంబరు18: ముంబై నటి జత్వానీ కేసులో భయంతోనే నీలి మీడియా తప్పుడు రాతలు రాస్తుందని తెలుగు మహిళలు విమర్శించారు. బుధవారం ఒంగోలులోని టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ నీలిమీడియాలో మహిళలను కించపరుస్తూ తప్పుగా రాయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. జత్వానిక కేసుకు దేశవ్యాప్త మద్దతు లభిస్తుందన్నారు. నీలి మీడియా మాత్రం దోషులను కాపాడేందుకు అర్థం లేని రాతలు రాస్తుందని పేర్కొన్నారు. కుట్రపూరితంగా మహిళలందరినీ ఇబ్బందులకు గురి చేయాలని చూస్తున్న నీలిమీడియా వైఖరి మార్చుకోవాలని తెలిపారు. ఇది వారి దిగజారుడు రాజకీయానికి నిదర్శనమని, జగన్‌మోహన్‌రెడ్డి స్క్రిప్టుతోనే జత్వానిపై కేసులు పెట్టారన్నారు. ఆమె తల్లిదండ్రులను దారుణంగా హింసించారని ఆరోపించారు. ఎన్నికల్లో 151 నుంచి 11 సీట్లుకు పడిపోయేసరికి జగన్‌రెడ్డికి మతి పోయిందన్నారు. సమావేశంలో తెలుగు మహిళలు రావుల పద్మజ, నిడమనూరి పావని, పసుపులేటి సునీత, టి.అనంతమ్మ, జనసేన నాయకురాలు ప్రమీల పాల్గొన్నారు.





సైకిల్‌తో అడ్డుగోడను దాటి హైవేలో ప్రమాదకరంగా వెళుతున్న విద్యార్థి



చిన్నారితో రోడ్డు దాటుతున్న మహిళ

ఆంధ్రజ్యోతి ఫోకస్

ప్రమాదం అంచున రోడ్డు క్రాసింగ్

అడ్డదిడ్డంగా రాకపోకలు సాగిస్తున్న సమీప కాలనీవాసులు

పట్టించుకోని అధికారులు

ఒంగోలు(క్రైం), సెప్టెంబరు 18: ఒంగోలు నగరం మంగమూరు రోడ్డు జంక్షన్‌లో పాదచారులు, విద్యార్థులు హైవేను ప్రమాదం అంచున దాడుతున్నారు. ఈ జంక్షన్ సమీపంలో అంజయ్య రోడ్డు నుంచి రామయ్యనగర్, చెన్నకేశవస్వామి లేఅవుట్‌కు వెళ్లేందుకు ప్రమాదకంగా హైవేపై రాకపోకలు చేస్తున్నారు. ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్న ఊహించని ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. రోడ్డు మరమ్మతుల సమయంలో అక్కడ ప్రజలు ఆందోళన చేయగా రాకపోకలకు దారి వదిలారు. ప్రస్తుతం ఆ దారిని మూసివేయడంతో ప్రమాదకరస్థితిలో రోడ్డును దాటుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి అక్కడ ప్రజల కోసం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని స్థానికులు కోరుతున్నారు.



సెల్‌ఫోన్ మాట్లాడుతూ వెళుతున్న విద్యార్థిని

అవీ.. ఇవీ..

బీసీ హాస్టల్ సహాయ సంక్షేమ అధికారిపై చర్యలు తీసుకోవాలి : ఎస్ఎఫ్ఐ



ధర్నా చేస్తున్న నాయకులు

ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 18: మార్కాపురం బీసీ వసతి గృహాల సహాయక సంక్షేమ అధికారి జబ్బార్ అవినీతి, అక్రమాలపై విచారణ చేపట్టాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సీహెచ్.వినోద్ డిమాండ్ చేశారు. జబ్బార్ అక్రమాలను నిరసిస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వసతిగృహాల సహాయ సంక్షేమ అధికారి తీరు వల్ల విద్యార్థులు, వర్కర్లు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఆయన అవినీతి, అక్రమాలపై అనేక సార్లు ఫిర్యాదు చేశామని, అయినా ఆయన తీరుమారలేదన్నారు. మార్కాపురం, కనిగిరి, వైపాలెం నియోజకవర్గాల పరిధిలోని వసతిగృహాలు ఆయన పరిధిలో ఉన్నాయన్నారు. మారుమూల ప్రాంతాలు కావడంతో అర్హతలేని విద్యార్థుల పేర్లు రాసుకొని ప్రభుత్వాన్ని మోసం చేసి డబ్బులు కాజేస్తున్నారని ఆరోపించారు. ఈ అక్రమాలన్నింటిపై సమగ్ర విచారణ చేయాలని కోరారు. అనంతరం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు వీరస్వామి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

ఒంగోలు(విద్య) సెప్టెంబరు 18 : జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఒంగోలులోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో విద్యార్థినులకు బుధవారం ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ డి.కళ్యాణి మాట్లాడుతూ విద్యార్థినులందరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, కలుషిత ఆహార పదార్థాల జోలికివెళ్ళకూడదని సూచించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి సుధారాణి, వైస్‌ప్రిన్సిపాల్ అనంతలక్ష్మి, ఎం.శ్రీనివాసరెడ్డి, సురేష్‌కుమార్, సీహెచ్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వరద బాధితులకు ఏపీటీఎఫ్ విరాళం

ఒంగోలు(విద్య), సెప్టెంబరు 18: విజయవాడ వరద బాధితుల కోసం ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్(ఏపీటీఎఫ్) జిల్లాశాఖ తరుపున రూ.25వేలు విరాళం ఇచ్చినట్లు ఐఫియా కౌన్సిలర్ పీవీ.సుబ్బారావు, జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు బి.వెంకట్రావు, బి.అశోక్‌కుమార్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏపీటీఎఫ్ కృష్ణా జిల్లా శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న సహాయ కార్యక్రమాలకు ఈ మొత్తాన్ని అందజేసినట్లు వారు పేర్కొన్నారు.

24 వరకు దరఖాస్తుల పొడిగింపు : డీఈవో

ఒంగోలు(విద్య), సెప్టెంబరు 18 : జాతీయ ఉపకారవేతన పరీక్ష నేషనల్ మెన్స్ కమ్ మెటిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) దరఖాస్తు గడువును ఈనెల 24 వరకు పొడిగించినట్లు డీఈవో సుభద్ర బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రింటెడ్ నామినల్ రోల్స్‌ను ఈనెల 27నాటికి డీఈవో కార్యాలయంలో సమర్పించాలన్నారు. ప్రభుత్వ, జిల్లా పరిషత్, మునిసిపల్, ఎయిడెడ్, మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలు, వసతిసౌకర్యాలు లేని ఆదర్శ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తుకు అర్హులన్నారు. వార్షికాదాయం రూ.3.50లక్షలలోపు ఉండాలన్నారు. ఓసీ, బీసీ విద్యార్థులు రూ.100, ఎస్సీఎస్టీ విద్యార్థులు రూ.50 పరీక్ష రుసుం చెల్లించాలని, దరఖాస్తు చేసేటప్పుడు ఎటువంటి ధృవీకరణ పత్రాలు అవసరం లేదని తెలిపారు. పరీక్ష నాటికి ఆయా ధృవీకరణ పత్రాలు సిద్ధం చేసుకోవాలని, డిసెంబరు 8న పరీక్ష జరుగుతుందని డీఈవో వివరించారు.

నేడు రక్తదాన శిబిరం

ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 18: ప్రధానమంత్రి నరేంద్రమోదీ జన్మదినోత్సవం సందర్భంగా గురువారం మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్లు ఒంగోలులోని ఇందిరా ప్రియదర్శిని లా కళాశాల అధ్యక్షుడు కె.నరసింగరావు, కార్యదర్శి సీవీ.రామకృష్ణ, ప్రిన్సిపాల్ కె.నటరాజకుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. లా కలాశాల, క్విస్ ఇంజనీరింగ్ కళాశాల, బీజేపీ డాక్టర్స్ సెల్, యువ మోర్చాల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. రక్తదాన శిబిరాన్ని అదనపు ఎస్పీ శ్రీధరరావు ప్రారంభిస్తారన్నారు. ఈ శిబిరం ద్వారా సేకరించిన రక్తాన్ని ఒంగోలులోని రిమ్స్‌కు అందజేస్తామని వారు తెలిపారు.

కరవది హైస్కూలు తెలుగు టీచర్ మృతి

ఒంగోలు(విద్య), సెప్టెంబరు 18 : కరవది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు స్కూలు అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఉన్నం మాధవీలత మృతి చెందారు. అనారోగ్యంతో విజయవాడ హాస్పటల్‌లో చికిత్స పొందుతూ మరణించారు. బుధవారం ఆమె స్వగ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. హెచ్ఎం పీవీ.రవికుమార్, ఉపాధ్యాయులు కుటుంబ సభ్యులకు సంతాపాన్ని వ్యక్తం చేశారు.

పేదలకు దుప్పట్లు పంపిణీ



దుప్పట్లను అందజేస్తున్న తహసీల్దార్ ఆదిలక్ష్మి

సంతనూతలపాడు, సెప్టెంబరు 18: సంతనూతలపాడులో సేవాసంకల్ప్ ట్రస్టు, రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో బుధవారం తహసీల్దార్ వి.ఆదిలక్ష్మి చేతులమీదుగా పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. అనంతరం పేదలకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ట్రస్టుల ద్వారా ఇటువంటి మంచి కార్యక్రమాలను చేపట్టడం అభినందనీయమని చెప్పారు. సంస్థల సభ్యులు పాల్గొన్నారు.

అజెండాల వారీగా స్థాయీ సంఘ సమావేశాలు

ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 18: ఒంగోలులోని జిల్లా పరిషత్ కార్యాలయంలో బుధవారం జడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు జరిగాయి. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ అధ్యక్షతన జరిగిన సమావేశంలో జడ్పీ సీఈవో కె.మాధురి హాజరయ్యారు. 3,5 స్థాయీ సంఘ సమావేశానికి యన్నాబత్తిన అరుణ, మారెడ్డి అరుణ అధ్యక్షత వహించారు. పలువురు జడ్పీటీసీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు. సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఆయా శాఖల అధికారులు సమాధానాలు ఇచ్చారు. గ్రామీణాభివృద్ధితో పాటు వ్యవసాయం, విద్య, వైద్య, స్త్రీశిశు సంక్షేమశాఖ, సాంఘిక సంక్షేమశాఖల పై సమీక్ష నిర్వహించారు. అజెండా అంశాలను సభ్యులతో చర్చించి ఆమోదించారు.

పేస్‌లో గేట్ పరీక్షపై అవగాహన సదస్సు



మాట్లాడుతున్న రమేష్‌మసునా

ఒంగోలు(విద్య), సెప్టెంబరు 18: ఒంగోలులోని పేస్ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం కెరీర్ గైడెన్స్‌సెల్ ఆధ్వర్యంలో చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు గేట్ పరీక్షపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఏసీఈ ఇంజనీరింగ్ అకాడమీ సీనియర్ ఫ్యాకల్టీ రమేష్‌మసునా గేట్ పరీక్షపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. గేట్‌లో మంచి ర్యాంకు సాధించడం ద్వారా మంచి కళాశాలలో ఎంటెక్ కోర్సును ఎంపిక చేసుకోవచ్చన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల్లో ఉద్యోగాల సాధనకు ఈ ర్యాంకు దోహదపడుతుందని ఆయన చెప్పారు. కార్యక్రమంలో కెరీర్ గైడెన్స్ సెల్ కన్వీనర్ రూపా అక్కేష్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు సంతనూతలపాడు విద్యార్థిని



వైశాలితో హెచ్ఎం, ఉపాధ్యాయులు

సంతనూతలపాడు, సెప్టెంబరు 18: సంతనూతలపాడు జడ్పీహైస్కూల్‌కు చెందిన 9వ తరగతి విద్యార్థిని ఎ.వైశాలి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఇన్‌చార్జ్ హెచ్ఎం ఎన్.ఉమామహేశ్వరి తెలిపారు. బుధవారం స్థానిక స్కూలులో జరిగిన సమావేశంలో వైశాలిని అభినందించారు. ఈనెల 15న పంగులూరులో జరిగిన సబ్‌జూనియర్ రాష్ట్రస్థాయి ఖోఖోపోటీల్లో ప్రతిభ చాటిన వైశాలి జాతీయస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు మెగా గుండె వైద్యశిబిరం

నాగులుప్పలపాడు సెప్టెంబరు 18: ఉప్పుగుండూరు గ్రామ తెలుగుయువత ఆధ్వర్యంలో స్థానిక పంచాయితీ కార్యాలయం వద్ద విజయవాడ హెల్ప్ వైద్యశాల సహకారంతో గురువారం మెగా ఉచిత గుండె వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. శిబిరంలో గుండె సంబంధిత వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందిస్తారని, పరిసర గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

టీడీపీ వర్గీయులపై దాడికి వైసీపీ నేతల కుట్ర

ట్రాక్టర్లలో కర్రలు, రాళ్లు, కారం ప్యాకెట్లు

పోలీసుల రాకతో వాహనాలు వదిలి పరార్

కఠిన చర్యలు తీసుకోవాలని తెలుగు తమ్ముళ్ల డిమాండ్

పొన్నలూరు (కొండపి), సెప్టెంబరు 18 : మండలంలోని చౌటపాలెంలో టీడీపీ వర్గీయులపై దాడికి వైసీపీ నేతలు కుట్ర పన్నారు. చుట్టుపక్కల గ్రామాలకు చెందిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు ట్రాక్టర్లు, మోటారు సైకిళ్లలో కర్రలు, కారం ప్యాకెట్లు తీసుకొని చౌటపాలెంలో మోహరించారు. తెలుగు తమ్ముళ్లు సంయమనం పాటించడంతోపాటు పోలీసులు అక్కడికి చేరుకోవడంతో వాహనాలను వదిలేసి పరారయ్యారు. ఈనెల 15న ఈ ఘటన చోటుచేసుకుంది. వివరాలను చౌటపాలెం గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు ఉన్నం శీనయ్య, పాతూరి కోటయ్య, ఉన్నం సుధాకర్, రుమెళ్ల వెంకట్రావు, నేలపాటి రాము తదితరులు బుధవారం పొన్నలూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. వారి కథనం మేరకు.. ఈనెల 14న గ్రామంలో టీడీపీ నాయకులు వినాయక నిమజ్జనోత్సవం చేస్తుండగా వైసీపీ వర్గీయులు అడ్డుకొన్నారు. ఆ సమయంలో తెలుగు తమ్ముళ్లు సంయమనం పాటించారు. అనంతరం నిమజ్జనం పూర్తి చేశారు. ఈనెల 15న వైసీపీ వర్గీయులు ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహాన్ని ఊరేగించారు. ఆసమయంలో వారు ఒక ప్రణాళిక ప్రకారం చుట్టుపక్కల గ్రామాల నుంచి 160 మందిని తీసుకొచ్చారు. ట్రాక్టర్లు, మోటారు సైకిళ్లలో కర్రలు, కారం ప్యాకెట్లు ఇతరత్రా ఆయుధాలతో వారిని సిద్ధం చేశారు. విషయం తెలుసుకున్న పొన్నలూరు ఇన్‌చార్జి ఎస్‌ఐ రమేష్, పోలీసు సిబ్బంది గ్రామానికి చేరుకున్నారు. దీంతో పొరుగు గ్రామాల నుంచి వచ్చిన వైసీపీ కార్యకర్తలు వారు తెచ్చిన కొన్ని వాహనాలను అక్కడే వదిలేసి పరారయ్యారు. అనంతరం వాటిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. తమపైనే దాడికి యత్నించి మంత్రి స్వామి, టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి దామచర్ల సత్య మీద సోషల్ మీడియాలో వైసీపీ నేతలు అసత్య ప్రచారం చేయడం విడ్డూరంగా ఉందని విలేకరుల సమావేశంలో టీడీపీ నేతలు అన్నారు. తమపై దాడికి యత్నించిన వారిపై పోలీసులు కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో టీడీపీ మండల అధ్యక్షుడు అనుమోలు సాంబశివరావు, మండల నాయకులు మండవ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు



చౌటపాలెంలో వైసీపీ కార్యకర్తలు వదిలేసి వెళ్లిన వాహనాలు

పీవీఆర్ స్కూలు పీడీ సస్పెన్షన్

ఒంగోలు(విద్య), సెప్టెంబరు 18: ఒంగోలు పీవీఆర్ బాలికోన్నత పాఠశాలలో ఫిజికల్ డైరెక్టర్(పీడీ)గా పనిచేస్తున్న జ్యోత్స్నాదేవి సస్పెండయ్యారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆమెను సస్పెండ్ చేస్తూ జిల్లా విద్యాశాఖాధికారి సుభద్ర బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. పీవీఆర్ బాలికోన్నత పాఠశాలలో పదవ తరగతి, 8వ తరగతి చదువుతున్న ఇద్దరు అక్కాచెల్లెళ్లలను పీడీ సూటిపోటి మాటలతో వేధిస్తూ శిక్షిస్తుందని ఆ బాలికల తల్లి రావిపాటి లక్ష్మి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై ఈనెల 9న డిప్యూటీ కలెక్టర్ లోకేశ్వరరావు విచారణ చేసి నివేదికను సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ ఫిర్యాదుపై విచారణ నిర్వహించిన లోకేశ్వరరావు సాక్ష్యాధారాలను పరిశీలించి కలెక్టర్‌కు నివేదికను సమర్పించారు. దానిని పరిశీలించిన కలెక్టర్ విద్యార్థినులను వేధింపులకు గురిచేసిన పీడీ జ్యోత్స్నాదేవిని సస్పెండ్ చేయాలని డీఈఓను ఆదేశించారు. దీంతో పీడీని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులను బుధవారం పాఠశాల హెచ్ఎంకు పంపారు.

జిల్లా రిజిస్ట్రార్‌గా బాలాంజనేయులు



బాలాంజనేయులు

నెల్లూరు(హరనాథపురం), సెప్టెంబరు 18: స్టాంపులు, రిజిస్ట్రేషన్లశాఖ జిల్లా రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న ఎ.బాలాంజనేయులును ఒంగోలు రిజిస్ట్రార్‌గా బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధానకార్యదర్శి ఆర్‌పీ.సిసోడియా బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. ఆయన స్థానంలో ఇంకా ఎవరినీ నియమించలేదు. అలాగే నెల్లూరులో మార్కెట్ వ్యాల్యూ, ఆడిట్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న సీఆర్.హరివర్మను అన్నమయ్య జిల్లా రాయచోటి రిజిస్ట్రార్‌గా నియమించారు. ఆయన స్థానంలో జిల్లా మార్కెట్ వాల్యూ, ఆడిట్ రిజిస్ట్రార్‌గా విజయనగరం రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న కుమారిని నియమించారు.

జిల్లా సమస్యలను సీఎంకు నివేదించిన మాగుంట

ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 18: జిల్లాలోని పలు రకాల సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి నివేదించారు. మంగళగిరిలోని సీకే కన్వెన్షన్‌హాలులో బుధవారం సాయంత్రం జరిగిన ఎన్‌డీఏ పార్లమెంట్, శాసనసభా పక్ష సభ్యులతో జరిగిన సమావేశంలో మాగుంట జిల్లాకు సంబంధించిన పలు సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్ళారు. ఒంగోలులో విమానాశ్రయం నిర్మాణంతో పాటు వెలిగొండ ప్రాజెక్టును త్వరగా పూర్తి చేయాలని కోరారు. మార్కాపురం జిల్లా ఏర్పాటు చేయాలని, మార్కాపురంలోని మెడికల్ కాలేజీ పనులు పూర్తి చేయడంతో పాటు బేస్తవారపేట-ఒంగోలు ఆర్‌అండ్‌బీరోడ్డును జాతీయరహదారి నాలుగు లైన్ల రోడ్డు స్థాయి పెంపు చేయాలని చెప్పారు. రామతీర్థం జలాశయం మరమ్మతులు, కొత్తపట్నం మండలంలో సూపర్ ఆర్వో ప్లాంటు ఏర్పాటు, నడికుడి- శ్రీకాళహస్తి రైల్వే పూర్తి, ఒంగోలులో కొత్త పేపర్ మిల్లు నిర్మాణంపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయా సమస్యలపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారని ఎంపీ మాగుంట తెలిపారు.

అవినీతి జరిగింది నిజమే..!

• మార్కాపురం ఈఈ నాగేశ్వరరావు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఒంగోలు(క్రైం), సెప్టెంబరు 18: యర్రగొండపాలెం నియోజకవర్గం, రాచర్లలో విద్యుత్‌శాఖ అధికారులు అవినీతికి పాల్పడింది నిజమేనని, అయితే సంబంధిత అధికారులకు చర్యలు తీసుకున్నామని మార్కాపురం విద్యుత్‌శాఖ ఈఈ పీవీ.నాగేశ్వరరావు తెలిపారు. బుధవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'కాసులు ఇస్తే కరెంట్' అనే కథనంపై ఆయన ఓ ప్రకటనలో స్పందించారు. అవినీతి అధికారులపై చర్యలు తీసుకున్నాయని, అందుకే ఈ వార్తను తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. విద్యుత్‌శాఖలో అవినీతి ఉంటే 14400 నంబరుకు ఫోన్ ద్వారా తెలియజేయాలన్నారు. అదేవిధంగా ఆమని గుడిపాడులో చోరీకి గురైన కరెంటు స్తంభాలపై పోలీసులకు ఫిర్యాదు చేశామని, సంబంధిత ఉద్యోగిపై క్రమశిక్షణ చర్యలు తీసుకున్నామన్నారు.

జనసేన నాయకుల సంబరాలు

ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 18 : మాజీమంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి జనసేన పార్టీలో చేరికను స్వాగతిస్తూ ఒంగోలులో సంబరాలు నిర్వహించారు. స్థానిక లాయర్‌పేటలోని డొక్కా సీతమ్మ క్యాంటీన్ వద్ద బుధవారం రాత్రి జనసేన పార్టీ జిల్లా ప్రచార కమిటీ కో ఆర్డినేటర్ జడా బాలనాగేంద్రయాదవ్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు టపాసులు పేల్చి సంబరాలు చేశారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

21 మండలస్థాయి క్రీడా పోటీలు

నాగులుప్పలపాడు సెప్టెంబరు 18 : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 21న మండలస్థాయి క్రీడల పోటీలను బి.నిడమానూరు హైస్కూల్‌లో నిర్వహిస్తున్నట్లు మండల కోఆర్డినేటర్ ఎన్.వేణుగోపాలరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్లలో చదువుతున్న 14-17 ఏళ్ల లోపు వారు పోటీలలో పేర్కొన్నారు. 21న యోగా, చెస్, కబడ్డీ, వాలీబాల్, బ్యాడ్మింటన్ విభాగాలలో పోటీలు జరుగుతాయని, క్రీడాకారులు జనన ధ్రువీకరణ, హెచ్‌ఎం ధ్రువీకరణ పత్రాలతో హాజరుకావాలని కోరారు.

20,21 తేదీల్లో క్రీడాకారుల ఎంపిక



సమావేశమైన ఎంఈవో, హెచ్ఎంలు

కొండపి, సెప్టెంబరు 18 : మండలంలోని కె.ఉప్పలపాడు జడ్పీ పాఠశాలలో ఈనెల 20,21 తేదీల్లో కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, బ్యాడ్మింటన్, చెస్, యోగా, అథ్లెటిక్స్ విభాగాల్లో మండల స్థాయి క్రీడాకారుల ఎంపిక జరగనుంది. ఈమేరకు ఎంఈవో అధ్యక్షతన బుధవారం హెచ్ఎంలతో నిర్వహించిన సమావేశంలో నిర్ణయించారు. అండర్-14, అండర్-17 జట్లతోపాటు ఆయా విభాగాలకు క్రీడాకారులను ఎంపిక చేయనున్నారు. సమావేశంలో క్రీడా సమన్వయకర్త ఎ.కిరణ్ కుమార్, జడ్పీ హైస్కూల్ సుసన్నకుమార్, హెచ్ఎంలు పాల్గొన్నారు.

సీతారాం ఏచూరికి నివాళి

టంగుటూరు, సెప్టెంబరు 18 : నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి తుదిశ్వాస వరకూ నిలిచిన యోధుడు సీతారం ఏచూరి అని సీపీఎం మండల కన్వీనర్ వి.మోజెస్ అన్నారు. ఏచూరి సంస్మరణ కార్యక్రమం మండలంలోని పొందూరులో బుధవారం జరిగింది. ముందుగా సీపీఎం నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్‌కే మీరాస్, వేజండ్ల వెంకటరత్నం, సుబ్బారావు, భీమవరపు రమణయ్య, ముప్పరాజు రమేష్, హరిక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆస్టర్ రమేష్ హాస్పిటల్‌లో 'పార్టో' ఆపరేషన్

• జిల్లాలో మొట్టమొదటి చికిత్స విజయవంతం



సమావేశంలో మాట్లాడుతున్న వైద్యులు

ఒంగోలు(కార్పొరేషన్), సెప్టెంబరు 18 : ఒంగోలులోని ఆస్టర్ రమేష్ హాస్పిటల్‌లో క్లిష్టమైన జీర్ణకోశవ్యాధికి జిల్లాలో మొట్టమొదటిసారిగా 'పార్టో' శస్త్రచికిత్స విజయవతంగా చేసినట్లు అంతర్జాతీయ జీర్ణకోశ వైద్యనిపుణులు తేజ చామల తెలిపారు. బుధవారం ఒంగోలులోని ఆస్టర్ రమేష్ హాస్పిటల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో తేజ మాట్లాడుతూ కంభం పట్టణానికి చెందిన 65 ఏళ్ల వయస్సు గల వ్యక్తి తీవ్రమైన రక్తపు వాంతుల సమస్యతో బాధపడుతూ ఆస్టర్ రమేష్‌లో చేరినట్లు చెప్పారు. జీర్ణకోశ వైద్య నిపుణురాలు విదేహ రోగికి ఎండోస్కోప్ పరీక్షలు చేసి, కాలేయ వ్యాధితో అన్నవాహిక లోపల వైపు, బయట, అన్నవాహిక కింద భాగాలలో నాళాలు ఉబ్బి ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. రక్తస్రావం అవుతున్నట్లు నిర్ధారణకు రావడంతో ఎండోస్కోపి ద్వారా 'గ్లూ' ను రక్తనాళాలకు పంపించి అదుపు చేసి తదనంతరం సిటీ స్కాన్ పరీక్షలు నిర్వహించగా రక్తనాళాల ఉబ్బడం వల్ల మరలా రక్తస్రావం అయ్యే అవకాశం ఉండటంతో దానిని తగ్గించడానికి అవసరమైన చర్యలు తీసుకున్నట్లు వివరించారు. అన్నవాహిక దిగువ భాగంలో ఉండే సిరలలో తీవ్రమైన రక్తస్రావం జరుగుతున్న పరిస్థితులలో దానిని ఆపి ప్రాణాహాని నుంచి కాపాడినట్లు తెలిపారు. జిల్లాలో ఇటువంటి అత్యాధునిక చికిత్సా విధానం మొట్టమొదటిసారిగా నిర్వహించిన వైద్యులను ఆస్టర్ రమేష్ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పోతినేని రమేష్‌బాబు అభినందించారు. సమావేశంలో ఆస్టర్ హాస్పిటల్స్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ డాక్టర్ నల్లూరి నితిన్, సీఈవో డాక్టర్ హరికుమార్‌రెడ్డి, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.వంశీకృష్ణ, డాక్టర్ కళ్యాణి, డాక్టర్ యలవర్తి కార్తీక్‌చౌదరి పాల్గొన్నారు.

ప్రతి కార్మికుడు పనిచేయాల్సిందే : కమిషనర్

ఒంగోలు(కార్పొరేషన్), సెప్టెంబరు 18: నగర సుందరీకరణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని కమిషనర్ వెంకటేశ్వరరావు హెచ్చరించారు. బుధవారం ఒంగోలులోని మస్టర్ పాయింట్‌లను తనిఖీ చేశారు. పనికి రాకుండా వేతనాలు తీసుకుంటే ఇక కుదరదని స్పష్టం చేశారు. పని చేసే వారు తక్కువ, పెత్తనం చేసేవారు ఎక్కువ అయ్యారని, ఇప్పటికే ఫిర్యాదులు అధికంగా వస్తున్నాయన్నారు. పేరుకు ప్రతి ఒక్కరు కార్మికులుగా ఉన్నారని, కొందరు ఆఫీసులో అటెండర్లుగా, మరికొందరు మేస్త్రీలుగా ఉంటున్నారని చెప్పారు. మస్టర్‌కు రాని కార్మికులను గుర్తించి తనకు నివేదించాలని ఆదేశించారు. అనంతరం స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా స్థానిక కేంద్రీయ విద్యాలయలో విద్యార్థులకు అవగాహన కల్పించారు.

వరద బాధితుల కోసం విరాళాల అందజేత



విరాళాలను ఎమ్మెల్యే విజయ్‌కుమార్‌కు అందజేస్తున్న నిడమానూరు నాయకులు



ఎమ్మెల్యే జనార్దన్‌కు చెక్కు అందిస్తున్న రవిబాబు

నాగులుప్పలపాడు సెప్టెంబరు 18 : విజయవాడ వరద బాధితులను ఆదుకొనేందుకు తెలుగుదేశం పార్టీ నాయకులు విరాళాలను సమకూర్చి అండగా నిలబడుతున్నారు. బినిడమానూరు అంబేడ్కర్ కాలనీకి చెందిన టీడీపీ నాయకులు సేకరించిన రూ.30వేలను బుధవారం ఒంగోలులో ఎమ్మెల్యే బీఎస్.విజయ్‌కుమార్‌కు అందజేశారు.

ఎమ్మెల్యే పరామర్శ : ఉప్పుగుండూరులోని జగ్జీవన్‌రామ్‌నగర్‌కు చెందిన టీడీపీ నాయకుడు కొలకలూరి నాగార్జున సతీమణి సునీత అనారోగ్యంతో ఒంగోలులోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతోంది. బుధవారం ఎమ్మెల్యే విజయ్‌కుమార్ పరామర్శించారు. మెరుగైన వైద్యసేవలు అందించాలని వైద్యులకు సూచించారు. ఆయన వెంట కనగాల శ్రీనివాసరావు, తెలగతోటి జాన్సన్, పొట్లూరి నాగమల్లేశ్వరరావు ఉన్నారు.

టంగుటూరు: వరద బాధితుల కోసం ఎస్సీ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ లింగంగుంట రవిబాబు రూ.లక్ష విరాళం ప్రకటించారు. ఈ మేరకు చెక్కును బుధవారం ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌కు అందజేశారు.

భూసేకరణను వేగవంతం చేయాలి : కలెక్టర్

ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 18: జిల్లాలోని బళ్ళారి-కడప-విజయవాడ జాతీయరహదారి నిర్మాణ పనుల కోసం చేపట్టిన భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో భూసేకరణపై సంబంధిత అధికారులతో జరిగిన సమావేశంలో మాట్లాడారు. జాతీయ రహదారి నిర్మాణ పనుల్లో భాగంగా ప్యాకేజీల వారీగా తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. రహదారులకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తున్నందున ఆ ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు సకాలంలో భూసేకరణ పూర్తయ్యేలా చూడాలని చెప్పారు. బీకేవీ జాతీయరహదారి నిర్మాణానికి సంబంధించి కోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసులు పరిష్కారం అయ్యేలా చూడాలన్నారు. భూములు కోల్పోయిన వారికి త్వరగా పరిహారం చెల్లించాలని తహసీల్దార్లను ఆదేశించారు వివాదాస్పద భూ సమస్యలను పరిష్కరించే విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. భూ నష్టపరిహారం చెల్లింపు విషయంలో వాస్తవ హక్కుదారులను గుర్తించాలని సూచించారు. సమావేశంలో డీఆర్వో శ్రీలత, ఎస్‌డీసీ వరకుమార్, జిల్లా అటవీ శాఖ అధికారి శ్రీనివాసరావు, ఆర్డీవోలు సుబ్బారెడ్డి, జాన్‌ఇర్విన్, ఎన్‌హెచ్ ఏఐ పీడీ విద్యాసాగర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

ఓటు నమోదుకు దరఖాస్తు చేసుకోవాలి

జిల్లాలో 18 ఏళ్ళు నిండిన యువతకు ఓటు హక్కు నమోదు కోసం రాజకీయపార్టీలు సహకరించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా సూచించారు. స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో బుధవారం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈనెల 20వ తేదీలోపు వచ్చే ఏడాది జనవరి 1వతేదీ నాటికి 18 సంవత్సరాలు నిండే వారు ఫారం-6 ద్వారా కొత్తగా ఓట్ల నమోదు చేసుకోవాలన్నారు. ఫారం-8 ద్వారా ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి మారిన వారు, చనిపోయిన వారి ఓట్లు తొలగింపు కోసం దరఖాస్తులు చేసుకోవచ్చని, ఆధార్ అనుసంధానానికి ఫారం6బి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఓటర్ల జాబితాలో ఓటు లేనివారు కూడా ఓటుహక్కు కోసం నమోదు చేసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో మార్కాపురం సబ్ కలెక్టర్, డీఆర్వో శ్రీలత, ఆర్డీవోలు సుబ్బారెడ్డి, జాన్‌ఎర్విన్, దర్శి డిప్యూటీ కలెక్టర్ లోకేశ్వరరావు, జిల్లా ఎన్నికలసెల్ సూపరింటెండెంట్ రాజ్యలక్ష్మి, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

మందుబాబులకు అడ్డాగా ఆర్‌బీకే!

• పట్టించుకోని అధికారులు

మర్రిపూడి, సెప్టెంబరు 18 : ప్రజా ధనం రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన ప్రభుత్వ భవనాలు అధికారుల నిర్లక్ష్యం కారణంగా నిరుపయోగంగా మారుతున్నాయి. అన్నదాతలకు మెరుగైన సేవలందించేందుకు మండల కేంద్రమైన మర్రిపూడిలో రూ.35లక్షలతో రైతు భరోసా కేంద్రాన్ని నిర్మించారు. గత సార్వత్రిక ఎన్నికలకు ముందు అప్పటి పురపాలక శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ నూతన భవనాన్ని ప్రారంభించారు. ఆరు నెలలు దాటుతున్నా ఇప్పటి వరకూ ఆశాఖ అధికారులు కార్యకలాపాలు ప్రారంభించలేదు. ప్రస్తుతం మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో ఉన్న వ్యవసాయాధికారి కార్యాలయం నుంచే అగ్రికల్చర్ అసిస్టెంట్ శివారెడ్డి విధులు నిర్వర్తిస్తున్నారు. రైతులకు అవసరమైన విత్తనాలు, వ్యవసాయ పరికరాలు తీసుకునేందుకు వ్యవసాయ అధికారి కార్యాలయానికి వెళ్లాల్సి వస్తోంది. అక్కడికి మండలంలోని 21 గ్రామ పంచాయతీల నుంచి నిత్యం పదుల సంఖ్యలో రైతులు వస్తుంటారు. చాలీచాలని ఆ కార్యాలయంలోనే ఆర్‌బీకే కార్యకలాపాలు కూడా నిర్వహిస్తుండటంతో మర్రిపూడి పంచాయతీ పరిధిలోని రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నూతనంగా నిర్మించిన భవనాన్ని వినియోగంలోకి తీసుకురాకపోవడంతో మందుబాబులకు అడ్డాగా మారింది. మద్యం సేవించి సీసాలను అక్కడే పగులగొడుతున్నారు. చీకటి పడితే చాలు అటువైపు వెళ్లేందుకు బహిళలు భయపడిపోతున్నారు. ఆధునిక హంగులతో భవనాన్ని నిర్మించినప్పటికీ అందులో కార్యకలాపాలు నిర్వహించకపోడంలో ఆంతర్యం ఏమిటో అర్థంకావడం లేదు. ఇప్పటికైనా వ్యవసాయ అధికారులు స్పందించి ఆర్‌బీకే భవనంలో కార్యకలాపాలు కొనసాగించాలని రైతులు కోరుతున్నారు.



రైతుభరోసా కేంద్రం

భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

• సీఐటీయూ డిమాండ్

నాగులుప్పలపాడు సెప్టెంబరు 18: భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ నాయకుడు జి.శ్రీనివాసరావు కోరారు. బుధవారం నాగులుప్పలపాడు తహసీల్దార్ కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం 1214 జీవో తీసుకొచ్చి కార్మిక సంక్షేమ బోర్డు కార్యకలాపాలను నిలిపివేసి నిధులను దారి మళ్లించి కార్మికులకు ద్రోహం చేసిందని ఆరోపించారు. దీంతో బీమా సౌకర్యం, ఇతర పథకాలు అమలు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ కూటమి ఇచ్చిన హామీ మేరకు 1214 జీవో రద్దు చేసి పెండింగ్ క్లయిమ్‌లను పునరుద్ధరించి బోర్డు ద్వారా సంక్షేమ పథకాలను అమలు చేయాలని కోరారు. దారి మళ్లిన బోర్డు నిధులను తిరిగి జమ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జి.బసవ పున్నయ్య, నలతోటి రామారావు, గుంజి అంకమ్మ, యు.నాగేశ్వరరావు, జె.భాస్కరరావు, పలువురు కార్మికులు పాల్గొన్నారు.



తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ప్రజా సేవలో భాగంగానే జాబ్‌మేళా : లక్ష్మి

దర్శి, సెప్టెంబరు 18 : ప్రజాసేవలో భాగంగానే దర్శిలో మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి చెప్పారు. స్థానిక పీటీఎస్ కల్యాణ మండపంలో బుధవారం డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ, డాక్టర్ లలిత్‌సాగర్ దంపతుల ఆధ్వర్యంలో సొంత నిధులతో ఏర్పాటు చేసిన మెగా జాబ్ మేళాను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలోని యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ఈ బృహత్కర కార్యక్రమం చేపట్టామన్నారు. ఈ ప్రక్రియను నిరంతరం కొనసాగిస్తామని చెప్పారు. ప్రస్తుతం ఇంటర్వ్యూలకు వచ్చి ఉద్యోగం రానివారు నిరుత్సాహం పడాల్సిన అవసరం లేదని, హెచ్‌ఆర్‌సీవో సంస్థ ద్వారా శిక్షణ ఇప్పించి మళ్లీ ఏర్పాటు చేసే జాబ్‌మేళా ద్వారా ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. ప్రతి ఆరు నెలలకు ఒకసారి జాబ్‌మేళా ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు. జాబ్‌మేళా ద్వారా ఉద్యోగ అవకాశాలు కల్పిస్తూ ఎన్నికల హామీలను నిలబెట్టుకుంటున్నామని చెప్పారు. గత 40 ఏళ్లుగా గొట్టిపాటి కుటుంబం ప్రజలకు నిస్వార్థ సేవలందించిన విషయం తెలిసిందేనన్నారు. తన తాతా, తండ్రి చేసిన సేవల స్ఫూర్తితో ప్రజాసేవలో ముందుకు సాగుతామని చెప్పారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ అడుగుజాడల్లో నడుస్తూ కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చిత్తశుద్ధిగా ప్రజలకు అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, తాళ్లూరు ఎంపీపీ శ్రీనివాసరావు, దర్శి నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గొట్టిపాటి లక్ష్మి

వెయిట్ లిఫ్టింగ్‌లో బంగారు పతకం

టంగుటూరు, సెప్టెంబరు 18 : అమలాపురంలో జరిగిన రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో టంగుటూరు పంచాయతీ పరిధిలోని రావివారిపాలెంకు చెందిన విద్యార్థిని బండి రమ్య ప్రతిభ కనబర్చారు. జరుగుమల్లి మండలం కె.బిట్రగుంట కేజీబీవీ కళాశాల సీనియర్ ఇంటర్ చదువుతున్న ఆమె 96కిలోల విభాగంలో బంగారు పతకం సాధించి జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. రమ్యను కళాశాల ప్రిన్సిపాల్ స్రవంతి, పీఈటీ హెబ్సిబా, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, విద్యార్థులు, స్థానికులు అభినందించారు.



రమ్యను అభినందిస్తున్న నిర్వాహకులు

ఘనంగా లక్ష్మీనరసింహుడి పవిత్రోత్సవాలు

సింగరాయకొండ, సెప్టెంబరు 18 : మండలంలో దక్షిణ సింహాచలంగా ప్రసిద్ధిగాంచిన పాతసింగరాయకొండ వరాహ లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానంలో పవిత్రోత్సవాలు కనుల పండువగా జరుగుతున్నాయి. మూడోరోజైన బుధవారం మూలవిరాట్ వరాహ లక్ష్మీనరసింహస్వామి, అమ్మవార్లు భూదేవి, శ్రీదేవికి, యోగానంద వరాహ లక్ష్మీనరసింహస్వామి, స్వయంభు ఆంజనేయుడికి పూజలు చేశారు. అనంతరం ఉత్సవమూర్తులకు శాస్త్రోక్తంగా పవిత్ర సమర్పణ చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం అర్చకులు తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మాధవరావు, ఈవో కృష్ణవేణి, ప్రధాన అర్చకుడు వెంకట శేషా లక్ష్మీనరసింహాచార్యులు, అర్చకులు నరసింహాచార్యులు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో స్వామివార్లు

ఆంధ్రప్రదేశ్ - దేవదాయ ధర్మదాయ శాఖ

శ్రీ నారాయణస్వామి వారి దేవస్థానము

మిట్టపాలెం గ్రామం, కోవిలంపాడు పోస్టు, సి.యస్.పురం (మం), ప్రకాశం జిల్లా

టెండరు నోటీసు

నెం: 02/2024-2025 | తేది:18-09-2024

ప్రకాశం జిల్లా, సి.యస్.పురం మండలం, మిట్టపాలెం గ్రామంలో వేంచేసియున్న శ్రీ నారాయణ స్వామి వారి దేవస్థానమునకు **కిరాణా, లడ్డు, పడితరము, శానిటేషన్** సామాగ్రి సరఫరా చేయుటకు ఈ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా మాత్రమే టెండర్లు కోరడమైనది. ఈ టెండరు కాలపరిమితి **తేది.01-10-2024 నుండి తేది.30-09-2025 వరకు. షెడ్యూలు ఆఖరు తేది. 24-09-2024, ఉదయము 11.00 గం॥ల వరకు. పూర్తి వివరములకు www.apeprocurement.gov.in లో Endowments department marketing** నందు చూడగలరు.

వ్యవస్థాపక ధర్మకర్త | మిట్టపాలెం తేది. 18-09-2024 | కార్యనిర్వహణాధికారి సెల్: 8247714889

AJC ఆంధ్రజ్యోతి ప్రతిరోజు క్లాసిఫైడ్స్ ప్రతి అవసరానికి వేగవంతమైన ఫలితం

WANTED

■ నవయుగ పెట్రోలియమ్స్, త్రోవగుంట లోని కరవది రోడ్డులో గల పెట్రోలు బంకులో పనిచేయుటకు బాయ్స్, గర్ల్స్ కావలెను. సంప్ర॥ సెల్: **9866774691**

AJO-190476

సేల్స్ గర్ల్స్ కావలెను

■ ఒంగోలు ప్రముఖ ఫర్నీచర్ షాపులో పనిచేయుటకు సేల్స్ గర్ల్స్ కా॥ వయస్సు : 20 to 40లోపు, అర్హత : డిగ్రీ లేదా B.Tech Complete. జీతం: 20,000 + ఇన్సెంటివ్స్. సంప్ర॥ సెల్ : **83744 44414, 90305 90855**

AJO-200142

WANTED

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను / పేషంట్స్ చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం 18K. **Ph: 9160900024 / 9640400073**

AJH-15220

PLOT FOR SALE

■ చీరాల - ఊడ్ నగర్‌లో ఇండ్ల మధ్యలో తక్షణమే నిర్మాణానికి అనువైన 6 సెంట్లు ఖాళీ స్థలము మున్సిపల్ వాటర్ కనెక్షన్‌తో అమ్మకమునకు కలదు. **Cell : 98489 11566**

AJB-194015

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

ఆంధ్రజ్యోతి దినపత్రిక ద్వారా ఇప్పుడు మీ ఆత్మీయులకు ప్రకటనలతో మరింత చేరువకండి.

జన్మదిన శుభాకాంక్షలు | వివాహ/షష్టిపూర్తి శుభాకాంక్షలు

విదేశీయాన / స్వదేశాగమన శుభాకాంక్షలు | లీగల్ నోటీసులు బ్యాంకు ప్రకటనలు

ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు | మొదలగు అన్ని రకముల పత్రికా ప్రకటనలకు మీ ఏరియాలోని మా ప్రతినిధిని సంప్రదించండి. ప్రతి ప్రకటనపై GST 5% అదనం.

ఒంగోలు : 99854 11071, 97036 18694, 99854 11483

చీమకుర్తి : 96525 55752

చీరాల : 99859 21376

మార్కాపురం : 99859 21358

కందుకూరు : 97036 18697

కనిగిరి : 99854 11483

గిద్దలూరు : 99859 21358

ఆంధ్రజ్యోతి దినపత్రిక కొరకు సంప్ర॥ 9985411484


విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న ఎంపీడీవో నరసింహులు

కష్టపడితేనే ఉజ్వల భవిష్యత్తు

తర్లుపాడు, సెప్టెంబరు 18: విద్యార్థి దశలో కష్టపడితేనే జీవితంలో ఉజ్వల భవిష్యత్తుకు పునాది వేసుకోగలరని ఎంపీడీవో ఎస్.నరసింహులు అన్నారు. కలుజువ్వలపాడులోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు రామ్‌భూపాల్‌రెడ్డి ప్రశంసాపత్రాలు, మెమెంటోలను అందజేశారు. ఈ సందర్భంగా రామ్‌భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ బాలికలు విద్యకు, వారి సంక్షేమానికి తన వంతు కృషి చేస్తున్నట్లు తెలిపారు. 100 మంది పేద విద్యార్థినులకు విద్య కోసం సుకన్య యోజన పథకం ద్వారా బాలికల అకౌంట్‌లలో నగదు జమచేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మారుతీదేవి మాట్లాడుతూ ప్రధాని మోదీ మన్‌కీ బాత్ గుర్తించిన ప్రముఖుల్లో రామ్‌భూపాల్‌రెడ్డి ఒకరని, పేద విద్యార్థినులకు ఆయన ఎంతో కృషి చేస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్ చంద్రశేఖర్, సచివాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.


డీఎస్పీ నాగరాజుతో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

డివిజన్‌లో సమస్యలను పరిష్కరించండి

మార్కాపురం వన్‌టౌన్, సెప్టెంబరు 18: మార్కాపురం డివిజన్‌లో నెలకొన్న పలు సమస్యలను పరిష్కరించాలని బీజేపీ నాయకులు నూతన డీఎస్పీ డీఎస్పీ నాగరాజుకు విన్నవించారు. స్థానిక డీఎస్పీ కార్యాలయంలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆయన్ను బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం డీఎస్పీని బీజేపీ నాయకులు సన్మానించారు. ఈ సందర్భంగా నాయకులు డీఎస్పీకి పలు సమస్యలు వివరించారు. డివిజన్‌లో ట్రాఫిక్ నియంత్రించాలని, మాదకద్రవ్యాలు, గంజాయి వంటి వాటిని నివారించాలన్నారు. రోడ్లపై ఆవులు విచ్చలవిడిగా తిరుగుతూ ఇబ్బందులు పెడుతున్నాయని, దేవాలయాలకు చెందిన ఎటువంటి ఆవులు లేవని, అవి అన్ని ప్రైవేట్ యజమానులని తెలిపారు. రోడ్లపై తిరుగుతున్న సమయంలో ఆవులు అనేక ప్రమాదాలకు గురవుతున్నాయని వివరించారు. గోవుల యజమానులపై చర్యలు తీసుకోవాలన్నారు. డీఎస్పీని కలిసిన వారిలో బీజేపీ నాయకులు పీవీ కృష్ణారావు, బొంతల కృష్ణ, శాసనాల సరోజిని, పైడిమర్రి శ్రీనివాసరావు, చిన్నయ్య, చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

ఉసురుతీసిన అప్పులు

పురుగుల మందు తాగి రైతు ఆత్మహత్య

నాలుగేళ్లుగా సాగులో నష్టాలు


రైతు వెంకటరెడ్డి మృతుదేహాన్ని పరిశీలిస్తున్న ఇన్‌చార్జి ఎస్‌ఐ చౌడయ్య

పుల్లలచెరువు, సెప్టెంబరు 18: పంటల సాగుకు చేసిన అప్పులు తీర్చలేక రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన పుల్లలచెరువు మండలం ఆర్.ఉమ్మడివరం చోటు చేసుకుంది పోలీసుల కథనం ప్రకారం ఆర్.ఉమ్మడివరం గ్రామానికి చెందిన కుందురు వెంకటరెడ్డి(59) తనకున్న నాలుగు ఎకరాల్లో మిర్చి ,పత్తి పంటలు సాగు చేశాడు. పంటలు పండక అప్పుల పాలయ్యాడు. అప్పు తీర్చలేనన్న బాధతోనే మంగళవారం తన పొలంలో పురుగుల మందు తాగాడు.గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే నర్సారావుపేట ప్రయివేటు వైద్యశాలకు తరలించి చికిత్స చేయిస్తుండగా బుధవారం మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎర్రగొండపాలెం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. భార్య నాగేంద్రమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌చార్జి ఎస్‌ఐ చౌడయ్య తెలిపారు. రైతుకు ముగ్గురు పిల్లలు భార్య ఉన్నారు.

పలువురికి సన్మానం

గిద్దలూరు, సెప్టెంబరు 18 : తొలి స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డికి భారతరత్న అవార్డు ఇవ్వాలనే ప్రచారంలో భాగంగా పలువురిని సన్మానించారు. పట్టణంలోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థాన నూతన అధ్యక్షునిగా ఎంపికైన వాడకట్టు రంగసత్యనారాయణను, గౌరవాధ్యక్షులు గర్రె వెంకట సత్యనారాయణను ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా గురూజీ నారాయణరెడ్డి ఉయ్యాలవాడ నరసింహారెడ్డి చిత్రపటాలు అందచేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన కమిటీ ప్రతినిధులు తుమ్మలపెంట సత్యనారాయణ, ముప్పూరి చంటి, దమ్మాల జనార్దన్, సూరె రామచంద్రుడు, గర్రె ప్రసాద్, చిన్ని సేవాసంస్థ అధ్యక్షులు మాగులూరి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు. కాగా రిటైర్డ్ చీఫ్ ఇంజనీర్ ఈదుల రంగారెడ్డిని సైతం యోగా గురూజీ నారాయణరెడ్డి కాపు సంఘం నాయకులు దుత్తా బాలీశ్వరయ్య, బీజేపీ కిసాన్‌మోర్చ కార్యదర్శి పిడతల రమేష్‌రెడ్డి, తదితరులు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి చిత్రపటాన్ని అందచేసి ఘనంగా సన్మానించారు.

ట్రయల్ రన్ విజయవంతం

గిద్దలూరు, సెప్టెంబరు 18 : గుంటూరు - గుంతకల్లు రైల్వే డబ్లింగ్ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇప్పటికే గుంటూరు నుంచి గిద్దలూరు వరకు డబ్లింగ్ పనులు పూర్తి కాగా రైళ్ళు పరుగెడుతున్నాయి. గిద్దలూరు నుంచి దిగువమెట్ట వరకు డబ్లింగ్ పనులు దాదాపు పూర్తయ్యాయి. గిద్దలూరు పట్టణ శివారులో సగిలేరునదిపై డబ్లింగ్ లైన్ కోసం నూతనంగా బ్రిడ్జి నిర్మించారు. ఈ బ్రిడ్జిపై ట్రాక్ పనులు పూర్తి కాగా రైల్వే అధికారులు ప్రత్యేక రైలుతో నిర్వహించిన ట్రయల్ రన్ విజయవంతంగా జరిగింది. ట్రాక్ సురక్షితంగా ఉన్నట్లు, రాకపోకలకు ఎలాంటి ఇబ్బంది లేదని రైల్వే శాఖ ఇంజనీర్లు ఈసందర్భంగా పేర్కొన్నారు. త్వరలోనే గిద్దలూరు-దిగువమెట్ట మధ్యన డబ్లింగ్ లైన్ వినియోగంలోకి రానున్నది.

పీఎం జన్మన్‌ను విజయవంతం చేయాలి

● డీఎల్‌డీవో సాయికుమార్


సమావేశంలో మాట్లాడుతున్న డీఎల్‌డీవో సాయికుమార్

పెద్ద దోర్నాల, సెప్టెంబరు 18:ప్రధానమంత్రి జన్మన్ పథకాన్ని విజయవంతం చేయాలని డీఎల్‌డీవో సాయికుమార్ అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గ్రామ కార్యదర్శులు, వీఆర్వోలు, సచివాలయం సిబ్బందికి పీఎం జన్మన్‌పై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఎంపీడీవో నాసర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సమీక్షా సమావేశంలో సాయికుమార్ మాట్లాడుతూ అన్ని గిరిజన గ్రామాల్లో మౌలిక వసతులు,చెంచు గిరిజనుల వ్యక్తిగత అవసరాలు గుర్తించి నివేదికలు రూపొందించడం ద్వారా పరిష్కారానికి చర్యలు చేపట్టవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో మస్తాన్ నాయక్, పంచాయతీ ఈవో మోహన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

రోగులకు మెరుగైన సేవలందించండి

ప్రభుత్వ సర్వజన వైద్యశాలను ఆకస్మిక తనిఖీ చేసిన ఎమ్మెల్యే కందుల


ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో రోగులను అడిగి సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

మార్కాపురం, సెప్టెంబరు 18: రోగులకు మెరుగైన సేవలందించేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి వైద్యులను ఆదేశించారు. స్థానిక ప్రభుత్వ సర్వజన వైద్యశాలను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వైద్యశాలలోని ప్రతి విభాగానికి వెళ్లారు. ప్రధానంగా రోగులను, వారికి అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. స్వయంగా ఆయన కాలికి ఎక్స్‌రే తీయించుకున్నారు. అనంతరం వైద్యులు, అన్నిస్థాయిల సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నారాయణరెడ్డి మాట్లాడుతూ వైద్యశాలకు వచ్చే రోగులు ప్రతి ఒక్కరికి అంకితభావంతో సేవలందించాలన్నారు. వైద్యశాలకు అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పించేందుకు తన శక్తివంచనలేకుండా కృషి చేస్తానన్నారు. ప్రతి నెలా తాను వైద్యశాలలో సమీక్ష నిర్వహిస్తానన్నారు. ఎలాంటి సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని వైద్యులకు సూచించారు. ఈ సందర్భంగా నూతనంగా నియమించిన వైద్యశాల కమిటీ సభ్యులు సూర పరమేశ్వర రెడ్డి, కాకర్ల శ్రీనివాసులు, చక్కా మధుసూదనరావు, పిల్లెబోయిన పద్మావతిలను వైద్యులు, సిబ్బందికి పరిచయం చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సావిత్రి, మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రాజమన్నార్, అన్ని విభాగాల వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

నూతన ఆర్టీసీ బస్సులు ప్రారంభించిన ఎమ్మెల్యే కందుల

మార్కాపురం ఆర్టీసీ డిపోకు కేటాయించిన 4 నూతన ఆర్టీసీ బస్సులను స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా బస్టాండ్ నుంచి ఎస్‌వీకేపీ కళాశాల రోడ్డులోని ఆర్టీసీ డిపో వరకు స్వయంగా తానే బస్సు నడిపి కందుల అందరిని ఉత్సాహ పరిచారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 1986లో ఏర్పడిన మార్కాపురం డిపో నేడు 103 బస్సులతో పశ్చిమ ప్రకాశంలోనే పెద్ద డిపోగా ఎదిగి ప్రజలకు మెరుగైన సేవలందిస్తున్నదన్నారు. త్వరలోనే మార్కాపురం జిల్లా ఏర్పాటు, వెలిగొండ ప్రాజెక్టు పూర్తికి ప్రభుత్వ పెద్దలతో మాట్లాడి చేసి ప్రజలు, రైతుల కళ్లలో ఆనందం చూస్తానన్నారు. పొదిలి పట్టణానికి చెందిన సుబ్బారావు విజయవాడ వరద బాధితుల సహాయార్థం సీఎం సహాయ నిధికి రూ.లక్ష చెక్కును ఎమ్మెల్యే కందులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పోల్ మేనేజ్మెంట్ ఇన్‌చార్జ్ కందుల రామిరెడ్డి, డిపో మేనేజర్ ఏఎస్ నరసింహులు, వివిధ యూనియన్‌ల నాయకులు పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి

● స్వచ్ఛత హీ సేవ ప్రారంభంలో డీఎల్పీవో సుధారాణి


బేస్తవారపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న డీఎల్పీవో సుధారాణి

బేస్తవారపేట,సెప్టెంబరు18: గ్రామాల్లో పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని డీఎల్పీవో వై.సుధారాణి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేసిన స్వచ్ఛత హిసేవ కార్యక్రమంలో భాగంగా బుధవారం బేస్తవారపేటలో కార్యక్రమాన్ని ప్రారంభించారు. స్వచ్ఛత పరుగు,సైకిల్, మారథాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దోమలు, చీడ పురుగుల నివారణకు స్ప్రే చేసి నీటి నిల్వలను తొలగించి బ్లీచింగ్ చల్లాలని సూచించారు.పారిశుధ్య కార్మికులకు ప్రథమ చికిత్స గురించి తగు సూచనలు ఇచ్చారు. బేస్తవారపేటలోని నిర్వహిస్తున్న పరిశుభ్రత కార్యక్రమాలను పరిశీలించారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో టి.పార్వతి, కార్యదర్శి ఎన్.నరేంద్ర, డి.ప్రేమానంద్,ఆశా కార్యకర్తలు,సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల ర్యాలీ

పెద్ద దోర్నాల : స్వచ్ఛత హీ సేవలో భాగంగా రెండో రోజు బుధవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. పంచాయతీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీని ఎంఈవో మస్తాన్ నాయక్, ప్రధానోపాధ్యాయులు ఎస్‌వీ నారాయణ రెడ్డి, పంచాయతీ ఈవో మోహన్‌రావు, ఏపీఎం పోలయ్య ర్యాలీని ప్రారంభించారు.స్వచ్ఛతతోనే ఆరోగ్యం పదిలం అంటూ విద్యార్థులు నినాదాలు చేశారు. ఈ క్రమంలో పంచాయతీ కార్మికులు మురికిగుంతల్లో, కాలువల్లో నిల్వ ఉన్న మురికి నీటిని తొలగించి బ్లీచింగ్ పౌడర్ చల్లారు.

మొక్కలను నాటండి - పర్యావరణాన్ని పరిరక్షించండి

మార్కాపురం రూరల్ : సమాజంలో ప్రతి ఒక్కరూ తమ పరిసరాలలో మొక్కలను నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని డీఎల్‌డీవో సాయికుమార్ కోరారు. మండలంలోని దరిమడుగు గ్రామంలో బుధవారం స్వచ్ఛత హీ సేవా కార్యక్రమం ఎంపీడీవో చందన, ప్రజాప్రతినిధులతో కలిసి ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రధాన వీధులలో ర్యాలీ నిర్వహించి మొక్కలను నాటారు. గ్రామ ప్రజలకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బట్టగిరి గౌతమి, టీడీపీ నాయకులు జవ్వాజి రామాంజులరెడ్డి, పంచాయతీ సెక్రటరీ నారాయణరెడ్డి, బట్టగిరి గోపీనాథ్‌రెడ్డి, సచివాలయ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

సరిపడినంత ఇసుకను అందించాలి

ధర్నాల్లో భవన నిర్మాణ కార్మికులు



గిద్దలూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

గిద్దలూరు, సెప్టెంబరు 18 : ఇసుక కొరతపై సీఐటీయూ ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికులు స్థానిక రెవిన్యూ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఇసుక సరిపడినంత రాకపోవడంతో భవన నిర్మాణాలు ఆగిపోయాయని, తద్వారా ఈ రంగంపై ఆధారపడి జీవించే 36 రకాల వృత్తిదారులు పనులు లేక ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లా సహాయ కార్యదర్శి టి.ఆవులయ్య మాట్లాడుతూ అధికారంలోకి రాగానే ఇసుక పాలసీని సమీక్షించి ఉచితంగా సరఫరా చేస్తామని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చినప్పటికీ ఇసుక అందుబాటులో లేకపోవడం శోచనీయమన్నారు. 1214 నెంబరు మెమోను రద్దు చేసి భవన నిర్మాణ సంక్షేమ బోర్డు కార్యక్రమాలను పునరుద్ధరించాలని, పెండింగ్ క్లైమ్స్ ఇవ్వాలని, ఇతర పథకాలకు మళ్లించిన నిధులను జమ చేయాలని, వెంటనే ఇసుకను అందుబాటులోకి తెచ్చి కార్మికులకు పనులు కల్పించాలని కోరారు. అనంతరం తహసీల్దార్ ఆంజనేయరెడ్డిని కలిసి వినతి పత్రం అందించారు. ఈకార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం ప్రతినిధులు దినేష్, భాస్కర్, నారాయణ, చెన్నకేశవులు, నాయకులు నరసింహులు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక సమస్య పరిష్కరించాలి

మార్కాపురం వన్‌టౌన్ : ఇసుక సరిపడా అందించి భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి కల్పించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు బుధవారం స్థానిక లేబర్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి డీకేఎం రఫి మాట్లాడారు. అనంతరం కార్మిక అధికారికి వినతిపత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాగరాజు, సుబ్బరాయుడు, జవ్వాజి రాజు, అభినయ్ కుమార్, నాగూర్, పిచ్చిరెడ్డి, అనూష తదితరులు పాల్గొన్నారు.


కార్మిక అధికారికి వినతిపత్రం ఇస్తున్న కార్మికులు

పొదిలిలో..

పొదిలి : భవన నిర్మాణాలకు తగినంత ఇసుకను అందించి కార్మికులకు ఇబ్బందులు లేకుండా చూడాలని భవన నిర్మాణకార్మిక సంఘం ఆధ్వర్యంలో బుధవారం తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. యూనియన్ నాయకులు మస్తాన్, పాపారావు, సీఐటీయు జిల్లా కార్యదర్శి ఎం. రమేష్ తదితరులు మాట్లాడారు.భవన నిర్మాణ కార్మికులు ఎస్. వెంకటనర్సయ్య, తిరుపతయ్య, సుబ్బయ్య, కొండలు తదితరులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్‌కు విరాళాలు

గిద్దలూరు టౌన్, సెప్టెంబరు 18 : గిద్దలూరులో ప్రారంభం కానున్న అన్న క్యాంటీన్ నిర్వహణకు దాతలు ముందుకు వస్తున్నారు. ఎమ్మెల్యే అశోక్ రెడ్డికి విరాళాల చెక్కులను అందచేస్తున్నారు. కంభం పట్టణానికి చెందిన ఆరె బ్రహ్మయ్య 10,166 రూపాయలు, బంగారు వ్యాపారి బిజ్జాల కిశోర్ 10,116, కొమరోలు మండలం గోనేపల్లికి చెందిన ఏలూరి రమణయ్య 10,116, గిద్దలూరు ప్రభుత్వ వైద్యశాలలో పని చేస్తున్న డాక్టర్ ఆడామ్ 15వేల చెక్కులను ఎమ్మెల్యే అశోక్‌రెడ్డికి బుధవారం అందచేశారు. ఈకార్యక్రమంలో టీడీపీ నాయకులు కొత్తపల్లి శ్రీనివాసులు, గోన చెన్నకేశవులు, కటికల భాస్కర్, అంకయ్యగౌడ్, పాల్వాయ్ మురళి, తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే అశోక్‌రెడ్డికి విరాళాలు అందచేస్తున్న దాతలు

కంభం సీఐగా మల్లికార్జున



కంభం, సెప్టెంబరు 18 : కంభం సీఐగా కె.మల్లికార్జున బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఒంగోలు ట్రాఫిక్ సీఐగా విధులు నిర్వహించిన మల్లికార్జున కంభంకు బదిలీ కాగా కంభం సీఐగా పని చేస్తున్న రామకోటయ్య గిద్దలూరు రూరల్ సీఐగా బదిలీపై వెళ్లారు.

మండలస్థాయి క్రీడాపోటీలు ప్రారంభం

కంభం, సెప్టెంబరు 18 : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండలస్థాయి క్రీడాపోటీలను ఎంపీపీ చేగిరెడ్డి తులసమ్మ, జడ్పీటీసీ కొత్తపల్లి జ్యోతి ప్రారంభించారు. ఎంఈవో మాల్యాద్రి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ గెలుపు ఓటములను సమానంగా స్వీకరించాలన్నారు. సామర్థ్యాలను మెరుగు పరచుకుంటూ విజయబాటను ఎగురవేయాలన్నారు. కోకో, కబడ్డీ, వాలీబాల్, బాడ్మింటన్, యోగా, అథ్లెటిక్స్ పోటీలలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

టపాసుల దుకాణంపై దాడి

మార్కాపురం, సెప్టెంబరు 18: ఎలాంటి అనుమతులు లేకుండా ఇళ్లమధ్య టపాసులు అమ్ముతున్న దుకాణంపై పట్టణ పోలీసులు బుధవారం రాత్రి దాడి చేశారు. అక్కడ అక్రమంగా నిల్వవుంచిన రూ.2,400 విలువచేసే టపాసులను స్వాధీనం చేసుకున్నారు. దుకాణంలో ఉన్న ఉప్పలదిన్నె శివపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సైదుబాబు తెలిపారు. అనుమతులు లేకుండా ఇళ్లమధ్య అక్రమంగా టపాసులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

చిరుధాన్యాలలో పోషక విలువలు ఎక్కువ

తర్లుపాడు, సెప్టెంబరు 18: చిరు ధాన్యాలతో వండిన వంటకాల్లో పోషకాలు ఎక్కువగా ఉంటాయని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కృష్ణవేణి అన్నారు. మండలంలోని నాగెళ్లముడుపు అంగన్‌వాడీ కేంద్రాల్లో చిరుధాన్యాలతో తయారుచేసిన వంటకాలను స్టాల్స్‌గా ప్రదర్శించారు. మొలకెత్తిన రాగులు, సజ్జలు, జొన్నలు, ఆకుకూరలు వంటివి తినటం వలన పోషకాహారాలు ఎక్కువగా ఉంటాయని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ హనుమంజులాదేవి, మాలకొండమ్మ, కుమారి, నజీమ, ఏఎన్‌ఎంలు, గర్భిణులు, చిన్నారులు పాల్గొన్నారు.

పెద్దనాగులవరంలో ప్రత్యేక ఆధార్ క్యాంపు

మార్కాపురం రూరల్ 18. మండలంలోని పెద్దనాగులవరం గ్రామ ఎస్టీ కాలనీలో ప్రత్యేక ఆధార్ క్యాంప్ నిర్వహించనున్నట్లు ఎంపీడీవో చందన బుధవారం తెలిపారు. పెద్దనాగులవరం గ్రామంలో చెంచు ప్రజలందరికీ ఆధార్ కార్డు ఇవ్వాలనే ముఖ్య ఉద్దేశంతో ఈ నెల 20 వ తేదీన ప్రభుత్వ అనుమతితో ఈ క్యాంప్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని గ్రామస్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

వైభవంగా త్రిపురాంతకేశ్వరాలయ గిరి ప్రదక్షిణం


త్రిపురాంతకేశ్వరాలయలో గిరి ప్రదక్షిణం చేస్తున్న భక్తులు

త్రిపురాంతకం, సెప్టెంబరు 18: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం త్రిపురాంతకేశ్వరస్వామి ఆలయ గిరి ప్రదక్షిణ కార్యక్రమాన్ని పౌర్ణమి సందర్భంగా బుధవారం వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు విశ్వన్నారాయణశాస్త్రి ఆధ్వర్యంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి తూర్పు వైపు మెట్ల నుంచి ప్రదక్షిణం ప్రారంభించారు. మంగళవాయిద్యాల నడుమ ఓం నమః శివాయ నామ మంత్రాన్ని జపిస్తూ కొండ చుట్టూ ప్రదక్షిణ చేశారు. అనంతరం త్రిపురాంతకేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఈకార్యక్రమంలో ఆలయ పాలక మండలి చైర్మన్ ఇమ్మడిశెట్టి సుబ్బారావు, భక్తులు, హిందూ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే కందులకు పూల మొక్కను అందజేస్తున్న డీఎస్పీ నాగరాజు

ఎమ్మెల్యేను కలిసిన డీఎస్పీ

మార్కాపురం, సెప్టెంబరు 18: మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డిని నూతనంగా విధుల్లో చేరిన డీఎస్పీ యు.నాగరాజు బుధవారం ఉదయం మర్యాదపూర్వకంగా కలిశారు. ముందుగా పూలమొక్క అందజేసి డివిజన్ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. శాంతిభద్రతల పరిరక్షణకు శక్తివంచన లేకుండా పనిచేయాలని ఎమ్మెల్యే నారాయణ రెడ్డి సూచించారు.

23 లోపు ఈ క్రాప్ చేయించాలి


రైతులకు ఈకేవైసీ చేయిస్తున్న ఏవో జవహర్ లాల్ నాయక్

పెద్ద దోర్నాల, సెప్టెంబరు 18:మండలంలోని రైతులు ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలను ఈ క్రాప్ యాప్‌లో నమోదు చేసుకోవాలని వ్యవసాయాధికారి జవహర్ లాల్ నాయక్ అన్నారు. స్థానిక రైతు సేవా కేంద్రంలో బుధవారం కొందరు రైతులకు ఈకేవైసీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 23వ తేదీ లోపు సాగు చేసిన ప్రతి రైతు ఈ క్రాపులో నమోదు చేసుకోవాలని, అదే విధంగా ఈకేవైసీ చేసుకున్నవారికి మాత్రమే ప్రభుత్వ పథకాలు అమలు చేస్తారని ఆఆయన తెలిపారు.

పోలీసు అధికారులను కలిసిన వక్కలగడ్డ

మార్కాపురం, సెప్టెంబరు 18: తెలుగుదేశం పార్టీ రాష్ట్ర వాణిజ్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వక్కలగడ్డ మల్లిఖార్జున్ బుధవారం పోలీసు అధికారులను మర్యాదపూర్వకంగా కలిశారు. ముందుగా మార్కాపురం డీఎస్పీ యు.నాగరాజును కలిసి పుష్పగుచ్ఛం అందజేసి పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ప్రధానంగా ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం పట్టణ ఎస్సై సైదుబాబును కూడా మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట టీడీపీ నాయకులు ఆలంపల్లి శ్రీనివాసులు, సయ్యద్ గఫార్, ఎల్.శ్రీను, మల్లిఖార్జున యాదవ్‌లు పాల్గొన్నారు.

పాఠశాలకు మూడు కంప్యూటర్లు బహూకరణ


పాఠశాలకు కంప్యూటర్లు బహూకరిస్తున్న మాలకొండయ్య

తర్లుపాడు, సెప్టెంబరు 18: తర్లుపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకున్న పూర్వపు విద్యార్థి(1968లో పదోతరగతి) కశ్శెట్టి కొండయ్య పాఠశాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తున్నట్లు తెలిపారు. పాఠశాలకు రూ.75వేలు విలువజేసే 3 కంప్యూటర్లను ప్రధానోపాధ్యాయులు ఎం.సుధాకర్ బాబుకు అందజేశారు. ఈ సందర్భంగా సుధాకర్ బాబు మాట్లాడుతూ.. త్వరలో జరుగనున్న సిల్వర్ జూబ్లీ వేడుకలకు పూర్వపు విద్యార్థులు తమ వంతు సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు చంద్రశేఖర్‌రెడ్డి, గోసు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు సమాజంతో మమేకం కావాలి

కంభం, సెప్టెంబరు 18 : ఉపాధ్యాయులు సమాజంతో కలిసిపోవాలని, కాన్సెప్ట్ కమిట్‌మెంట్ కలిగి ఉండాలని కాంప్లెక్స్ చైర్మన్ గని వెంకటేశ్వర్లు తెలిపారు. బుధవారం జంగంగుంట్ల జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కాంప్లెక్స్ సమావేశంలో ఉపాధ్యాయుల బోధనా పద్ధతులపై సమీక్షించారు. బట్టీ చదువులకు స్వస్తి పలికి భావనలను అర్థం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఆర్పీలు రవీంద్రనాయక్, మురళీమోహన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్షతగాత్రునికి నగదు సాయం


పొదిలి, సెప్టెంబరు 18 : కార్పెంటరీ పని చేస్తూ ప్రమాదానికి గురైన నారాయణకు విశ్వబ్రాహ్మణ సంఘం, కార్పెంటరీ యూనియన్ ఆధ్వర్యంలో 20వేల రూపాయల నగదును అందజేశారు. విరాట్‌నగర్‌కు కాలనీకి చెందిన నారాయణ ప్రమావశాత్తు కాలికిగాయం కారణంగా పనులకు వెళ్ళలేని పరిస్థితిలో ఉన్నందున కుటుంబ పోషణ భారంగా మారింది. విషయం తెలుసుకుని విశ్వబ్రాహ్మణులు నారాయణకు ఆర్థిక సహాయం చేయడం ఎంతో ఆనందంగా ఉందని జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం మాజీ నాయకులు సామంతపూడి నాగేశ్వరరావు అన్నారు. ఈకార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు, కార్పెంటరీ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.


నారాయణకు నగదు అందజేస్తున్న విశ్వబ్రాహ్మణ సంఘం, కార్పెంటర్ యూనియన్ నాయకులు

ఐటీఐతో ఉపాధి అవకాశాలు

మార్కాపురం వన్‌టౌన్, సెప్టెంబరు 18: ఐటీఐ విద్యతో ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయని మార్కాపురం ఆర్టీసీ డిపో మేనేజర్ ఏఎస్ నరసింహులు అన్నారు. స్థానిక ప్రభుత్వ ఐటీఐలో బుధవారం ఫ్రెషర్స్ డే నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన నరసింహులు మాట్లాడుతూ.. మంచి చదువుతో పాటు నడవడిక, నైతిక విలువలు నేర్చుకోవాలన్నారు. సీనియర్ విద్యార్థులు జూనియర్ విద్యార్థులకు ఆదర్శంగా నిలవాలన్నారు. అనంతరం విద్యార్థులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎం.నరేంద్రనాథ్, విద్యుత్ శాఖ ఏఈ హనుమా నాయక్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

80 మంది గర్భిణులకు సీమంతాలు


కంభంలో గర్భిణులకు సీమంతంలో పాల్గొన్న ఎమ్మెల్యే భార్య పుష్పలీల

కంభం, సెప్టెంబరు 18 : శ్రీపరంజ్యోతి భగవతి భగవాన్ సేవా సంఘం భక్తులు కంభం మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల సంరక్షణలో ఉన్న 80 మంది గర్భిణులకు ఘనంగా సీమంతాలు చేయడం మంచి పరిణామమని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి భార్య పుష్పలీల తెలిపారు. బుధవారం కందులాపురంలోని కల్కిభగవాన్ గుడిలో శ్రీపరంజ్యోతి భగవతి భగవాన్ సేవాసంఘం అధ్యక్షురాలు సౌజన్యదాసాజీల ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీమంతాల కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం 80 మంది గర్భిణులకు చీర, జాకెట్, గాజులు, పసుపు, కుంకుమలను ఇచ్చి సీమంతాలు నిర్వహించి అన్నదానం చేశారు.

ప్రజాసేవలో భాగంగానే జాబ్‌మేళా



మాట్లాడుతున్న గొట్టిపాటి లక్ష్మి





రిజిస్ట్రేషన్ చేసుకుంటున్న అభ్యర్థులు, కంపెనీల వివరాలు చూస్తున్న నిరుద్యోగులు

యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించటమే లక్ష్యం

ఎన్నికల హామీలను నిలబెట్టుకుంటున్నాం

డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

దర్శి, సెప్టెంబరు 18 : ప్రజాసేవలో భాగంగానే దర్శిలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ చెప్పారు. స్థానిక పీటీఎస్ కల్యాణ మండపంలో బుధవారం డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ, డాక్టర్ లలిత్‌సాగర్ దంపతుల ఆధ్వర్యంలో సొంత నిధులతో ఏర్పాటు చేసిన మెగా జాబ్ మేళాను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలోని యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ఈ బృహత్కర కార్యక్రమం చేపట్టామన్నారు. ఈ ప్రక్రియను నిరంతరం కొనసాగిస్తామని చెప్పారు. ప్రస్తుతం ఇంటర్వ్యూలకు వచ్చి ఉద్యోగం రానివారు నిరుత్సాహం పడాల్సిన అవసరం లేదని, హెచ్‌ఆర్‌సీవో సంస్థ ద్వారా శిక్షణ ఇప్పించి మళ్లీ ఏర్పాటు చేసే జాబ్‌మేళా ద్వారా ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. ప్రతి ఆరు నెలలకు ఒకసారి జాబ్‌మేళా ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు. జాబ్‌మేళా ద్వారా ఉద్యోగ అవకాశాలు కల్పిస్తూ ఎన్నికల హామీలను నిలబెట్టుకుంటున్నామని చెప్పారు. గత 40 ఏళ్లుగా గొట్టిపాటి కుటుంబం ప్రజలకు నిస్వార్థ సేవలందించిన విషయం తెలిసిందేనన్నారు. తన తాత, తండ్రి చేసిన సేవల స్ఫూర్తితో ప్రజాసేవలో ముందుకు సాగుతామని చెప్పారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ అడుగుజాడల్లో నడుస్తూ కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చిత్తశుద్ధిగా ప్రజలకు అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, తాళ్లూరు ఎంపీపీ శ్రీనివాసరావు, దర్శి నగర పంచాయతీ చైర్మెన్ నారపుశెట్టి పిచ్చయ్య, దొనకొండ, కురిచేడు, తాళ్లూరు, ముండ్లమూరు మండలాల పార్టీ అధ్యక్షులు నాగులపాటి శివకోటేశ్వరరావు, నెమలయ్య, బొమ్మిరెడ్డి ఓబుల్‌రెడ్డి, కూరపాటి శ్రీనివాసరావు, హెచ్‌ఆర్‌సీ ప్రతినిధులు హర్షితారెడ్డి, అనూషరెడ్డి పాల్గొన్నారు.

ఎట్టకేలకు కొలిక్కివచ్చిన అద్దె బకాయి వివాదం

నెలరోజులకు తురకపాలెం సచివాలయంలోకి చేరిన సిబ్బంది

అద్దెచెల్లించలేదంటూ భవనానికి తాళం వేసిన యజమాని

కంప్యూటర్లు లేక సెల్‌ఫోన్‌లో విధులు నిర్వహించిన ఉద్యోగులు

అధికారపార్టీ ఎంపీపీ, టీడీపీ మండల అధ్యక్షుడు, సర్పంచ్ చెప్పినా స్పందించని అధికారులు



సచివాలయంలో కూర్చున్న సిబ్బంది

తాళ్లూరు, సెప్టెంబరు 18 : మండలంలోని తురకపాలెం సచివాలయం భవన అద్దె చెల్లింపు వివాదం కొలిక్కి వచ్చింది. గ్రామంలో రాజకీయ ఆధిపత్య పోరు వల్ల సచివాలయ భవనం యజమాని(వైసీపీ మద్దతుదారు) సచివాలయ భవనానికి నెల రోజులక్రితం తాళం వేశాడు. అప్పటి నుంచి సచివాలయ సిబ్బంది రైతు భరోసా కేంద్రంలో తూతూమంత్రంగా విధులు నిర్వహించారు. ఎట్టకేలకు బుధవారం అద్దె చెల్లించడంతో భవనం తాళం తీయించి పంచాయతీ సామగ్రిని నూతన భవనంలోకి తరలించారు. వివరాల్లోకెళ్తే.. గత ఎన్నికల్లో తురకపాలెం సర్పంచ్‌గా టీడీపీకి చెందిన వ్యక్తి గెలిచారు. అప్పటి వైసీపీ పాలనలో ఏర్పాటు చేసిన సచివాలయాన్ని ఆ పార్టీ మద్దతుదారు భవనంలో నిర్వహించారు. అధికారులు అద్దె చెల్లించక పోవటంతో బకాయి పేరుకుపోయి ఉంది. టీడీపీ మద్దతుదారు సర్పంచ్ గుర్వారెడ్డి అదె బకాయి దాదాపు అంతా చెల్లించగా చివరగా మరో 56వేల రూపాయలు ఉంది. టీడీపీ వర్గీయులను ఇబ్బంది పెట్టేందుకు సచివాలయ భవన యజమాని గత నెల 20వ తేదీ అద్దె చెల్లించలేదంటూ భవనానికి తాళం వేశారు. సచివాలయ సిబ్బంది యజమానితో అద్దె చెల్లింపునకు చర్యలు చేపడతామని చెప్పినా అతను వినలేదు. ఈ విషయాన్ని సచివాలయ సిబ్బంది ఎంపీడీవో, సంబంధిత అధికారులకు చెప్పినా పట్టించుకోలేదు. అప్పటి నుంచి నెలరోజుల పాటు సిబ్బంది గ్రామంలోని రైతు సేవా కేంద్ర భవనంలో కాలాయాపన చేశారు. నిత్యం విధులకు వెళ్లినా కంప్యూటర్ సామాగ్రి లేకపోవటంతో కేవలం సెల్‌ఫోన్ యాప్‌లో చేయాల్సిన విధులకు మాత్రమే పరిమితమయ్యారు. సచివాలయ సిబ్బంది విన్నపం మేరకు టీడీపీ మద్దతుదారు సర్పంచ్ రూ.30 వేలు చెల్లించి మిగిలిన బకాయి తరువాత చెల్లిస్తానని చెప్పినా అద్దెభవనం యజమాని పూర్తి బకాయి చెల్లించాకే సామగ్రిని తీసుక వెళ్లాలని మొండికేశాడు. దీంతో మిగిలిన అద్దె బకాయిను సచివాలయ సిబ్బంది సొంతంగా చెల్లించారు. దీంతో యజమాని తాళాలు తీశాడు.



అద్దె భవనం నుంచి తరలిస్తున్న సచివాలయ సామగ్రి

అన్ని హంగులతో సచివాలయ భవన నిర్మాణం

గ్రామంలో లక్షలాది రూపాయలతో అన్ని హంగులతో నూతన సచివాలయ భవనాన్ని నిర్మించారు. ఆ భవనాన్ని ఎన్నికల కోడ్ రాక ముందు జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ ప్రారంభించారు. భవన నిర్మాణం చేపట్టిన వైసీపీకి చెందిన కాంట్రాక్టర్.. బిల్లులు చెల్లించలేదని నూతన భవనం తాళం ఇవ్వలేదు. తదుపరి పంచాయతీ రాజ్ అధికారులు వచ్చి చర్చలు జరిపి తాళం తీయించి వెళ్లారు. బుధవారం సచివాలయ సామగ్రి, కంప్యూటర్లను సిబ్బంది నూతన సచివాలయ భవనంలోకి తరలించారు. ఆ గ్రామానికి చెందిన కీలక నేతలైన అధికార పార్టీ ఎంపీపీ, టీడీపీ మండల అధ్యక్షుడు, సర్పంచ్ చెప్పినా అధికారులు నెలరోజులపాటు కాలయాపన చేయడం గమనార్హం.

ఆటో వర్కర్స్ యూనియన్ సమస్యలు పరిష్కరించాలి

దర్శి, సెప్టెంబరు 18 : ఆటో వర్కర్స్ యూనియన్ సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు బుధవారం తహసీల్దార్ శ్రావణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ సీఐటీయూ కార్యదర్శి టీ రంగారావు మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం తెచ్చిన నూతన రవాణా చట్టం వలన ఆటో వర్కర్స్‌పై పెను భారం పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ చలానాలను భారీగా పెంచారని, ఇన్సూరెన్స్ ప్రీమియం కూడా పెంచటం వలన అదనపు భారం పడుతుందని తెలిపారు. ఈ చలానాలను రద్దు చేయాలని, అధిక జరిమానాలు తగ్గించాలని, పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. రవాణా కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు నారాయణ, గర్నెపూడి జాన్, సామ్యేల్, జాషువా, సీహెచ్ ఆదినారాయణ, ఈ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వేళాపాళా లేని విద్యుత్ కోతలకు నిరసనగా రైతుల ధర్నా



సబ్‌స్టేషన్ వద్ద ధర్నా చేస్తున్న రైతులు

ముండ్లమూరు, సెప్టెంబరు 18 : వేళాపాళా లేని విద్యుత్ కోతలు విధించటం వల్ల తాము సాగు చేసిన పంటలు నిలువునా ఎండిపోతున్నాయని, విద్యుత్ కోతలను ఎత్తి వేసి పంటలను కాపాడాలని మండలంలోని పెద రావిపాడు గ్రామానికి చెందిన రైతులు బుధవారం ఉదయం ముండ్లమూరులోని సబ్‌స్టేషన్ వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ రైతులకు తొమ్మిది గంటలు విద్యుత్‌ను అందించాల్సి ఉండగా వారం రోజుల నుంచి ఇష్టానుసారంగా కోతలు విధించటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము సాగు చేసిన మిరప, వైట్‌బర్లీ పొగాకు, వరినాట్లు నీరు లేక ఎండిపోతున్నాయని, కోతలు ఎత్తి వేసి పంటలను కాపాడాలని రైతులు డిమాండ్ చేశారు. వేలాది రూపాయల పెట్టుబడులు పెట్టి పైర్లు సాగు చేస్తే ఇష్టానుసారంగా కరెంటు కోతలు విధించటం వల్ల ఎండి పోతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు ఉలవ నాగేశ్వరరావు, చుంచు ఆదినారాయణ, రావెళ్ల సీతయ్య, నలబోతుల కాశీ, రమేష్ పాల్గొన్నారు.

ఒంగోలులో 220 సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల వల్ల విద్యుత్ కట్

ఏడీఈ కే పిచ్చయ్య

ఒంగోలు నుంచి మండలానికి సరఫరా అయ్యే విద్యుత్‌ను 220 సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేస్తుండడం వల్ల కోత విధించాం. ఇక నుంచి అలాంటి కోతలు ఉండబోవు. రైతుల పంటలు ఎండి పోకుండా కాపాడుతాం.

వైభవంగా సింగన్నపాలెంలో వినాయక నిమజ్జనం



స్వామి ఊరేగింపు

ముండ్లమూరు, సెప్టెంబరు 18 : మండలంలోని సింగన్నపాలెంలో టీడీపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడిని బుధవారం నిమజ్జనం చేశారు. గ్రామంలో వైభవంగా ఊరేగించారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా ఎస్‌ఐ నాగరాజు తన సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

తాళ్లూరులో...

తాళ్లూరు, సెప్టెంబరు 18 : వినాయక విగ్రహాలను మండలంలోని పలు గ్రామాల నుంచి బుధవారం నిమజ్జనానికి తరలించారు. తూర్పుగంగవరం, తాళ్లూరు బస్టాండ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహానికి 11రోజులుగా పూజలు చేసి, పలు రకాల సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు అవాంచనీయ సంఘటనలు జరగకుండా ఎస్‌ఐ మల్లికార్జునరావు బందోబస్తు నిర్వహించారు.

'ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి'

ముండ్లమూరు, సెప్టెంబరు 18 : సమాచార హక్కు చట్టం గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకొని ముందుకు సాగాలని మండల వ్యవసాయ అధికారి ఎండీ ఫరూక్ చెప్పారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం 2005 గురించి వివరించారు. అధికార యంత్రాంగం నియంత్రణ కింద ఉన్న ఏదేనా సమాచార హక్కు చట్టం కింద పొంద గలిగే అవగాహన ఉండాలన్నారు. డీటీ పుల్లారెడ్డి, హౌసింగ్ ఏఈ హనుమంతరావు, ఫీల్డ్ అసిస్టెంట్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

శాకాహారం అమృతాహారంతో సమానం

పామూరు, సెప్టెంబరు 18 : మాంసాహారం కన్నా శాకాహారం అమృతాహారంతో సమానమని వారికే సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని నెల్లూరు జిల్లా ముత్తుకూరు ధ్యాన కేంద్రం పిరమిడ్ మాస్టర్ పోలయ్య చెప్పారు. పామూరు పత్రిసాయి జ్ఞానబోధి పిరమిడ్ ధ్యాన కేంద్రం ఆధ్వర్యంలో పౌర్ణమి సందర్భంగా పట్టణంలో శాకాహార అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ధ్యాన కేంద్రంలో ఆత్మజ్ఞాన సందేశం బోధించారు. అధ్యక్షులు పందిటి అల్లూరయ్య, పి. తిరుపతిరెడ్డి, జి. రమణయ్య, కె. ప్రభాకర్, సౌభాగ్యమ్మ, అనసూయమ్మ, పుష్ప, మస్తానమ్మ పాల్గొన్నారు.

24 వరకు దరఖాస్తుల పొడిగింపు : డీఈవో

ఒంగోలు(విద్య), సెప్టెంబరు 18 : జాతీయ ఉపకారవేతన పరీక్ష నేషనల్ మెన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్‌ఎంఎంఎస్) దరఖాస్తు గడువును ఈనెల 24 వరకు పొడిగించినట్లు డీఈవో సుభద్ర బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

గంగదేవిపల్లి వాగులో గుర్తు తెలియని మృతదేహం

పెట్రోలు పోసి తగులబెట్టిన దుండగులు

మహిళగా అనుమానం

దొనకొండ, సెప్టెంబరు 18 : మండలంలోని గంగదేవిపల్లి సమీపంలోని వాగులో గుర్తు తెలియని మృతదేహం బుధవారం కలకలం రేపింది. దొనకొండ-దర్శి ప్రధాన రహదారి పక్కనే ఉన్న వాగులో చిల్లచెట్ల మాటున కాలిపోయిన మృతదేహాన్ని గుర్తించి పొలాలకు వెళ్లే రైతులు గ్రామ వీఆర్వోకు సమాచారం అందించారు. ఆ మేరకు ఎస్సై విజయ్‌కుమార్ సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. పెట్రోల్‌తో మృతదేహాన్ని తగలబెట్టినట్లు ఆనవాళ్లు ఉన్నాయి. కొద్దిమేర జుట్టు, వందమీటర్ల దూరంలో జాకెట్ బొందు ఉండటంతో మహిళ మృతదేహంగా అనుమానిస్తున్నట్లు ఎస్సై తెలిపారు. ఈ సంఘటన ఒకటి రెండురోజుల క్రితం జరిగినట్లుగా భావిస్తున్నారు. దర్శి డీఎస్పీ లక్ష్మీనారాయణ, త్రిపురాంతకం సీఐ హసాన్‌లు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఒంగోలు క్లూస్ టీమ్, డాగ్‌స్క్వాడ్ ప్రతినిధులు పరిసరాలను పరిశీలించారు. వీఆర్వో ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై విజయ్‌కుమార్ తెలిపారు.

నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు



ఎస్సై కోటయ్య

పీసీపల్లి, సెప్టెంబరు 18 : మండలంలో ఎటువంటి నేరాలు జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటామని ఎస్సై జి.కోటయ్య చెప్పారు. రెండురోజుల క్రితం పీసీపల్లి ఎస్సైగా నియమితులైన ఆయన బుధవారం స్థానిక పోలీసుస్టేషన్‌లో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా స్టేషన్ సిబ్బందితో సమావేశమయ్యారు. కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ శాంతిభద్రతలకు విఘాతం కలిగించేవారు ఎంతటివారైనా ఉపేక్షించేదిలేదని హెచ్చరించారు. చిన్నచిన్న వివాదాలకు పోయి గ్రామాల్లో అలజడులు సృష్టించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

25 నుంచి చెకుముకి సంబరాలు



చెకుముకి పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్ చెన్నకృష్ణ

పామూరు, సెప్టెంబరు 18 : ఈ నెల 25వ తేదీ నుంచి ప్రారంభం కానున్న చెకుముకి సైన్స్ సంబరాలను విజయవంతం చేయాలని జేవీవీ జిల్లా గౌరవ అధ్యక్షులు డాక్టర్ చెన్నకృష్ణ పిలుపునిచ్చారు. స్థానిక చైతన్య నర్సింగ్‌హోం వైద్యశాలలో చెకుముకి సైన్స్ సంబరాలకు సంబంధించిన పోస్టర్లను బుధవారం ఆవిష్కరించారు. సెప్టెంబరు 25న మండల స్థాయి, అక్టోబరు 1 నుంచి జిల్లా స్థాయి, అక్టోబరు 27న రాష్ట్ర స్థాయి, నవంబరు 9, 10, తేదీల్లో 8, 9, 10 తరగతుల విద్యార్థులకు సైన్స్ పట్ల అవగాహనకు కాంపిటేషన్ పరీక్షలు ఏటా నిర్వహించి ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు మాలకొండారెడ్డి, జే వెంకట్రావు, పేట తిరుపతిరెడ్డి, మండల కమిటీ అధ్యక్ష కార్యదర్శులు కే శంకర్, అబ్దుల్, ఫయాజ్ పాల్గొన్నారు.

స్వచ్ఛతా హీ కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలి

సీఎస్‌పురం(పామూరు) సెప్టెంబరు 18 : స్వచ్ఛతా హీ కార్యక్రమాల్లో ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని సర్పంచ్ బత్తుల కృష్ణకుమారి రమణయ్యలు కోరారు. మండలంలోని రేగులచెలక గ్రామంలో స్వచ్ఛతా హీ కార్యక్రమలపై బుధవారం గ్రామ సచివాలయం నుంచి అవగాహన ర్యాలీ నిర్వహించి కూడలి వద్ద మానవహారంగా ఏర్పడ్డారు. పరిశరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కార్యదర్శి షేక్ నాయబ్‌రసూల్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

నవోదయ ప్రవేశ పరీక్ష గడువు పెంపు

సీఎస్‌పురం(పామూరు), సెప్టెంబరు 18 : జవహర్ నవోదయ విద్యాలయాల్లో ఆరో తరగతి ప్రవేశాల పరీక్షల గడువును ఈ నెల 23వ తేదీ వరకు పొడిగించినట్లు ఎంఈవోలు ప్రసాదారావు, ఆర్ కొండారెడ్డిలు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం గుర్తింపు పొందిన పాఠశాలల్లో ఈ ఏడాది 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

20, 21 తేదీల్లో ఎస్‌జీఎఫ్ ఆటల పోటీలు

దొనకొండ, సెప్టెంబరు 18 : స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో 14 నుంచి 17 ఏళ్లలోపు బాలబాలికలకు మండల స్థాయి ఎస్‌జీఎఫ్ ఆటల పోటీలు, ఎంపిక ప్రక్రియ నిర్వహించనున్నట్లు ఫిజికల్ డైరెక్టర్, మండల కన్వీనర్ కె.నరసింహారావు తెలిపారు. ఈ నెల 20, 21 తేదీల్లో ఈ కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. 20వ తేదీన కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటిన్, 21న అథ్లెటిక్స్, యోగా, చెస్ పోటీలు జరుగుతాయన్నారు. మండల స్థాయిలో ఎంపికైన క్రీడాకారులకు దర్శి నియోజకవర్గ స్థాయి క్రీడల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ పోటీల్లో ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న అండర్ 14 విభాగంలో 2011 జనవరి 1వ తేదీ తర్వాత, అండర్ 17 విభాగంలో 2008 జనవరి 1వ తేదీ తర్వాత జన్మించిన వారు పాల్గొనవచ్చని వివరించారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థులు జనన ధ్రువీకరణ పత్రం, ప్రధానోపాధ్యాయుడు ధ్రువీకరించిన పత్రాలతో హాజరుకావాలని సూచించారు.

కనిగిరి వైద్యశాల అభివృద్ధికి రూ.50 వేల విరాళం



ఉగ్రకు రూ.50 వేల నగదును అందజేస్తున్న రాజేష్

పామూరు, సెప్టెంబరు 18 : కనిగిరిలోని ప్రభుత్వ వైద్యశాల అభివృద్ధికి ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి దాతల సహకారంతో చేపడుతున్న పనులకు తోడ్పాటుగా పామూరుకు చెందిన టీడీపీ నాయకులు ధనుకొండ రాజేష్ తన వంతుగా రూ.50 వేల నగదు అందజేశారు. కనిగిరిలోని అమరావతి గ్రౌండ్‌లో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఉగ్రకు అందజేశారు. ఈ సందర్భంగా ఉగ్ర మాట్లాడుతూ కనిగిరి ప్రభుత్వ వైద్యశాలను దాతల సహకారంతో కార్పొరేట్ స్థాయిలో ప్రజలకు వైద్యసేవలు అందే విధంగా అభివృద్ధి పరుస్తున్నామని, అందుకు దాతల అందిస్తున్న చేయూత మరువలేమని చెప్పారు. ఈ సందర్భంగా రాజేష్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఫిషర్‌మెన్ సొసైటీ మాజీ అధ్యక్షుడు కౌలూరి ఖాజారహంతుల్లా, టీడీపీ మోపాడు గ్రామ కమిటీ అధ్యక్షులు ఎం గిడ్డయ్యయాదవ్, తిరుపతయ్య తదితరులు ఉన్నారు.

నీటి వనరులను రక్షించుకోవాలి

కనిగిరి, సెప్టెంబరు 18 : నీటి వనరులను రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని మున్సిపల్ చైర్మన్ గఫార్ చెప్పారు. నీటి పర్యవేక్షణా దినోత్సవం సందర్భంగా స్థానిక మున్సిపల్ కార్యాలయంలో బుధవారం మున్సిపల్, సచివాలయ సిబ్బందితో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ నీటిని పరిశుభ్రంగా ఉంచుకోవటంతో పాటు నీటి వనరులను రక్షించుకునే కార్యక్రమంలో భాగంగా ప్రజల ప్రమేయాన్ని ప్రోత్సహించాలన్నారు. నీటి వృథా వలన భవిష్యత్తులో నీటి కోసం అహర్నిశలు అన్వేషించే పరిస్థితి ఏర్పడుతుందని చెప్పారు. భావి తరాల జీవనం బాగుండాలంటే నీటి వృథాను అరికట్టాలన్నారు. డాక్టర్ ప్రియార్శానంద, గుడ్‌హెల్ప్ రమేష్ పాల్గొన్నారు.

పోషక పదార్థాలతోనే సంపూర్ణ ఆరోగ్యం

కనిగిరి, సెప్టెంబరు 18 : పోషక పదార్థాలతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పార్వతి చెప్పారు. మండలంలోని వంగపాడు, కృష్ణాపురం గ్రామాల్లో బుధవారం పోషకాహార మాసోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులకు సీమంతం నిర్వహించి, గ్రామంలో పోషకాహారంపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవి, పంచాయతీ కార్యదర్శి వెంకటకొండయ్య, ఏఎన్‌ఎం ముస్సీసాబేగం, హెచ్‌పీ జాషువా పాల్గొన్నారు.

బాధ్యతగా పనిచేయకుంటే ఫీల్డ్ అసిస్టెంట్ల మార్పు తథ్యం

ఎంపీడీవో యుగకీర్తి

తాళ్లూరు, సెప్టెంబరు 18 : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద కొత్తగా నియమితులైన ఫీల్డ్‌అసిస్టెంట్లు బాధ్యతగా పనిచేయకుంటే మార్పు చేయటం తప్పదని ఎంపీడీవో కె.యుగకీర్తి చెప్పారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. గ్రామాల్లో జనాభా ప్రాతిపదికన ఉపాధి పనులను ఎస్సీ, ఎస్టీలకు నూరుశాతం పనులు కల్పించాలన్నారు. జాబ్ కార్డులున్న ఎస్సీ, ఎస్టీలకు పనులు కల్పించే బాధ్యత ఎఫ్‌ఏలదేనని చెప్పారు. మండలానికి సీసీ రోడ్లు, సైడుకాలువల నిర్మాణానికి రూ.3కోట్లు మంజూరయ్యాయన్నారు. గ్రామాల్లో 6వేల మంది ఉపాధిహామీ పనుల ద్వారా కూలీలకు పనులు కల్పించేందుకు లక్ష్యంగా పెట్టుకోగా కేవలం 887 మంది మాత్రమే రావటంపై ఎఫ్‌ఏల పనితీరు పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో ఏపీవో మురళి, ఈసీ ఎం.ప్రసాద్, టీఏలు, ఎఫ్‌ఏలు పాల్గొన్నారు.

బాలికల వసతి గృహ సమస్యల పరిష్కారానికి కృషి



బాలికల సమస్యలను వింటున్న ఎంపీడీవో

తాళ్లూరు, సెప్టెంబరు 18 : బీసీ బాలికల వసతి గృహంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎంపీడీవో కె.యుగకీర్తి చెప్పారు. స్థానిక బీసీ బాలికల వసతి గృహాన్ని ఎంపీడీవో బుధవారం సాయంత్రం సందర్శించారు. వసతి గృహంలోని బాలికలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. టీడీపీ నాయకులు ఐ.శ్రీనివాసరెడ్డి, తదితరులు ఉన్నారు.

ఆంధ్రప్రదేశ్ - దేవదాయ ధర్మదాయ శాఖ
శ్రీ నారాయణస్వామి వారి దేవస్థానము
మిట్టపాలెం గ్రామం, కోవిలంపాడు పోస్టు, సి.యస్.పురం (మం), ప్రకాశం జిల్లా

టెండరు నోటీసు

నెం: 02/2024-2025 తేది:18-09-2024

ప్రకాశం జిల్లా, సి.యస్.పురం మండలం, మిట్టపాలెం గ్రామంలో వేంచేసియున్న శ్రీ నారాయణ స్వామి వారి దేవస్థానమునకు **కిరాణా, లడ్డు, పడితరము, శానిటేషన్** సామాగ్రి సరఫరా చేయుటకు ఈ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా మాత్రమే టెండర్లు కోరడమైనది. ఈ టెండరు కాలపరిమితి **తేది.01-10-2024** నుండి **తేది.30-09-2025** వరకు. షెడ్యూలు ఆఖరు తేది. **24-09-2024**, ఉదయము **11.00** గం॥ల వరకు. పూర్తి వివరములకు **www.apeprocurement.gov.in** లో **Endowments department marketing** నందు చూడగలరు.

వ్యవస్థాపక ధర్మకర్త | మిట్టపాలెం తేది. 18-09-2024 | కార్యనిర్వహణాధికారి సెల్: 8247714889

AJC ఆంధ్రజ్యోతి ప్రతిరోజు క్లాసిఫైడ్స్ — ప్రతి అవసరానికి వేగవంతమైన ఫలితం

WANTED

■ నవయుగ పెట్రోలియమ్స్, త్రోవగుంట లోని కరవది రోడ్డులో గల పెట్రోలు బంకులో పనిచేయుటకు బాయ్స్, గర్ల్స్ కావలెను. సంప్ర॥ సెల్: **9866774691**

AJO-190476

సేల్స్ గర్ల్స్ కావలెను

■ ఒంగోలు ప్రముఖ ఫర్నీచర్ షాపులో పనిచేయుటకు సేల్స్ గర్ల్స్ కా॥ వయస్సు : 20 to 40లోపు, అర్హత : డిగ్రీ లేద B.Tech Complete. జీతం: 20,000 + ఇన్సెంటివ్స్. సంప్ర॥ సెల్ : 83744 44414, 90305 90855

AJO-200142

WANTED

■ త్రివేడి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను / పేషంట్స్‌ని చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం 18K. Ph: 9160900024 / 9640400073

AJH-15220

PLOT FOR SALE

■ చీరాల - ఉడ్ నగర్‌లో ఇండ్ల మధ్యలో తక్షణమే నిర్మాణానికి అనువైన 6 సెంట్లు ఖాళీ స్థలము మున్సిపల్ వాటర్ కనెక్షన్‌తో అమ్మకమునకు కలదు. **Cell : 98489 11566**

AJB-194015

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

ఆంధ్రజ్యోతి దినపత్రిక ద్వారా ఇప్పుడు మీ ఆత్మీయులకు ప్రకటనలతో మరింత చేరువకండి.

జన్మదిన శుభాకాంక్షలు | వివాహ/షష్టిపూర్తి శుభాకాంక్షలు
విదేశీయాన / స్వదేశాగమన శుభాకాంక్షలు | లీగల్ నోటీసులు బ్యాంకు ప్రకటనలు
ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు | మొదలగు అన్ని రకముల పత్రికా ప్రకటనలకు మీ ఏరియాలోని మా ప్రతినిధిని సంప్రదించండి. ప్రతి ప్రకటనపై GST 5% అదనం.

ఒంగోలు : 99854 11071, 97036 18694, 99854 11483
చీమకుర్తి : 96525 55752
చీరాల : 99859 21376
మార్కాపురం : 99859 21358
కందుకూరు : 97036 18697
కనిగిరి : 99854 11483
గిద్దలూరు : 99859 21358

ఆంధ్రజ్యోతి దినపత్రిక కొరకు సంప్ర॥ 9985411484









అధినేతతో ఎమ్మెల్యేలు

మంగళగిరి సీకే కన్వెన్షన్ హాలులో బుధవారం ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్వహించిన కూటమి ఎమ్మెల్యేల సమావేశంలో పాల్గొన్న గుంటూరు, పల్నాడు,బాపట్ల జిల్లా ఎమ్మెల్యేలు, మంత్రులు లోకేశ్, మనోహర్, అనగాని సత్యప్రసాద్

సోలార్.. బేజార్

కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రకటించిన పీఎం సూర్య ఘర్ స్కీము ద్వారా ఒకరు సోలార్ ప్లాంటు పెట్టించుకున్నారు. మూడు మెగావాట్ల ప్లాంటుకు రూ.78వేల సబ్సిడీ వస్తుండడంతో రూ.2లక్షలు బ్యాంకు లోను తీసుకుని మరీ ప్లాంటు పెట్టించుకున్నాడు. స్కీం ప్రకారం ప్లాంటు పూర్తైన 30 రోజుల్లో సబ్సిడీ నగదు అకౌంట్లో జమవ్వాలి. కానీ సదరు వినియోగదారుడికి మూడు నెలలైనా సబ్సిడీ రాలేదు. ఇలా ఒకరు కాదు.. ఇద్దరు కాదు.. అనేకమంది సబ్సిడీ డబ్బులు రాక తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.

- సోలార్ ప్లాంటు పెట్టించుకున్న తరువాత గతం కంటే ఎక్కువ కరెంటు బిల్లు రావడంతో మరొకరు షాక్ కు గురయ్యారు. సోలార్ ప్లాంటు పెట్టక ముందు నెల సరి కరెంటు బిల్లు సగటున రూ.700 వచ్చేది. రూ.2 లక్షలు పెట్టి పీఎం సూర్యఘర్ కింద సోలార్ ప్లాంటు పెట్టుకున్నారు. ప్రతి నెలా 400 యూని ట్లు కరెంటు తయారవడంతో 200 యూనిట్లు వాడుకు ని, 200 యూనిట్లు డిస్కమ్‌కు ఎగుమతి చేస్తున్నారు. అయినా సరే కరెంటు బిల్లు మాత్రం కట్టాల్సివ స్తోంది. ఒక నెల రూ.200 కరెంటు బిల్లు రాగా, రెండో నెల ఏకంగా రూ.731 బిల్లు వచ్చింది. దీంతో షాక్‌కు గురవడం వినియోగదారుడి వంతైంది.

- క్షేత్రస్థాయిలో విఫలమవుతున్న పీఎం సూర్యఘర్ పథకం
- సబ్సిడీలు రాక నానా అగచాట్లు పడుతున్న వినియోగదారులు
- కేంద్రం భారీ సబ్సిడీ ప్రకటించడంతో సామాన్యుల్లో ఆసక్తి
- అప్పు చేసి మరీ సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేసుకున్న వైనం
- సబ్సిడీ రాకపోవడంతో తీవ్ర ఆందోళనకు గురవుతున్న పరిస్థితి

బాపట్ల, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి సూర్యఘర్ పథకం ఆచరణలో అప్రతిష్ఠపాలవుతోంది. కేంద్రప్రభుత్వం భారీ గా సబ్సిడీ ప్రకటించడంతో సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకునేందుకు ముందుకు వచ్చిన లబ్దిదారులు అనేకమంది సబ్సిడీ రాక ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం చెప్పిన మాట నమ్మి తాము మోసపోయామంటూ గగ్గోలు పెడుతున్నారు. దీనికితోడు మూలిగే నక్కపై తాటిపండు పడినట్లు ప్రతినెలా కరెంటుబిల్లు కూడా చెల్లించాల్సి రావ డంతో అగ్గిమీద గుగ్గిల మైపోతున్నారు. కేంద్ర ప్రభుత్వం తమను ఘోరంగా వంచించిందని ఆ గ్రహం చెందుతున్నారు.

● వేల సంఖ్యలో సోలార్ ప్లాంట్లు

కేంద్ర ప్రభుత్వం సోలార్ విద్యుత్‌ను ప్రోత్సహించేందుకు పీఎం సూర్యఘర్ పథకాన్ని ప్రవేశపెట్టింది. ఒక కి లోవాట్ ప్లాంటుకు రూ. 30 వేలు, రెండు కిలోవాట్లకైతే రూ.60వేలు, మూడు కిలోవాట్లకైతే రూ.78వేలు చొప్పు న భారీ స బ్సిడీలు ప్రకటించింది. కోటి ఇళ్లపై ప్లాంట్లు ఏర్పాటు చేయా లని లక్ష్యంగా పెట్టుకుని భారీగా ప్రచారం చేసిం ది. దీంతో చాలా మంది సోలార్ ప్లాంట్లు ఏర్పా టు చేసుకునేందుకు ముందుకు వచ్చారు. అందు తున్న లెక్కల ప్రకారం జూన్ ఐదో తేదీ నాటికి గుంటూరు జిల్లాలో 917 మంది, బాపట్ల జిల్లాలో 466 మంది, పల్నాడు జిల్లాలో 394మంది ఈ స్కీము కింద సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకు న్నారు. కాగా వీరిలో చాలా మందికి ఈరోజు వరకూ సబ్సిడీ మాత్రం దక్కలేదు.

● అప్పు చేసి తెచ్చుకున్న తిప్పలు

గత ప్రభుత్వం 8 సార్లు కరెంటు బిల్లులు పెంచి మోత మోగిస్తుండడంతో సోలార్ పెట్టుకుంటే కరెంటు బిల్లు చెల్లించే బాధ లేదన్న ఆశ, సబ్సిడీ భారీ మొత్తంలో వుండడంతో వేల సంఖ్యలో సామాన్యులు సోలార్ ప్లాంట్ల వైపు మొగ్గు చూపారు. కొద్దో గొప్ప అవకాశం వున్న ప్రతి ఒక్కరూ బ్యాంకుల ద్వారా రుణం తీసుకుని ప్లాంట్లు ఏర్పాటు చేసుకున్నారు. సగటున ఒక్కొకరు రూ. 2 లక్షలు ఖర్చు చేసి ప్లాంటు పెట్టుకున్నారు. బ్యాంకుల నుంచి రూ.లక్షా 80వేలు లోను తీసుకు న్నారు. ప్రభుత్వం సబ్సిడీ ఇస్తే లక్ష రూపాయల లోనే కాబట్టి చెల్లించు కోవచ్చని భావించారు. కానీ వాస్తవ పరిస్థితి చాలా దారుణంగా వుంది. ప్లాంటు పూర్తై సబ్సిడీకి దరఖాస్తు చేసుకున్న 30 రోజుల్లో సబ్సిడీ ఇస్తానన్న కేంద్రం 100 రోజులు అవుతున్నా సబ్సిడీ ఇవ్వలేదు.

300 యూనిట్ల వరకూ ఉచిత విద్యుత్ పేరుతో కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రమోట్ చేస్తోంది. కానీ వాస్తవంలో పరిస్థితులు వేరుగా వుంది. రూ. 2 లక్షలు పెట్టి ప్లాంటు పెట్టించుకున్నా కరెంటు బిల్లుల వాత మాత్రం వినియోగదారులకు తప్పడం లేదు. సోలార్ ప్లాంటు ద్వారా కరెంటు తయారు చేసుకుని, అదనపు కరెంటు డిస్కమ్‌కు ఎగుమతి చేసినా ప్రతి నెలా కరెంటు బిల్లు రావడంతో లబ్దిదారులు షాక్‌కు గురవుతున్నారు. ప్రతి నెలా రూ. 200 నుంచి 300 వరకూ బిల్లులు వస్తున్నాయి. ఇంత ఖర్చు చేసినా గత వైసీపీ ప్రభుత్వం వేసిన అదనపు చార్జీల మోత మాత్రం తప్పలేదు. స్థిర చార్జీలు, కన్స్యూమర్ చార్జీలు, ట్రూఅప్ చార్జీలు, సర్దుబాటు చార్జీల పేరుతో రెండు, మూడు వందలు బిల్లులు వస్తుంటే వినియోగదారులు ఘొల్లు మంటు న్నారు. చాలా చోట్ల అధికారుల నిర్వాకంతో గతంలో కంటే కరెంటు బిల్లులు అదనంగా రావ డంతో హతాసుల వుతున్నారు. దీనిపై ఎవరికి చెప్పుకోవాలో తెలియక అల్లాడిపోతున్నారు.



మూణ్నాళ్లకే.. మూలకు..

- నీరుగారిపోతున్న శుద్ధజలం పంపిణీ
- కళాశాలల్లో నిరుపయోగంగా వాటర్‌ప్లాంట్లు
- రూ.లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసినా శిథిలావస్థకు..
- మరమ్మతులపై చేతులెత్తేసిన ఏజెన్సీ నిర్వాహకులు



గుంటూరులోని ప్రభుత్వ బాలికల వృత్తి విద్యా జూనియర్ కళాశాలలో నిరుపయోగంగా ఉన్న వాటర్‌ప్లాంట్

గుంటూరు(విద్య), సెప్టెంబరు 18: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు శుద్ధజలం పంపిణీ మూణ్నాళ్ల ముచ్చటగా మారింది. రూ.లక్షల వెచ్చించి ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్లు నిర్వహణా లోపం, మరమ్మతులతో మూలకు చేరాయి. దీంతో ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఆర్భాటంగా ఏర్పా టు చేసిన వాటర్ ప్లాంట్లు శిథిలావస్థకు చేరాయి. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు 22 వరకు ఉండగా గత ప్రభుత్వం నాడు నేడు పథకంలో ఒక్కో కళాశాలకు రెండు చొప్పున వాటర్ ప్లాంట్లను మంజూరు చేసింది. ఒక్కో ప్లాంట్ కోసం రూ.2.50 లక్షల నుంచి రూ.3 లక్షలు వరకు వెచ్చించింది. ప్లాంట్స్‌ను కొనుగోలు చేసి వాటి ఇన్‌స్టలేషన్, నిర్వహణ, మరమ్మతుల కోసం కొన్ని ఏజన్సీలను ప్రభుత్వం ఎంపిక చేసింది. అయితే ఏజన్సీ నిర్వహకులు ఉమ్మడి జిల్లా పరిధిలోని 22 జూనియర్ కళాశాలల్లో వాటర్ ప్లాంట్లను ఇన్‌స్టాల్ చేశారు. రోజుకు సగటున 3 వేల నుంచి 5 వేల లీటర్ల సామర్థ్యంతో శుద్ధజలం విద్యార్థులకు అందేలా వీటిని ఏర్పాటు చేశారు. అయితే కొన్ని చోట్ల సాంకేతిక కారణాలతో అవి పనిచేయడం లేదు. మరికొన్ని దగ్గర్ల మరమ్మతులతో మూలకు చేరాయి. దాదాపు పది కళాశాలల్లో వాట ర్ ప్లాంట్లు సాంకేతిక సమస్యలతో పనిచేయడం లేదు. కొన్నిచోట్ల ఫిల్టర్స్‌ను సకాలంలో మార్చడం లేదు. దీంతో తాగడానికి అనుకూలంగా నీరు లేదని విద్యార్థులు వాపోతున్నారు. గుంటూరులోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, ప్రభుత్వ వృత్తి విద్యాకళాశాలలో నాలుగు ప్లాంట్లు ఏర్పాటు చేయ గా వృత్తి విద్యా కళాశాలలో ఒక ప్లాంట్ ఇప్పటికే మూలన పడింది. జూనియర్ కళాశాలలో ప్లాంట్ తరచూ మరమ్మతులకు గురవుతున్నట్లు ఫిర్యాదులు ఉన్నాయి. నిర్వహణ ఏజన్సీలకు ప్రిన్సిపాల్స్ ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా వారు పట్టించుకోలేదు. మరమ్మతుల కోసం ఎన్నిసార్లు ఏజన్సీలను సంప్రదించినా ఇదుగో అదిగో అంటూ కాలం గడుపుతున్నారని చెబుతున్నారు. ఈ విషయాన్ని కొందరు ఉన్నతాధికారుల దృష్టికి కూడా తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయింది.

ఏజెన్సీలను అదుపులో పెట్టేదెవరు..

వాటర్ ప్లాంట్ల నిర్వహణ ఏజెన్సీల తీరు ఇష్టారాజ్యంగా ఉందనే ఆరోపణలు వస్తున్నాయి. ప్రభుత్వం నుంచి చేసుకున్న ఒప్పందం ప్రకారం వారు నిర్వహణ బాధ్యతలు సక్రమంగా నిర్వర్తించడం లేదు. వాటర్ ప్లాంట్‌కు చెల్లించే మొత్తంలోనే నిర్వహణకు ప్రభుత్వం నగదు చెల్లించినట్లు జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్ చెబుతున్నారు. అయితే ఏజెన్సీ మాత్రం నిర్వహణ గురించి పట్టించుకోవడం లేదు. సిబ్బంది లేమి, లోపించిన సాంకేతిక నైపుణ్యం, స్పేర్‌పార్ట్స్ కొరత తదితర కారణాలతో నెలల తరబడి ప్లాంట్స్ మరమ్మతులకు నోచుకోవ డం లేదు. ఫలితంగా విద్యార్థులకు శుద్ధజలం అందించాలన్న లక్ష్యం నీరుగారుతోందని ప్రిన్సిపాల్స్ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సాయం సిద్ధం

- వరద నష్టం గణన.. లెక్కలు పూర్తి
- వివరాలతో గ్రామాల్లో సోషల్ ఆడిట్
- రేపు ప్రభుత్వానికి తుది జాబితా అందజేత

బాపట్ల, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): వరదలు మిగిల్చిన విషాదం లంక గ్రామాల ప్రజలను వెంటాడుతూనే ఉంది. బాధితులైన ప్రతి ఒక్కరికీ న్యాయం చేయడానికి ప్రభుత్వం నష్టం గణన కోసం పెద్ద ఎత్తున సిబ్బందిని రంగంలోకి దింపింది. వ్యవసాయ సిబ్బంది పంటలకు జరిగిన నష్టం లెక్కలను క్షేత్రస్థాయిలో లెక్కించగా, రెవెన్యూ యంత్రాంగం ఇళ్లకు, సామాన్లకు వాటిల్లిన నష్టంపై సర్వే నిర్వహించి వివరాలను ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేశారు. వ్యవసాయ, ఉద్యాన శాఖ పంటలకు వాటిల్లిన నష్టం వివరాలను ఈ క్రాప్ యాప్‌లో అప్‌లోడ్ చేసిన యంత్రాంగం, సర్వే నెంబర్ల వారీగా నష్టం వివరాల జాబితాను సోషల్ ఆడిట్ కోసం సిద్ధం చేశారు. 31,400 మంది రైతులకు పంట నష్ట పరిహారం అందనుంది. వ్యవసాయ పంటలకు సంబంధించి 41,531 ఎకరాలకు నష్టం వాటిల్లగా, ప్రభావిత రైతుల సంఖ్యను 25,600గా యంత్రాంగం తెలిపింది. నష్టపోయిన పంటలో వరి వాటానే 40,000 ఎకరాలుగా ఉంది. ఉద్యాన పంటల విషయంలో 5,800 మంది రైతులకు 8,800 ఎకరాలు దెబ్బతిన్నట్లు జాబితాలో నమోదు చేశారు. ముంపు బారిన పడిన 24 లంక గ్రామాలకు సంబంధించి మొత్తం 7970 ఇళ్లకు సంబంధించి జరిగిన నష్టం వివరాలను రెవెన్యూ సిబ్బంది ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేసింది. పూర్తిగా మునిగినవి, పాక్షికంగా దెబ్బతిన్నవి, మరమ్మతులకయ్యే ఖర్చుతో పాటు ఇళ్లలో దెబ్బతిన్న ఎలక్ట్రానిక్ వస్తువులు.. అంశాల వారీగా నష్టం వివరాలు యాప్‌లో నమోదు చేశారు.

బాధితులకు సాయం విషయంలో..

ఉదారంగా సాయం అందిస్తుందని తాజాగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేసిన ప్రకటన బాధితులకు సాంత్వన చేకూర్చేలా ఉంది. ముఖ్యంగా పంట నష్టం విషయంలో గతంతో పోలిస్తే పెంచి సాయాన్ని అందిస్తామని చెప్పడంపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గతంలో వరికి సంబంధించి హెక్టారుకు రూ.17,000 ఇన్‌పుట్ సబ్సిడీ అందేది. కానీ తాజాగా ముఖ్యమంత్రి హెక్టారుకు రూ.25,000 సాయం అందిస్తామని చెప్పడంతో రైతుల్లో హర్షం వ్యక్తమవుతోంది. గతంతో పోలిస్తే ఉద్యాన పైర్ల విషయంలోనూ ఉదారంగా సాయం చేస్తామని ప్రభుత్వం తెలపడంతో బాధిత రైతులకు ఊరట దక్కింది. పరిహారం పెంపు విషయంలో అధికారికంగా ఉత్తర్వులు రావాల్సి ఉందని అధికారులు చెబుతున్నారు



పంట నష్టం వివరాలను నమోదు చేసుకుంటున్న అధికారులు (పాతచిత్రం)

మార్పులు.. చేర్పులకు అవకాశం...

పంట నష్టం గణన వారం క్రితమే పూర్తి కావాల్సి ఉన్నప్పటికీ వివరాలను ఈ క్రాప్ యాప్‌లో నమోదు చేయాలని వ్యవసాయ శాఖ ఆదేశించడంతో మొత్తం ప్రక్రియ మళ్లీ మొదటికొచ్చింది. దీంతో నష్టం వివరాలను యాప్‌లో అప్‌లోడ్ చేసే ప్రక్రియ మంగళవారంతో పూర్తయింది. వెంటనే ఆ జాబితాలను సోషల్ ఆడిట్ కోసం బుధ, గురు రెండు రోజుల పాటు గ్రామాలలో ప్రదర్శించి రైతుల నుంచి అభ్యంతరాలు స్వీకరించనున్నారు. తొలి రోజయినా బుధవారం పెద్దసంఖ్యలో రైతులు తమ పేర్లు జాబితాలో లేవనే అంశాన్ని వ్యవసాయ సిబ్బంది దృష్టికి తీసుకొచ్చినట్లు సమాచారం. నష్ట పరిహారం విషయంలో అర్హత కలిగిన రైతులందరి పేర్లను సర్వే నెంబర్లతో నమోదు చేస్తామని ఎవరూ ఆందోళన చెందనవసరం లేదని వ్యవసాయశాఖ చెబుతోంది. వాస్తవానికి నష్టం విషయంలో ప్రాథమిక అంచనాలతో పోలిస్తే తుది జాబితాలో భారీగా కోత పడింది. దీంతో సోషల్ ఆడిట్‌లో భాగంగా రైతుల నుంచి పెద్ద ఎత్తున విజ్ఞాపనలు వచ్చే అవకాశం ఉంది. సోషల్ ఆడిట్‌లో భాగంగా అన్నదాతల నుంచి వచ్చే అర్జీలకు జాబితాలో స్థానం కల్పించి తుది జాబితాను వ్యవసాయ శాఖ రేపు ప్రభుత్వానికి అందించనుంది.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జె.వెంకట మురళి పక్కన జేసీ ప్రఖర్‌జైన్.

వందరోజుల లక్ష్యాన్ని చేరుకోవాలి

- అధికారులను ఆదేశించిన కలెక్టర్ వెంకటమురళి

బాపట్ల, సెప్టెంబరు 18: అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలలో 100 రోజుల లక్ష్యాన్ని చేరుకునేలా అధికారులు కృషి చేయాలని కలెక్టర్ జె.వెంకటమురళి ఆదేశించారు. పలు శాఖల అధికారులతో ఆయన బుధవారం కలెక్టరేట్‌లో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమగ్రాభివృద్ధి లక్ష్యంగా అధికారులు పనిచేయాలన్నారు. లక్ష్యసాధనలో అధికారులు నిర్లిప్తంగా ఉండరాదన్నారు. సమావేశంలో జేసీ ప్రఖర్‌జైన్, డీఆర్వో సి.హెచ్.సత్తిబాబు, సీపీవో శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

తొలగించిన భూములపై నివేదికివ్వాలి

నిషేధిత భూముల జాబితా 22 ఏ నుంచి తొలిగించిన భూముల వివరాలపై తహసీల్దార్లు నివేదికివ్వాలని కలెక్టర్ తెలిపారు. ఆర్డీవోలు, తహసీల్దార్‌లతో బుధవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుంచి వీక్షణా సమావేశం నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ భూములపై సమగ్రంగా రూపొందించిన నివేదికను ఈ నెల 21లోగా అందించాలన్నారు. నివేదిక తయారీలో నిర్లిప్తంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. చుక్కల భూములు, షరతులు గల పట్టా భూమి వివరాలు స్పష్టంగా పొందుపర్చాలని కలెక్టర్ చెప్పారు. సర్వీస్ ఇనామ్ భూముల రిజిస్ట్రేషన్ ప్రక్రియలో చట్టం ఉల్లంఘనకు గురైందా లేదా అనే విషయాలను స్పష్టంగా పరిశీలించి నివేదిక పంపాలన్నారు. నిషేధిత భూముల జాబితా నుంచి తొలిగించిన భూముల రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఆర్ఎస్ఆర్‌తో సరి చూసుకోవాలన్నారు. ఆసైన్డ్ భూములలో 20 ఏళ్ళగా ఉన్న వ్యక్తులు మాత్రమే ఆ భూమిని అనుభవిస్తుంటే ఆ భూమి రిజిస్ట్రేషన్ ప్రక్రియను తహసీల్దార్‌లు పరిశీలించి నివేదించాలన్నారు. భూముల రిజిస్ట్రేషన్ ప్రక్రియలో చట్టాలను ఉల్లంఘించిన వాటిని తహసీల్దార్‌లు ధ్రువీకరించి నివేదిక పంపాలని జేసీ ప్రఖర్‌జైన్ తెలిపారు.

సరిదిద్దుకుందామా.. సర్దుకుపోదామా

- సబ్ ట్రెజరీ కార్యాలయ తీరుపై ఉద్యోగులు, పెన్షనర్లు, కాంట్రాక్టర్లలో చర్చ
- విచారణ నివేదికను కలెక్టర్‌కు, డైరెక్టర్ ఆఫ్ ట్రెజరీస్ అకౌంట్స్ డైరెక్టర్‌కు అందజేసిన డీటీవో

చీరాల, సెప్టెంబరు 18: చీరాల సబ్ ట్రెజరీ ఆఫీస్ కార్యాలయంలో ఉద్యోగుల వర్గపోరు, అవినీతి, ఆదాయ వనరులపై వచ్చిన ఆరోపణలకు సంబంధించి డీటీవో శివకామేశ్వరి బుధవారం కలెక్టర్ వెంకటమురళికి నివేదికను అందజేశారు. మంగళవారం డైరెక్టర్ ఆఫ్ ట్రెజరీస్ అకౌంట్స్‌కు కూడా డీటీవో వివరణ ఇచ్చారు. ఈ నేపథ్యంలో కార్యాలయం ఉద్యోగులు సరిదిద్దుకుందామా.. సర్దుకుపోదామా అనే కోణంలో తాజాగా మంతనాలు జరిపినట్లు సమాచారం. సరిదిద్దుకోవడమంటే అవినీతి సొమ్ముకు ఆశించకుండా పర్సంటేజీ పద్ధతికి స్వస్తి పలకడం, లేదా తాత్కాలికంగా తమలో ఉన్న విభేధాలను పక్కనపెట్టి సర్దుకుపోయి పర్సంటేజీల పర్వాన్ని కొనసాగించడం అన్నదానిపై మంతానాల సాగినట్లు తెలుస్తుంది. అయితే అందుకు సంబంధించి తుది నిర్ణయం తీసుకోవలేదని సమాచారం. ఎస్టీవో, ఓ సీనియర్ అకౌంటెంట్ ఒక వర్గంగాను, మిగిలిన ఉద్యోగులు మరోవర్గంగా ముందస్తుగా ఫిర్యాదులు చేసుకున్నారు. ఈ క్రమంలో నూతన ఆఫీస్ ఆర్డరకు సంబంధించి విభేదాలు వీధికెక్కాయి. ఆ క్రమంలో కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్డీవో సూర్యనారాయణ రెడ్డి, డీటీవో శివకామేశ్వరి విచారణ చేపట్టారు. అందులో భాగంగా ఈ నెల 15న విచారణ క్రమంలో నూతన ఆఫీస్ ఆర్డర్ ను అంగీకరిస్తూ సంబంధిత కార్యాలయ ఉద్యోగులు సంతకాలు చేశారు. పెండింగ్ బిల్లులను పాస్ చేశారు. పూర్తి విచారణ నివేదికను డీటీవో శివకామేశ్వరి కలెక్టర్‌కు అందజేశారు. ఆ నివేదికను డైరెక్టర్ ఆఫ్ ట్రెజరీస్ అకౌంట్స్‌కు కూడా అందజేస్తారు. నివేదక ఆధారంగా అధికారులు ఏం చర్యలు తీసుకుంటారనే విషయం అటుంచితే ఎవరిపైనా వేటు పడకుండా పరిస్థితిని చక్కదిద్దుకోవాలనే దిశగా ఎస్టీవో, ఇతర కార్యాలయ ఉద్యోగులు మంతనాలు జరపడం కొసమెరుపు. ఇక ఉన్నతాధికారులు ఏం చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సిందే.

అన్ని విషయాలను ఖండిస్తున్నా

జరిగిన పరిణామాలకు సంబంధించి అన్ని విషయాలను ఖండిస్తున్నాను. బిల్లులకు పర్సంటేజీలు వసూలు చేస్తారా అన్న ప్రశ్నకు కూడా దాన్ని ఖండిస్తున్నా. అనారోగ్యం కారణంగా కొన్ని పొరపాట్లు జరిగాయి. భవిష్యతలో ఏ పొరపాట్లు జరగకుండా చూసుకుంటాను.

\- భాగ్యలక్ష్మి, ఎస్టీవో, చీరాల



చీరాల సబ్‌ట్రెజరీ కార్యాలయం



అరకొర దొరికిన మత్స్యసంపద

చిక్కని చేప.. గాడిన పడని వేట

వాయుగుండం తర్వాత మారిన పరిస్థితులు

చీరాల, సెప్టెంబరు 18: వాయుగుండం అనంతరం సముద్ర గర్భంలో చోటుచేసుకున్న మార్పులు స్థానిక మత్స్యకారుల ఉపాధిని దెబ్బతీసింది. చేపలు చిక్కడం లేదు. వేటకు పెట్టిన ఖర్చులు కూడా రావడం లేదని కొందరు వాపోతున్నారు. వాయుగుండం ప్రభావంతో కొద్ది రోజులు సముద్రంలో వేట ఆగింది. సారంగులు, కళాసీలు ఆ సమయంలో ఒకింత ఇబ్బంది పడ్డారు. వేట గాడిన పడితే నాలుగు రూపాయలు కళ్లచూస్తామనుకున్న వారి ఆశలు అడియాశలవుతున్నాయి. వర్షాలు ఆగిన తర్వాత వేటకు వెళ్లిన మత్స్యకారుల వలలకు మత్స్యసంపద సక్రమంగా దొరకడం లేదు. సాధారణంగా వాయుగుండాల తర్వాత సముద్రంలో మత్స్యసంపద బాగానే వలకు చిక్కుతుంది. అయితే ప్రస్తుతం ఆ పరిస్థితి లేదని మత్స్యకారులు వాపోతున్నారు. కారణం అంతుచిక్కడం లేదని ఆందోళన చెందుతున్నారు. వాతారణ మార్పుల నుంచి వచ్చే ప్రతికూల పరిస్థితులతో వేటాడేందుకు చేసిన ఖర్చు కూడా తిరిగి రాకపోవడంతో, మరలా వేటకు కొంతమేర అప్పులు చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాధారణంగా వారంలో శనివారం రోజు జరిగే మార్కెట్‌కు ఒకింత గిరాకీ ఉంటుంది. దీంతో సాధారణ రోజులుకన్నా ఆ రోజు తాము వేటాడిన మత్స్యసంపదకు అదనపు ధర లభిస్తుంది. అయితే గత రెండు వారాలుగా ఆ పరిస్థితి లేదని మత్స్యకారులు చెప్తున్నారు. త్వరలోనే సముద్రగర్భం యథాస్థితికి వస్తుందని, తమకు అనుకూలంగా పరిస్థితులు ఉంటాయని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ఇన్‌చార్జ్‌ల ఇష్టారాజ్యం

పర్యవేక్షణ లేని పంచాయతీరాజ్

నాలుగు కీలక శాఖలకు పక్కశాఖల వారే దిక్కు

రెండింటికి గుంటూరు జిల్లా అధికారులు

క్షేత్రస్థాయిపై దృష్టిపెట్టని దుస్థితి

నామమాత్రంగానే విధుల నిర్వహణ

మీనమేషాలు లెక్కిస్తున్న ప్రభుత్వ పెద్దలు

కొన్నిశాఖల్లో మొదలైన గందరగోళం

జిల్లాలో పంచాయతీరాజ్ శాఖల్లో పర్యవేక్షణ కొరవడింది. ఆ విభాగంలో కీలకమైన నాలుగు శాఖల్లో జిల్లా అధికారులుగా ఇన్‌చార్జీలే కొనసాగుతున్నారు. అందులో రెండింటికి ఆరు నెలలుగా కొనసాగుతుండగా, తాజాగా ఖాళీ అయిన రెండింటికి ఏకంగా సుదూరంగా ఉండే గుంటూరు జిల్లా అధికారులే దిక్కయ్యారు. దీంతో వారు మొక్కుబడిగా విధుల నిర్వహణ తప్ప క్షేత్రస్థాయి పర్యటనలు, సమీక్షలు, లోటుపాట్లు సరిదిద్దే ప్రయత్నాలు శూన్యంగానే కనిపిస్తున్నాయి. కొందరు అధికారుల తీరుతో శాఖలలో పాలన అస్తవ్యస్తంగా తయారైంది. కొందరు కింది స్థాయి అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు.



ఎస్ఈ కార్యాలయం

ఒంగోలు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీరాజ్ శాఖల్లో ఇన్‌చార్జిల పాలన నడుస్తోంది. దీంతో అంతా అస్తవ్యస్తంగా తయారైంది. గ్రామీణ ప్రాంత ప్రజల అవసరాలు తీర్చే అత్యంత కీలకమైన విభాగం పంచాయతీరాజ్. దాని పరిధిలోనే జిల్లాలో నాలుగు శాఖలు నడుస్తుంటాయి. అందులో మొత్తం గ్రామపంచాయతీల పర్యవేక్షణ జిల్లా పంచాయతీ అధికారి పర్యవేక్షణలో, మండల, జిల్లా పరిషత్‌ల పర్యవేక్షణ జిల్లా పరిషత్ సీఈఓ పర్యవేక్షణలో నడుస్తాయి. గ్రామ పంచాయతీలు, మండల, జిల్లా పరిషత్‌ల పాలన వ్యవహారాలలో ఈ రెండు అత్యంత కీలకం. అలాగే గ్రామీణ ప్రజల మౌలిక అవసరాలైన రోడ్లు, డ్రైన్లు, వివిధ నిర్మాణాలను పర్యవేక్షించేది పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం. కాగా ఆ విభాగం ఎస్ఈ పర్యవేక్షణలో న డుస్తుంది. ఇక గ్రామీణ ప్రజల తాగునీటి సరఫరా పర్యవేక్షణ బాధ్యత గ్రామీణ నీటి సరఫరా విభాగం ఎస్ఈ పరిధిలో ఉంటుంది.

పక్కజిల్లావారికి బాధ్యతలు

కాగా పంచాయతీరాజ్‌లో మరో ప్రధానమైన పీఆర్ ఇంజనీరింగ్, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖల పరిస్థితి అలాగే ఉంది. ఇక్కడ పీఆర్ ఎస్ఈగా పనిచేస్తున్న కొండయ్య మే 31న పదవీ విరమణ చేయగా గుంటూరు ఎస్ఈగా ఉన్న జి.అశోక్‌ను ఇన్‌చార్జిగా నియమించారు. సాధారణంగా ఇలాంటి సమయంలో జిల్లాకేంద్రంలో లేదా కనీసం జిల్లాలో ద్వితీయశ్రేణిలో ఉండే ఈఈ స్థాయి అధికారికి ఇన్‌చార్జి ఇస్తారు. అయితే ఒంగోలు ఈఈ పోస్టు ఖాళీగా ఉండి కందుకూరు ఈఈ కోటేశ్వరరావు ఇక్కడ ఇన్‌చార్జిగా ఉండటం, మార్కాపురంలో ఉన్న రెండు ఈఈ పోస్టులకు ఒక్కరే ఉండటంతో గుంటూరు ఎస్ఈకి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించినట్లు చెప్తున్నారు. అయితే ఒంగోలు పీఐయూ విభాగంలో మరొక ఈఈ ఉన్నా ఆయనకు ఇన్‌చార్జి బాధ్యతపై ఉన్నతాధికారులు దృష్టిపెట్టలేదు. దీంతో గుంటూరు ఎస్ఈ అశోక్ ప్రస్తుతం ఉమ్మడి గుంటూరు జిల్లాతోపాటు ఉమ్మడి ప్రకాశం జిల్లా పర్యవేక్షణ చేయాల్సి రాగా జిల్లాకు చుట్టపుచూపుగా కూడా వస్తున్న పరిస్థితి లేదు. ఈ విభాగం పరిధిలో దాదాపు రూ.120 కోట్ల మేర తాజాగా ఉపాధి పథకం అనుసంధానం పనులు మంజూరు కాగా వాటి పర్యవేక్షణ ప్రశ్నార్థకంగా కనిపిస్తోంది.

ఒకే అధికారి రెండు పోస్టులకు ఇన్‌చార్జి

ఆ రకంగా ఆ నాలుగు శాఖలు అత్యంత కీలకం కాగా ప్రస్తుతం వాటి జిల్లా స్థాయి అధికారులు ఇన్‌చార్జీలుగా ఉంటూ మొక్కుబడిగా విధులు నిర్వహిస్తున్నారు. వీటిలో జడ్పీ సీఈవో, డీపీవో పోస్టులు ఆరు మాసాలకుపైగా ఇన్‌చార్జీల పాలనలో నడుస్తున్నాయి. జడ్పీ సీఈవో ఇక్కడ పనిచేస్తున్న జాలిరెడ్డి, డీపీవోగా ఉన్న నారాయణరెడ్డిలు సొంత జిల్లా వారు కావడమే కాక దీర్ఘకాలంగా ఇక్కడే పనిచేసిన నేపథ్యంలో సాధారణ ఎన్నికలకు ముందు ఎన్నికల కమిషన్ ఆదేశాలతో బదిలీ జరిగింది. మార్చిలో అలా జరగ్గా అప్పటి నుంచి ఇన్‌చార్జి అధికారులే దిక్కయ్యారు. జడ్పీ సీఈవోగా కలెక్టర్ కార్యాలయంలో విపత్తుల నిర్వహణ విభాగంలో డిప్యూటీ కలెక్టర్ హోదాలో ఉన్న మాధురి ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. ఆమె అప్పటికే స్త్రీశిశుసంక్షేమశాఖ పీడీగా పూర్తి అదనపు బాధ్యతల్లో ఉండటంతో ఏకంగా మూడు బాధ్యతలు నిర్వర్తించాల్సి వచ్చింది. అలాగే ఒంగోలు డివిజన్ అభివృద్ధి అధికారిగా ఉన్న ఉషారాణిని ఇన్‌చార్జి డీపీవోగా నియమించారు. ఆమె ఈ రెండింటితోపాటు గ్రామ, వార్డు సచివాలయాల నోడల్ అధికారిగా ఉండి అలా మూడు పోస్టుల్లో పనిచేస్తున్నారు. అలా మూడేసి బాధ్యతల్లో ఉన్నవారు పనిభారంతో దేనికి సరిగా న్యాయం చేయలేని పరిస్థితి కనిపిస్తోంది.

అవగాహన లేని ఉన్నతాధికారులు

ఇక జిల్లాలో ఆర్‌డబ్ల్యూఎస్ విభాగం కూడా ప్రధానమైంది. వందల కోట్ల రూపాయల విలువైన జలజీవన్ మిషన్ పనులు, అలాగే గ్రామ స్థాయి రక్షిత తాగునీటి పథకాలు, ట్యాంకర్లతో నీటి సరఫరా, సాగర్ నీటితో ఎస్ఎస్ ట్యాంకులు, చెరువులు నింపడం వంటి కీలకమైన పనుల పర్యవేక్షణ ఆ శాఖ ఎస్ఈ పరిధిలో ఉంటాయి. ఆ పోస్టులో ఇక్కడ సుదీర్ఘకాలం పనిచేసిన మర్దన్‌అలీ ఆగస్టు 31న పదవీ విరమణ చేశారు. ఆ స్థానంలో జిల్లాలోని అధికారులకు కాకుండా గుంటూరు జిల్లా ఎస్ఈ సురేష్‌ను ఇన్‌చార్జిగా నియమించారు. ఆయన గుంటూరు ఎస్ఈతోపాటు అప్పటికే నెల్లూరు ఎస్ఈగా కూడా ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ముచ్చటగా మూడవ జిల్లా ఎస్ఈగా ప్రకాశం బాధ్యతలను కూడా అప్పగించారు. ఒంగోలు ఎస్‌గా ఒక్క పోస్టులో ఉంటే నే తీరిక లేని పనివత్తిడి ఉంటే ఈ పోస్టులో ఏకంగా మూడు జిల్లాల పర్యవేక్షణ ఏలా సాధ్యమన్నది ఉన్నతాధికారులకే తెలియాలి. జిల్లాపై అవగాహన లేకుండా ఉన్నతాధికారులు, సమన్వయం, పర్యవేక్షణ లేనివిధంగా కీలక ప్రజాప్రతినిధులు వ్యవహరిస్తుంటడంతో పంచాయతీరాజ్ విభాగంలో ఈ పరిస్థితి ఏర్పడింది. తక్షణం రెగ్యులర్ అధికారుల నియామకాలు చేపట్టకపోతే ఇప్పటికే అంతంతమాత్రంగా కనిపిస్తున్న పంచాయతీరాజ్ విభాగం పర్యవేక్షణ మరింత దిగజారే పరిస్థితి కనిపిస్తోంది.

శానిటేషన్‌పై కదిలిన యంత్రాంగం

గవినివారిపాలెంలో పారిశుధ్య పనులు

వాస్తవ అవాస్తవాలపై ఎంపీడీవో విచారణ



ఆంధ్రజ్యోతి కథనంపై విచారణ నిర్వహిస్తున్న అధికారులు

చీరాలటౌన్, సెప్టెంబర్ 18 : ఎట్టకేలకు చీరాల మండల పరిధిలోని గవినివారిపాలెంలో శానిటేషన్‌పై అధికార యంత్రాంగంలో కదలిక వచ్చింది. ఆంధ్రజ్యోతిలో బుధవారం ప్రచురితమైన గవినివారిపాలెంలో పారిశుధ్యం అధ్వాన్నం కథనంపై స్పందించారు. ఉదయం నుంచే కార్యదర్శి నీలిమ కార్మికుల సహకారంతో శానిటేషన్‌పై ప్రత్యేక దృష్టి సారించారు. గ్రామంలో పేరుకుపోయిన చెత్తా చెదారాన్ని తొలగించారు. మురుగు ప్రదేశాల్లో బ్లీచింగ్ చల్లారు. ఎంపీడీవో కార్యాలయంలో ఆమెపై వచ్చిన ఆరోపణలపై ఎంపీడీవో విచారణ చేపట్టారు. ఇందులో ఈవోఆర్డీ మురళీ బాపూజీ, ఏవో శ్రీనివాసరావు, సెక్రటరీ నీలిమ ఉన్నారు.

పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి

- నేతాజీ, ఎపీఈడీవో, చీరాల మండలం

అన్ని గ్రామాలపై శానిటేషన్ పరంగా ప్రత్యేక దృష్టి సారిస్తాం. ప్రజారోగ్యం దృష్ట్యా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నాం. గవినివారిపాలెం సెక్రటరీపై వచ్చిన ఆరోపణలపై విచారణ చేస్తున్నాం.

వరద ప్రాంతాలకు పశుగ్రాసం తరలింపు



పశుగ్రాసం తరలిస్తున్న చీరాల న్యాయవాదుల సంఘం

చీరాలటౌన్, సెప్టెంబరు 18 : వరద ప్రభావంతో మూగ జీవాలకు పశుగ్రాసం కొరత ఏర్పడడం బాధాకరమని చీరాల న్యాయవాదుల సంఘం ప్రతినిధులు అన్నారు. ఈక్రమంలో బుధవారం రూ.25వేలు విలువైన ట్రాక్టర్ పశుగ్రాసాన్ని ముంపు ప్రాంతమైన కొల్లూరు మండలం తోకావారిపాలెం రైతులకు పంపించారు. ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ మునుపెన్నడూ లేని విధంగా వరద ప్రభావం సంభవించిన తీరుపై బాధను వ్యక్తం చేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు గౌరవ రమేష్‌బాబు, సాయిబాబు, ఆదినారాయణ, చలపతిరావు, గంగరాజు, హరిబాబు, సుబ్రహ్మణ్యం, రామకృష్ణారెడ్డి, కోటేశ్వరమ్మ, కామేశ్వరరావు పాల్గొన్నారు.

వరద బాధితులకు రూ.లక్ష విరాళం

సంతమాగులూరు, సెప్టెంబరు 18 : భారీ వర్షాలకు అతలాకుతలమైన విజయవాడ వరద బాధితులకు సహాయంగా రూ.లక్ష చెక్కును విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు బుధవారం అందించారు. మండలంలోని వెల్లలచెరువు గ్రామానికి చెందిన చింతా శ్రీకాంత్ పోలాండ్ దేశంలో వ్యాపార నిమిత్తం ఉంటున్నారు. వరద బాధితులకు తన వంతు సహాయంగా అందించాలని రూ.లక్ష చెక్కును తన సోదరుడు, సొసైటీ మాజీ అధ్యక్షులు చింత శ్రీధర్‌బాబు ద్వారా విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు అందించారు. జడ్పీటీసీ మాజీ సభ్యుడు చింతా రామారావు, చింతా వెంకయ్య ఉన్నారు.

బస్సును ఢీకొన్న ట్రాక్టర్




ఆగి ఉన్న ట్రావెల్స్ బస్సును ఢీకొన్న ట్రాక్టర్

మేదరమెట్ల, సెప్టెంబరు 18 : జాతీయ రహదారిలో తిమ్మనపాలెం-మేదరమెట్ల మధ్య ఆగి ఉన్న బస్సును ట్రాక్టర్ ఢీకొట్టింది. బుధవారం మధ్యాహ్నం బెంగళూరు నుంచి విజయవాడ వెళ్తున్న ట్రావెల్స్ బస్సు సెన్సార్ సమస్యతో రోడ్డు పక్కన ఆగింది. అదే మార్గంలో సిమెంట్ ఇటుకలతో వస్తున్న ట్రాక్టర్ కారును తప్పించబోయి బస్సును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాలేదు. మేదరమెట్ల పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్ సమస్యలు లేకుండా చూశారు.

రైలు కిందపడి వృద్ధుడి మృతి

చీరాలటౌన్, సెప్టెంబర్ 18 : గుర్తు తెలియని వృద్ధుడు రైలు కిందపడి మృతి చెందారు. ఈ ఘటన స్టూవర్టుపురం రైల్వే స్టేషన్ సమీపంలో బుధవారం మధ్యాహ్నం జరిగింది. వృద్ధుడు బట్టతలతో, తెలుపురంగు నిండు చేతుల లాల్చీ, ఆకుపచ్చ చిన్న గడుల లుంగీని ధరించి ఉన్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతిచెందిన వ్యక్తిది వెదుళ్లపల్లి సమీపంలోని కొత్తపాలెం లేదా బేతపూడికి చెందిన వాసిగా అనుమానిస్తున్నారు.

సాగులో శాస్త్రీయ పద్ధతులు అనుసరించాలి



విత్తన శుద్ధి చేస్తున్న సిబ్బంది

మేదరమెట్ల, సెప్టెంబరు 18 : రైతులు పంటల సాగులో శాస్త్రీయ పద్ధతులను అనుసరించాలని వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని రావినూతల గ్రామంలో పొలంబడి కార్యక్రమంలో భాగంగా మినుము సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రైతులకు విత్తన శుద్ధితో కలిగే లాభాలను వివరించారు. కార్యక్రమంలో వీఏవో మౌనిక, రైతులు పాల్గొన్నారు.

పెరుగుతున్న జ్వరపీడితులు

రోగులతో కిక్కిరిస్తున్న ఆసుపత్రులు.. ఆందోళనలో ప్రజలు

పర్చూరు, సెప్టెంబరు 18 : గ్రామాల్లో జ్వరాలు వణికిస్తున్నాయి. రోజు రోజుకు పెరుగుతున్న జ్వరపీడితులతో ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు కిక్కిరుస్తున్నాయి. గ్రామాల్లో ఇంటికి ఇద్దరు చొప్పున రోగులు మంచంపట్టారు. రోజుల తరబడి జ్వరం, ఒంటి నొప్పిలతో ప్రజలు బాధపడుతున్నారు. డెంగ్యూ, గున్యా, మలేరియా కేసులు నమోదవుతుండడంతో ప్రజలు భయపడుతున్నారు. పర్చూరు ప్రభుత్వ ఆసుపత్రిలో జ్వరబాధితులు బారులు తీరుతున్నారు. పారిశుధ్య లోపం, పరిశుభ్రమైన నీరు లేకపోవడంవల్లే రోగాలు ప్రబలుతున్నాయని వైద్యులు చెప్తున్నారు. ప్రస్తుతం గ్రామాల్లో నమోదవుతున్న జ్వరపీడితులను దృష్టిలో పెట్టుకొని ప్రత్యేక వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఆదిశగా ఉన్నతాధికారులు దీనిపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



జ్వరపీడితులతో కిక్కిరిస్తున్న పర్చూరు ప్రభుత్వ వైద్యశాల

సక్రమంగా మధ్యాహ్న భోజనం అందించాలి

- కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశం



మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 18 : జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని సక్రమంగా అమలు జరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాలులో బుధవారం విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులతో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. మధ్యాహ్న భోజనం అమలులో ఆహార పట్టికను పక్కాగా పాటించాలన్నారు. ఆ విషయంలో ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తేవాలని సూచించారు. విద్యార్థులకు పాఠశాలలో పెడుతున్న భోజనం ఇష్టంగానే తింటున్నారా లేదా? అని అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు భోజనాన్ని తరుచూ పరిశీలిస్తుండాలని ఆదేశించారు. పాఠశాలల్లో రక్షిత మంచినీటిని అందుబాటులో ఉంచాలన్నారు. ఈ సందర్భంగా టీచర్లు, కుకింగ్ ఏజెన్సీల నిర్వాహకులు మాట్లాడుతూ వారంలో రెండు రోజుల పాటు పులిహోర పెడుతున్నారని, దానిని ఒక రోజుకు కుదించాలని కోరారు. కోడిగుడ్లను ఉడికించి ఐదు రోజులు ఇస్తున్నారని, రెండు, మూడు రోజులు కోడిగుడ్డు కర్రీ రూపంలో ఇస్తే బాగుంటుందని తెలిపారు. అన్నం, సాంబరు విడిగా ఉంటే బాగుంటుందని ఉపాధ్యాయులు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. మెనూ చార్జీలు పెంచాలని, ప్రస్తుతం ఇస్తున్నవి సరిపోవడం లేదని ఏజెన్సీలు కలెక్టర్ దృష్టికి తెచ్చారు.

ఆయా అంశాలపై కలెక్టర్ మాట్లాడుతూ ఆహార పట్టికలో మార్పులు చేస్తూ ప్రభుత్వానికి నివేదికను పంపుతామన్నారు. మధ్యాహ్న భోజన పథకం అమలుపై ఉపాధ్యాయులు ప్రత్యేకశ్రద్ధ తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. విద్యా బోధనతో పాటు పాఠశాల నిర్వహణ, శానిటేషన్, నీటి సదుపాయం, హ్యాండ్‌వాష్ ప్రక్రియ తదితర అంశాలపై కూడా దృష్టిసారించాలన్నారు. సమావేశంలో డీఈవో సుభద్ర, డిప్యూటీ డీఈవో సుబ్బారావు, ఎంఈవోలు పాల్గొన్నారు.

మెగా జాబ్ మేళాకు అనూహ్య స్పందన

2,300 మందికి పైగా యువత హాజరు

585 మందికి ఉద్యోగావకాశాలు

పాల్గొన్న 42 కంపెనీలు



ఇంటర్వ్యూలకు ఎంపికైన వారితో లక్ష్మి, సాగర్ దంపతులు

దర్శి, సెప్టెంబరు 18 : నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్ తమ సొంత నిధులతో నిర్వహించిన మెగా జాబ్ మేళాకు అనూహ్య స్పందన లభించింది. మొత్తం 2300 మంది యువతీ యువకులు మేళాలో పాల్గొన్నారు. టెక్ మహీంద్ర, అమర్‌రాజా బ్యాటరీస్ తదితర కంపెనీలతో పాటు మొత్తం 42 సంస్థల ప్రతినిధులు పాల్గొని ఇంటర్వ్యూలు నిర్వహించారు. దర్శి, మార్కాపురం, ఎర్రగొండపాలెం నియోజకవర్గాలతో పాటు జిల్లాలోని అనేక ప్రాంతాల నుంచి నిరుద్యోగులు వచ్చారు. కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించి 585 మందిని ఎంపిక చేశారు. మరో 200 మందిని పరిశీలనలో ఉంచారు. వారికి కూడా త్వరలో ఉద్యోగావకాశాలు లభించే అవకాశం ఉంది.

యువత చేతుల్లోనే దేశ భవిష్యత్తు

దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ చెప్పారు. ఉద్యోగాలకు ఎంపికైన యువతకు డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ, డాక్టర్ లలిత్‌సాగర్ దంపతులు ఎంపిక ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువత సన్మార్గంలో ముందుకు సాగి దేశాభివృద్ధికి దోహదపడాలని కోరారు. అందుకు యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పించాల్సిన బాధ్యత పాలకులపై ఉందన్నారు. జాబ్ మేళాలను నిరంతరం కొనసాగిస్తామని చెప్పారు. హెచ్‌ఆర్‌సీ సంస్థ ద్వారా నియోజకవర్గంలో ఇంటింటి సర్వే చేపట్టి నిరుద్యోగ యువత వివరాలను తెలుసుకుంటామని, అవసరమైన వారికి శిక్షణ అందించి అందరికీ ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు పాల్గొన్నారు.

బ్లాక్ పెరల్ గ్రానైట్ అసోసియేషన్ రూ.50.50లక్షల విరాళం



మంత్రికి విరాళం చెక్కును అందజేస్తున్న ప్రతినిధులు

సంతమాగులూరు, సెప్టెంబరు 18 : వరద బాధితులను ఆదుకునేందుకు బ్లాక్ పెరల్ గ్రానైట్ క్వారీ అసోసియేషన్ ప్రతినిధులు ముందుకు వచ్చారు. పల్నాడు, బాపట్లకు చెందిన ఆయా సంస్థల ప్రతినిధులు విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్‌ను రాష్ట్ర సచివాలయం వెలగపూడిలో కలిసి రూ.50,50,000 చెక్కును అందజేశారు. విరాళాలు అందించిన వారిలో మను గ్రానైట్స్ రూ.5లక్షలు, ఏ.నరసింహారావు క్వారీ రూ.5లక్షలు, వీరాంజనేయ క్వారీ రూ.5లక్షలు, కామేపల్లి ఎక్స్‌పోర్ట్స్ రూ.5లక్షలు, గగన్ మినరల్స్ రూ.2.5లక్షలు, సౌదామిని గ్రానైట్స్ రూ.5లక్షలు, ఇంపీరియల్ గ్రానైట్స్ రూ.4లక్షలు, గౌతమ్ గ్రానైట్ రూ.2లక్షలు, మధుకాన్ గ్రానైట్స్ రూ.1లక్ష, శ్రీవిష్ణు గ్రానైట్స్ రూ.లక్ష, వీరభద్ర మినరల్స్ ప్రై.లి రూ.5లక్షలు, మన్నేపల్లి వెంకటరావు రూ.లక్ష, వీర హనుమాన్ గ్రానైట్స్ రూ.2లక్షలు, వీరహనుమాన్ మినరల్స్ రూ.2లక్షలు, స్వస్తిక్ ఎక్స్‌పోర్ట్స్ రూ.2లక్షలు, కేబీ రాక్స్ రూ.3 లక్షలు, వీరితో పాటు మరికొందరు దాతలు కూడా సీఎం రిలీఫ్ ఫండ్‌కు చెక్కులను అందించారు. చింతా శ్రీకాంత్ రూ.లక్ష, కుర్రవానిపాలెంలో నాదెండ్ల కోటేశ్వరరావు ఆధ్వర్యంలో గ్రామస్థులు సేకరించిన రూ.లక్ష, అనంతలక్ష్మి రూ.87 వేలు, మల్లిపెద్ది హనుమంతరావు రూ.10,116, కొట్టె రవీంద్ర రూ.లక్ష, జే పంగలూరు వెలుగు సభ్యులు రూ.1,01,116, అద్దంకి ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రూ.20,116, కర్రి సత్యనారాయణ ఇంకొల్లు రూ.50వేలు, రాధ మాధవి రామకూరు రూ.1,70,000 విరాళాలను కలిపి మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు అందజేశారు.

ముగ్గురు కార్యదర్శుల సస్పెన్షన్

ఉత్తర్వులను ఎట్టకేలకు బయటపెట్టిన పంచాయతీ అధికారి

ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 18: జిల్లాలోని రెండు గ్రామపంచాయతీల్లో అవినీతి, అక్రమాలకు పాల్పడిన ముగ్గురు గ్రామ పంచాయతీ కార్యదర్శులను సస్పెండ్ చేస్తూ డీపీవో ఉత్తర్వులు జారీచేశారు. వాస్తవంగా ఆ ముగ్గురు కార్యదర్శులను బుధవారమే సస్పెండ్ చేసినా ఆ ఉత్తర్వులను బయటపెట్టకుండా దాచిపెట్టిన విషయంపై ఆంధ్రజ్యోతి వెలుగులోకి తెచ్చింది. దీంతో ముగ్గురు కార్యదర్శుల సస్పెన్షన్ చేసిన ఉత్తర్వులను ఆయా మండలాల ఎంపీడీవోలకు పంపారు. సింగరాయకొండ గ్రామ పంచాయతీ కార్యదర్శి రామకోటయ్య రూ.79వేలను ఫోన్‌పే ద్వారా తన బ్యాంకు ఖాతాకు జమచేయించుకొని రికార్డులు చూపలేదు. జనన, మరణ ధ్రువీకరణ పత్రాలను గ్రామపంచాయతీ రికార్డు దాఖలు లేకుండా జారీచేయడంతో రామకోటయ్యను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు. మద్దిపాడు మండలం దొడ్డవరప్పాడు గ్రామ పంచాయతీ ఇన్‌చార్జి కార్యదర్శి పి.శ్రీనివాసులు, పెదకొత్తపల్లి పంచాయతీ కార్యదర్శి(గ్రేడ్-5) ఎన్.వినోద్‌లను సస్పెండ్ చేశారు. దొడ్డవరప్పాడు పంచాయతీలో ముందస్తు నోటీసులు లేకుండా వార్డుసభ్యుల ఆమోదం లేకుండా ఈ ఏడాది జనవరి 12, ఈ ఏడాది ఫిబ్రవరి 23న మీటింగ్ నిర్వహించినట్లుగా రికార్డుల్లో నమోదు చేశారు. సిమెంట్ రోడ్డు నిర్మాణం కోసం పంచాయతీ తీర్మానం చేశారు.

సర్పంచ్ బెజవాడ శ్రీరామమూర్తి నిబంధనలకు విరుద్ధంగా రూ.7,36,400 తన సొంత ఖాతాకు నిధులు బదిలీ చేసుకున్నట్లు ఉప సర్పంచ్ మురళీ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు డివిజనల్ పంచాయతీ అధికారి విచారణ చేసి ఆ నిధులకు సంబంధించి నివేదిక ఇచ్చారు. పంచాయతీ నిధులకు ఆమోదం లేకుండా నిధులు డ్రా చేసేందుకు సహకరించిన గ్రామపంచాయతీ కార్యదర్శి, డ్రాయింగ్ అధికారి పి.శ్రీనివాసులు, గ్రేడ్-5 కార్యదర్శి వినోద్‌లను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

పీవీఆర్ స్కూలు పీడీ సస్పెన్షన్

ఒంగోలు(విద్య), సెప్టెంబరు 18: ఒంగోలు పీవీఆర్ బాలికోన్నత పాఠశాలలో ఫిజికల్ డైరెక్టర్(పీడీ)గా పనిచేస్తున్న జ్యోత్స్నాదేవి సస్పెండయ్యారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆమెను సస్పెండ్ చేస్తూ డీఈవో సుభద్ర బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. పీవీఆర్ బాలికోన్నత పాఠశాలలో పదవ తరగతి, 8వ తరగతి చదువుతున్న ఇద్దరు అక్కాచెల్లెళ్లలను పీడీ సూటిపోటి మాటలతో వేధిస్తూ శిక్షిస్తుందని ఆ బాలికల తల్లి రావిపాటి లక్ష్మి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై ఈనెల 9న డిప్యూటీ కలెక్టర్ లోకేశ్వరరావు విచారణ చేసి నివేదికను సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ ఫిర్యాదుపై విచారణ నిర్వహించిన లోకేశ్వరరావు సాక్ష్యాధారాలను పరిశీలించి కలెక్టర్‌కు నివేదికను సమర్పించారు. దానిని పరిశీలించిన కలెక్టర్ విద్యార్థినులను వేధింపులకు గురిచేసిన పీడీ జ్యోత్స్నాదేవిని సస్పెండ్ చేయాలని డీఈఓను ఆదేశించారు. దీంతో పీడీని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులను బుధవారం పాఠశాల హెచ్ఎంకు పంపారు.

కొనసాగుతున్న వైద్యుల ఆందోళన

సమస్యను పరిష్కరించేంత వరకు ఆందోళనలు



ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 18: పీజీ విద్యలో ఇన్ సర్వీసు కోటాను తగ్గించడాన్ని వ్యతిరేకిస్తూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు చేపట్టిన ఆందోళన కొనసాగుతోంది. వారం నుంచి వివిధ రూపాల్లో ఆందోళనలు నిర్వహిస్తున్న వైద్యాధికారులు బుధవారం విజయవాడలో జరిగిన ధర్నాకు తరలివెళ్లారు. పీజీ విద్యలో ఇన్ సర్వీసు కోటాను 15శాతానికి తగ్గించడాన్ని నిరసిస్తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రైమరీ హెల్త్ సెంటర్స్ డాక్టర్స్ అసోసియేషన్ పిలుపు మేరకు జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో వైద్యులు ఈ ఆందోళనలు చేస్తున్నారు. గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ల పట్ల ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తూ పీజీ విద్యలో ఇన్‌సర్వీసు కోటాను తగ్గిస్తూ ప్రభుత్వం జీవో నెంబరు 85 జారీచేయడాన్ని ఖండించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే ఈ జీవోను రద్దుచేయాలని అసోసియేషన్ నాయకులు కోరారు.

AJ ఆంధ్రజ్యోతి ప్రతిరోజు క్లాసిఫైడ్స్ — ప్రతి అవసరానికి వేగవంతమైన ఫలితం

WANTED
■ నవయుగ పెట్రోలియమ్స్, త్రోవగుంట లోని కరవది రోడ్డులో గల పెట్రోలు బంకులో పనిచేయుటకు బాయ్స్, గర్ల్స్ కావలెను. సంప్ర॥ సెల్: 9866774691
AJO-190476

సేల్స్ గర్ల్స్ కావలెను
■ ఒంగోలు ప్రముఖ ఫర్నీచర్ షాపులో పనిచేయుటకు సేల్స్ గర్ల్స్ కా॥ వయస్సు : 20 to 40లోపు, అర్హత : డిగ్రీ లేదా B.Tech Complete. జీతం: 20,000 + ఇన్సెంటీవ్స్. సంప్ర॥ సెల్ : 83744 44414, 90305 90855
AJO-200142

WANTED
■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను / పేషంట్స్ చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం 18K. Ph: 9160900024 / 9640400073
AJH-15220

PLOT FOR SALE
■ చీరాల - ఉడ్ నగర్‌లో ఇండ్ల మధ్యలో తక్షణమే నిర్మాణానికి అనువైన 6 సెంట్లు ఖాళీ స్థలము మున్సిపల్ వాటర్ కనెక్షన్‌తో అమ్మబడును కలదు. Cell : 98489 11566
AJB-194015

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

ఆంధ్రజ్యోతి దినపత్రిక ద్వారా ఇప్పుడు మీ ఆత్మీయులకు ప్రకటనలతో మరింత చేరువకండి.
జన్మదిన శుభాకాంక్షలు | వివాహ/షష్టిపూర్తి శుభాకాంక్షలు
విదేశీయాన / స్వదేశాగమన శుభాకాంక్షలు | లీగల్ నోటీసులు బ్యాంకు ప్రకటనలు
ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు | మొదలగు అన్ని రకముల పత్రికా ప్రకటనలకు మీ ఏరియాలోని మా ప్రతినిధిని సంప్రదించండి. ప్రతి ప్రకటనపై GST 5% అదనం.
ఒంగోలు : 99854 11071, 97036 18694, 99854 11483
చీమకుర్తి : 96525 55752
చీరాల : 99859 21376
మార్కాపురం : 99859 21358
కందుకూరు : 97036 18697
కనిగిరి : 99854 11483
గిద్దలూరు : 99859 21358
ఆంధ్రజ్యోతి దినపత్రిక కొరకు సంప్ర॥ 9985411484

ఎండుతున్న ఖరీఫ్ పంటలు

- మళ్లీ మండుతున్న ఎండలు
- గత ఏడాది కంటే తగ్గిన పంటల సాగు
- గత ఖరీఫ్‌లో 4,329 హెక్టార్లు ఈసారి 2,350 హెక్టార్లలో సాగు
- ఆందోళనలో అన్నదాతలు

బల్లికురవ, సెప్టెంబరు 18 : ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పంటలకు బెట్ట దెబ్బ తగిలింది. గత పదిరోజుల కిందట వరకు రోజు ముసురు పట్టి చిరు జల్లులు పడడంతో పంటలు కొంత ఊపిరి పోసుకున్నాయి. మరలా ఇప్పుడు గత నాలుగు రోజుల నుంచి ఎండలు పెరగడంతో పంటలు విలవిలలాడుతున్నాయి. రోజు రోజుకూ వేసిన పంటలు వడ పడి పోతున్నాయి. కొన్ని గ్రామాలలో అయితే రైతులు పంటలపై ఆశలు వదిలేసుకుంటున్నారు. ఈ ఏడాది వర్షపాతం కూడా తక్కువగానే ఉందని అందువలనే సగానికి సగం పంట విస్తీర్ణం తగ్గిందని రైతులు అంటున్నారు. ఖరీఫ్ సీజన్ ఈ మాసాంతానికి ముగుస్తున్న పంటలు సాగు మాత్రం ముందుకు సాగటం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఒకేమారు వర్షాలు పడకపోవడం వలనే ఈ ఏడాది పంటలు సాగు అలస్యం అవుతుందని మరలా వర్షాలు పడితేనే పంటలు సాగుకు రైతులు ముందుకు వస్తారని పలువురు అంటున్నారు.


కొణిదెనలో ఎండలతో ఎండుతున్న మిర్చి మొక్కలు

బల్లికురవ మండలంలోని పలు గ్రామాలలో రైతులు ఖరీఫ్ సీజన్ కింద పత్తి, మిర్చి, పొగాకు, జూటు, కూరగాయలు, వరి పంటలను సాగు చేశారు. గతంలో మాదిరిగా కాకుండా దఫదఫాలుగా కురిసిన వర్షాలతో పంటలను కొందరు రైతులు సాగు చేశారు. గతంలో ఏడాది ఖరీఫ్‌లో రైతులు 4329 హెక్టార్ల పంటలను సాగు చేస్తుంటారు. ఈ ఏడాది ఇప్పటి వరకు రైతులు వర్షాలు లేకపోవటంతో 2350 హెక్టార్లలోనే పంటలను సాగు చేశారు. గత పది రోజుల వరకు పలు ప్రాంతాలలో వర్షాలు బాగా పడడంతో వాగులు వంకలు పొంగాయి. బల్లికురవ మండలంలో మాత్రం వర్షపాతం పంటలకు సరిగా సరిపోలేదని రైతులు అంటున్నారు. గత నాలుగు రోజుల నుంచి మరలా పెరిగిన ఎండలతో సాగు చేసిన పంటలు అన్ని వాడుముఖం పడుతున్నాయని రైతులు వాపోతున్నారు.


నక్కబొక్కలపాడులో వడ పడుతున్న సొర తోట

ఖరీఫ్ సీజన్ ముగుస్తున్న పంటల సాగు మాత్రం పూర్తి కాలేదని సాగర్ నీరు రావడం వలనే కొంత పంటలను కాపాడుకో గలుగుతున్నామని రైతులు తెలిపారు. ఏబీసీ కాలువ కింద రైతులు వరి పంటను సాగు చేసేందుకు సిద్ధం అవుతున్నారు. బోరు బావుల కింద కూడా పంటలు సాగు ముందుకు సాగడం లేదని వర్షాలు తగ్గటం వనే ఈ పరిస్థితి వచ్చిందని రైతులు అంటున్నారు. కొణిదెన, నక్కబొక్కలపాడు, కొప్పెరపాలెం, గంగపాలెం, రాజుపాలెం, ఉప్పుమాగులూరు, సోమవరప్పాడు, కోటవారిపాలెం, వేమవరం, గుంటుపల్లి, కొత్తపాలెం, అంబడిపూడి, వల్లాపల్లి, కొత్తూరు, కూకట్లపల్లి, వెలమవారిపాలెం గ్రామాలలో రైతులు సాగు చేసిన పంటలు బెట్టకు వచ్చాయి అని రైతులు తెలిపారు. వర్షాలు లేకుంటే ఖాళీగా భూములు ఉండే అవకాశం ఉందని రైతులు అంటున్నారు. కొందరు రైతులు సాగర్ నీటిని మెట్ట పంటలకు నీటి తడులు కట్టే పనులలో ఉన్నారు. బెట్టకు వచ్చిన పంటలకు రైతులు యింజన్ల ద్వారా నీటిని పెట్టి పంటను కాపాడుకోనే ప్రయత్నాలు చేస్తున్నారు.

లక్ష తమలపాకుల పూజ


ప్రత్యేక అలంకరణలో ప్రసన్నాంజనేయస్వామి

అద్దంకి, సెప్టెంబరు 18 : శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానంలో పౌర్ణమి సందర్భంగా బుధవారం లక్ష తమలపాకుల పూజ జరిగింది. సుప్రభాతం, గోపూజ, బిందె తీర్థం పూజలు నిర్వహించి అనంతరం స్వామివారికి అభిషేకాలు నిర్వహించారు. వేదపండితులు, అర్చకులు 11 ఆవృత్తములుగా లక్ష తమలపాకుల పూజ నిర్వహించారు. మహా నివేదన, పంచహారతులు నిర్వహించారు. తక్ష తమలపాకుల పూజ అనంతరం స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు.

వర్షపు జల్లులతో ఉపశమనం

అద్దంకి, సెప్టెంబరు 18 : కొద్దిరోజులుగా ఎండ వేడిమి ఎక్కువగా ఉండగా బుధవారం సాయంత్రం కురిసిన వర్షపు జల్లులతో ఉపశమనం కలగింది. బుధవారం సాయంత్రం 6-30 గంటల సమయంలో సుమారు అర గంట పాటు వర్షం పడింది. కొద్ది రోజులుగా తీవ్రమైన ఎండలతో ప్రజలు ఉక్కిరిబిక్కిరయ్యారు. మరోపక్క ఎండ వేడిమికి సాగు చేసిన పంటలు కూడా బెకబెకలాడుతున్నాయి. వర్షపు జల్లులు కొంతమేర ఉపశమనం కలిగించింది.


ఉప్పుమాగులూరులో పత్తిని పరిశీలిస్తున్న ఏడీఏ

పత్తి పంటలో సస్యరక్షణ చేపట్టాలని

బల్లికురవ, సెప్టెంబరు 18 : వాతావరణంలో వచ్చిన మార్పులతో పత్తి పంట బెట్టకు వచ్చి పలు తెగుళ్లు వ్యాప్తి చెందుతున్నాయని, రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని వ్యవసాయ శాఖ మార్టూరు సబ్ డీవిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు కేవీ శ్రీనివాసరావు కోరారు. బుధవారం మండలంలోని వేమవరం, ఉప్పుమాగులూరు గ్రామాలలో రైతులు సాగు చేసిన పత్తి పంటను వ్యవసాయ శాఖ అధికారులు పరిశీలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతు పత్తిలో రసం పీల్చే పురుగులైన పచ్చదోమ, తామర పురుగు పేనుబంక అధికంగా ఉందని రైతులు తక్షణమే వాటి నివారణకు అసిటామీప్రిడ్ 40 గ్రాములు, లేదా థయోమిథోగ్జామ్ 40 గ్రాములు, లేదా ఇమిడాక్లోప్రిడ్ 80 మిల్లీ గ్రాముల ఎకరాకు పిచికారీ చేయాలన్నారు. పంట బెట్ట నివారణకు మల్టీ కే ఎకరానికి 2కిలోల చొప్పున పిచికారీ చేయాలని సూచించారు. అలానే గులాబీ పురుగు నివారణకు రైతులు పంటలో అక్కడక్కడా లింగాకర్షక బుట్టలు వాడాలని తెలిపారు. ఈ పరిశీలనలో బల్లికురవ వ్యవసాయధికారి కుమారి, వీఏఏలు హరికృష్ణ, హనుమనాయక్, రైతులు ఉన్నారు.

బ్లడ్ గ్రూపు పరీక్షలు తప్పని సరి

స్వర్ణ(పర్చూరు), సెప్టెంబరు 18 : ఎన్‌సీసీలో ప్రవేశం పొందే విద్యార్థులు తప్పనిసరిగా బ్లడ్ గ్రూపు పరీక్షలు చేయించుకోవాలని వ్యాయామ ఉపాధ్యాయుడు కె.ప్రసాద్ అన్నారు. కారంచేడు మండలంలోని స్వర్ణ గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లోని ఎన్‌సీసీలో ప్రవేశం పొందే 8, 9 విద్యార్థులకు బుధవారం రక్త పరీక్షలు నిర్వహించారు. ల్యాబ్ టెక్నీషియన్ బయ్య శంకర్ పరీక్షలు చేసి, గ్రూపులను తెలియజేశారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి


మొక్కలు నాటుతున్న డీఎం, అసిస్టెంట్ డీఎం

అద్దంకి, సెప్టెంబరు 18 : పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలని డిపో మేనేజర్ బెల్లం రామ్మోహనరావు అన్నారు. స్వచ్ఛత హి సేవ పక్షోత్సవాల సందర్భంగా రెండవ రోజు గ్యారేజీ ఆవరణలో 25 మొక్కలను నాటారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డీఎం మహబూబి, సిబ్బంది పాల్గొన్నారు.

అడుసుమల్లి(పర్చూరు) : స్వచ్ఛత హి సేవా కార్యక్రమంలో భాగంగా పర్చూరు మండలంలోని అడుసుమల్లి గ్రామంలో బుధవారం పారిశుధ్య కార్యక్రమాలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. గ్రామంలోని వార్డులలో పారిశుధ్య కార్మికులతో కలసి ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పరిశరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రద్యుమ్నకుమార్ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంకొల్లు : ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించాలని పంచాయతీ సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించారు. బుధవారం విద్యార్థులో ర్యాలీ నిర్వహించారు.

ఓజోన్ రక్షణ అందరి బాధ్యత

జాండ్రపేట(చీరాలటౌన్), సెప్టెంబరు 18 : ఓజోన్ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని జిల్లా సైన్స్ కో-ఆర్డినేటర్ పవని భానుచంద్రమూర్తి పేర్కొన్నారు. చీరాల మండల పరిధిలోని జాండ్రపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రపంచ ఓజోన్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా పర్యావరణంపై వ్యాస రచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్స్ అందజేశారు. ప్రధానోపాధ్యాయులు పూర్ణచంద్రరావు మాట్లాడుతూ జీవ వరణానికి రక్షణ కవచమైన ఓజోన్ పొర మానవ స్వయం కృతాపరాధం వలన నాశనమవుతోందని ఆవేదన చెందారు. కార్యక్రమంలో జేవీ నాగలక్ష్మి, శవనం చంద్రారెడ్డి, శాస్త్రవేత్త చెంగలరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

షఫి మాస్టర్‌కు సన్మానం


షఫిని సన్మానిస్తున్న ఎంఈవోలు

పర్చూరు, సెప్టెంబరు 18 : విధి నిర్వహణలో అంకిత భావంతో పనిచేసిన వ్యక్తి ఎస్ఎండీ షఫి మాస్టర్ అని విద్యాశాఖాధికారి పి.వెంకట్రామయ్య అన్నారు. పర్చూరు ఉర్దూ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తూ ఈనెల 30న ఉద్యోగ విరమణ పొందనున్న షఫి మాస్టార్‌ను బుధవారం స్కూల్ కాంప్లెక్స్‌లో ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా పలువురు అధికారులు ప్రజా ప్రతినిధులు ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎంఈవో 1 సత్యనారాయణ, జడ్పీటీసీ మాజీ సభ్యుడు కొల్లా సుభాష్‌బాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వ్యక్తిపై పోక్సో కేసు

ఇంకొల్లు, సెప్టెంబరు 18 : ఇంకొల్లు మండలం ఇడుపులపాడు గ్రామానికి చెందిన చప్పిడి బుల్లి పున్నయ్యపై పోక్సో కేసును నమోదు చేశారు. చిన్నారుల తోపాటు మగ పిల్లలపై కూడా అసభ్యంగా ప్రవర్తిస్తున్నట్లు అందిన ఫిర్యాదుల మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సురేష్ తెలిపారు. మంగళవారం రాత్రి గ్రామానికి చెందిన 14 ఏళ్ల వయస్సు గల బాలుడిని పొలాలవైపు తీసుకెళ్లాడు. భయపడిన ఆ బాలుడు పరుగులు తీసి విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పడంతో అతని తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఇసుకదర్శిలో చోరీ

మార్టూరు, సెప్టెంబరు 18 : ఇంట్లో ఎవరూ లేని సమయాన్ని గుర్తించి చోరీకి పాల్పడ్డాడు ఓ యువకుడు. ఇంట్లో ఉన్న బీరువాను ఎత్తుకుపోయాడు. రూ.25వేల నగదు, కొంత వెండి వస్తువులు, బంగారపు రెండు చెవిచుట్లు, బట్టలు, విలువైన డాక్యుమెంట్లు ఉన్నాయి. అయితే దొంగ మాత్రం రెండు బంగారపు చెవిచుట్లను మాత్రమే దొంగిలించాడు. మిగిలిన వస్తువులు అతనికి కనిపించక, బీరువాను గ్రామ సమీపంలోని నీటి మడుగులో పడేశాడు. 10 రోజుల కిందట మండలంలోని ఇసుకదర్శి గ్రామంలో ఈ దొంగతనం జరిగింది. బాధితుడు నాగయ్య ఇంటి వెనుక ఇంట్లో ఉంటున్న యువకుడే ఈ దొంగతనం చేసినట్లు తెలిసింది. ఎట్టకేలకు దొంగతనం చేసిన యువకుడు ఇచ్చిన సమాచారం మేరకు బీరువాను వెలికితీశారు. బీరువాను తెరిచి చూడగా బంగారపు చెవిచుట్లు మినహా, రూ.25వేల నగదు, వెండివస్తువులు, విలువైన వస్త్రాలు ఉన్నాయి. పాస్‌పుస్తకాలు, డాక్యుమెంట్లు తడిసిపోయాయి. ఈ చోరీపై పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు కాలేదు.

40 మద్యం బాటిళ్ల పట్టివేత

చినగంజాం, సెప్టెంబరు 18 : అక్రమంగా మద్యం బాటిల్స్ తీసుకొని వెళ్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ ఎస్.రమేష్ తెలిపారు. చింతగుంపల్లి గ్రామానికి చెందిన చేగుడి విజయ్‌కుమార్ బుధవారం రాత్రి అనుమతులు లేకుండా మద్యం బాటిళ్లను అక్రమంగా తీసుకొని వెళ్తుండగా సిబ్బందితో దాడి చేసి పట్టుకున్నట్లు తెలిపారు. కొత్తపాలెం గ్రామ పంచాయతీ పరిధిలోని మున్నంవారి పాలెం రైల్వేగేటు దగ్గర ఏర్పాటు చేసిన మద్యం షాపు సమీపంలో విజయ్‌కుమార్‌ని అదుపులోనికి తీసుకొని 40 క్వార్టర్ బాటిల్స్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

30ఏళ్ల అభివృద్ధి ప్రణాళిక సిద్ధం

- ప్రతి ఇంటికీ కొళాయి కనెక్షన్
- టెక్నికల్ శాంక్షన్ కోసం ఎస్టిమేషన్స్ పంపిన మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులు
- మున్సిపాలిటీ వాటా రూ.4.13 కోట్లు చెల్లింపు
- రూ.23.80 కోట్ల నిధులు మంజూరుకు మార్గంసుగమం

చీరాల, సెప్టెంబరు 18 : చీరాల పట్టణ పరిధిలో రానున్న 30ఏళ్లలో ప్రజలకు తాగునీటికి ఇబ్బంది లేకుండా ప్రణాళికబద్ధంగా చర్యలు చేపడుతున్నారు. అందుకోసం మున్సిపల్ వాటాగా రూ.4.13 కోట్ల నిధులు 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి చెల్లించారు. దీంతో భవిష్యత్ ప్రణాళిక ఆచరణకు రూ.23.80 కోట్లు నిధులు మంజూరుకు మార్గం సుగమం అయింది.

చీరాల మున్సిపల్ పరిధిలో 23,500 గృహాలు ఉన్నాయి. సుమారు లక్ష జనాభా. ప్రస్తుతం చీరాల, కారంచేడు రోడ్డులోని ఎస్ఎస్ ట్యాంక్ నుంచి నీటిని శుద్ధి చేసి పురప్రజలకు సరఫరా చేస్తున్నారు. ప్రస్తుతం ట్యాంక్ కెపాసిటీ 10 ఎంఎల్‌టీ (మిలియన్ లీటర్లు). మున్సిపల్ పరిధిలో ఐదు ఓవర్ హెడ్ ట్యాంకులు (రిజర్వాయర్లు) ఉన్నాయి. వీటి ద్వారా ఒక్కో మనిషికి రోజుకు 80 లీటర్ల చొప్పున తాగునీటిని సరఫరా చేస్తున్నారు. వచ్చే 30 ఏళ్ల కాల వ్యవధిని పరిగణలోకి తీసుకుని భవిష్యత్‌లో తలకు రోజుకు 135 లీటర్లు నీటిని సరఫరా చేయాల్సి ఉంటుంది. అందుకు మరో 8ఎంఎల్‌టీల నీటినిల్వ అవసరం ఉంటుంది. వీటికి అనుగుణంగా కార్యాచరణకు ఇంజనీరింగ్ అధికారులు ఎస్టిమేషన్స్‌ను తయారు చేసి టెక్నికల్ శాంక్షన్‌కు పంపారు.


చీరాల ఎస్ఎస్ ట్యాంకులో 19 అడుగుల మేర ఉన్న నీరు

చెల్లించిన మున్సిపల్ వాటా ధనం

ఈ ప్రాజెక్టుకు సంబంధించి మున్సిపల్ వాటా ధనాన్ని ముందస్తుగా చెల్లించాల్సి ఉంది. అందుకు సంబంధించ గత కౌన్సిల్ సమావేశంలో పొందు పరిచిన అంశంపై కౌన్సిల్‌లో సుదీర్ఘ చర్చ జరిగింది. చివరిగా మున్సిపల్ వాటా ధనం చెల్లించే విధంగా ఆమోదించారు. అందుకుగాను 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.2.33 కోట్లు, రూ.1.80 కోట్లు రెండు పద్దులకు గాను మొత్తం రూ.4.13 కోట్లు చెల్లించారు. ఈ క్రమంలో మొత్తం ప్రాజెక్టుకు గాను రూ.23.80 కోట్లు మంజూరుకు గ్రీన్‌సిగ్నల్ పడింది.

ఇంటింటికీ ట్యాపులు

మున్సిపల్ పరిధిలో మొత్తం 23,500 ఇళ్లు ఉంటాయి. అందులో ప్రస్తుతం 10వేల ఇళ్లకు మాత్రమే మంచినీటి కనెక్షన్లు ఉన్నాయి. వ్యాపార సముదాయాలను మినహాయించినా మరో 12వేల ఇళ్లకు కనెక్షన్లు ఇవ్వాల్సి ఉంటుంది. అందుకుగాను సుమారు 15కిలోమీటర్లు మేర పైపులైన్లు వేయాల్సి ఉంటుంది. ఇదిలావుంటే కారంచేడులో కొమ్మమూరు కాలువ వద్ద నున్న పంప్‌హౌస్ నుంచి చీరాల ఎస్ఎస్ (సమ్మర్ స్టోరేజీ) ట్యాంక్ వరకు ఏడు కిలోమీటర్ల దూరం ఉంది. అందులో 6కిలోమీటర్లు మేర రెండున్నర అడుగుల ఒరలతో ఏర్పాటు చేసిన కాలువ నుంచి నీరు వస్తుంది. అదే పద్ధతిలో మరో కిలోమీటరు మేర ఒరలు వేయాల్సి ఉంది. ట్యాంక్ వద్ద మరో ఫిల్టర్ బెడ్ నిర్మించాలి. పట్టణంలో రామ్‌నగర్ ప్రాంతానికి తాగు నీరు సక్రమంగా సరఫరా కావడం లేదు. ప్రస్తుతం ఆ ప్రాంతానికి పేరాల హైస్కూల్ ప్రాంగణంలోని ఓవర్‌హెడ్ ట్యాంక్ నుంచి నీరు వెళుతుంది. ట్యాంక్‌కు రామ్‌నగర్‌కు సుమారు 3 కి.మీ దూరం ఉండడంతో పైపుల్లో పారుదల తక్కువగా ఉంటుంది. దీంతో ఆ ప్రాంతంలో మరో ఓవర్ హెడ్ ట్యాంక్‌ను నిర్మిస్తారు. ఇవన్నీ నూతన ప్రాజెక్టులో రూపుదిద్దుకుంటాయి.


కారంచేడు గేటు సెంటర్లో ఓవర్‌హెడ్ ట్యాంక్

టెక్నికల్ శాంక్షన్ వచ్చిన తరువాత పనులు ప్రారంభిస్తాం

ప్రస్తుతం నూతన ప్రాజెక్టుకు సంబంధించి మున్సిపల్ వాటా ధనం రెండు పద్దులకు గాను రూ.4.13 కోట్లు 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి చెల్లించడం జరిగింది. ప్రాజెక్టుకు సంబంధించి ఎస్టిమేషన్స్‌ను పంపించాం. టెక్నికల్ శాంక్షన్ రావల్సి ఉంది. అది వచ్చిన తరువాత త దుపరి పనులు చేపడతాం.

\- ఏసయ్య, డీఈ, చీరాల మున్సిపాలిటీ


గోశాలకు వరిగడ్డిని అందజేస్తున్న రోటరీ సభ్యులు

గోశాలకు పశు గ్రాసం అందజేత

అద్దంకిటౌన్, సెప్టెంబరు 18 : రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో గోశాలకు పశు గ్రాసాన్ని అందజేశారు. బుధవారం అద్దంకి పట్టణంలోని హరిహర గోశాలకు రోటరీ మిత్రుల సౌజన్యంతో రూ.20వేలతో పశుగ్రాసం (వరిగడ్డి)ని అందజేశారు. పశువుల పెంపకం అనేది జీవన విధానంలో భాగమని, ప్రత్యేకంగా ఆవుకి ఎంతో ప్రాముఖ్యత ఉందని, ఆవుల సంపదని మనం కాపాడుకోవాల్సిన అవసరం ఉందని గాడేపల్లి దివాకర్‌దత్తు అన్నా రు. రోటరీ మిత్రుల సహకారంతో ట్రాక్టర్ వరిగడ్డిని గోశాలకు అందించినట్లు క్లబ్ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి చుండూరి మురళీ సుధాకరరావు, ట్రెజరర్ మలాది శ్రీనివాసరావు, మాజీ అధ్యక్షు డు సందిరెడ్డి శ్రీనివాసరావు, సుబ్రహ్మణ్యం, గుళ్లపల్లి సుబ్రహ్మణ్యం శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

హాజరు బాధ్యత ఉపాధ్యాయులదే

అద్దంకిటౌన్, సెప్టెంబరు 18 : రిజిస్టర్‌లోని విద్యార్థులందరూ పాఠశాలకు హాజరయ్యే బాధ్యత ఉపాధ్యాయులదేనని ఎంఈవోలు డి.గంగాధరరావు, బి. సుధాకరరావు తెలిపారు. బుధవారం అద్దంకిలోని శ్రీ ప్రకాశం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో స్కూల్ కాంప్లెక్స్ సమావేశం హెచ్ఎం శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎంఈవోలు మాట్లాడుతు అన్ని పాఠశాలలో 10 గంటలలోపు విద్యార్థుల హాజరు తప్పక తమోదు చేయాలని, అధికారులు తనిఖీకి వచ్చినప్పుడు వివరాలు తెలిపే విధంగా ప్రొఫైల్‌ను చూపించాలన్నారు. గత సంవత్సరం చదివిన ఏ విద్యార్థి కూడా డ్రాపౌట్‌గా మిగలకూడదని, తరగతి గదిలో టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్‌ను ప్రదర్శించి, వారాంతపు పరీక్షలు నిర్వహించాలన్నారు. ఉపాధ్యాయులందరూ స్కూల్ ఎడ్యుకేషన్ వెబ్‌సైట్‌లోని టీచర్ రి సోర్స్ బుక్‌ను ఉపయోగించుకుని విద్యార్థుల ప్రమాణాలను పెంచాలన్నారు. మధ్యాహ్నం భోజన వివరాలను ఎప్పటికప్పుడు అప్‌డేట్‌గా ఉండాలన్నారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ సెక్రటరీ శ్యామల, రిసోర్స్ పర్సన్‌లు ధనలక్ష్మి, పుణ్యవతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

23లోగా ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలి

పంగులూరు, సెప్టెంబరు 18 : ఖరీఫ్ పంట సాగు వివరాలు ఈ నెల 23వ తేదీ లోగా ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలని వ్యవసాయాధికారి డి.సుబ్బారెడ్డి తెలిపారు. బుధవారం తూర్పు కొప్పెరపాడు గ్రామంలో సాగులో ఉన్న పంటల ఈ క్రాప్ నమోదు కార్యక్రమాన్ని ఏవో పరిశీలించారు. ప్రభుత్వ రాయితీలు రైతుకు అందాలంటే ఈ-క్రాప్ నమోదు తప్పనిసరిగా చేయాలన్నారు. ఈ నెల 25 నుంచి 27 వరకు ఖరీఫ్ పంటసాగు నమోదు వివరాలు రైతు సేవా కేంద్రాలలో డిస్‌ప్లే చేయడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మార్టూరు : పంట నమోదుకు ఈ నెల 23వ తేదీతో గడువు ముగుస్తుందని వ్యవసాయ అధికారి వీరగంధం కిరణ్‌కుమార్ తెలిపారు. బుధవారం మండలంలోని నాగరాజుపల్లి, ద్రోణాదుల గ్రామాలలో పంట నమోదును ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో 4700 ఎకరాలను సాగుచేయగా, వాటిలో 4610 ఎకరాల పంట నమోదు పూర్తయ్యిందన్నారు. మిగిలినవారు వెంటనే నమోదు చేయించుకోవాలని సూచించారు.

23 నుంచి 25 వరకు ఆటల పోటీలు

మార్టూరు, సెప్టెంబరు 18 : పర్చూరు నియోజకవర్గంలోని 6 మండలాల జడ్పీ హైస్కూల్లో ఈ నెల 23 నుంచి 25 వతేదీ వరకు మండల స్థాయిలో ఆటల పోటీలను నిర్వహించనున్నట్లు నియోజకవర్గ క్రీడా సమన్వయకర్త పీ.కోటేశ్వరరావు బుధవారం ప్రకటనలో తెలిపారు. మండల స్థాయిలో జరగనున్న ఈ ఆటల పోటీలలో అండర్14, అండర్ 17 బాల బాలికలకు ఆటలపోటీలు జరుగుతాయన్నారు. వాటిలో పాల్గొనే విద్యార్థులకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, చెస్, యోగా, షటిల్ బ్యాడ్మింటన్, అథ్లెటిక్స్‌లలో పోటీలు జరుగుతాయన్నారు. అనంతరం ఈ పోటీలలో విజేతలైన బాల బాలికలకు ఈ నెల 26 నుంచి 28వ తేదీ వరకు నియోజకవర్గ స్థాయిలో ఇంకొల్లు జడ్పీ హైస్కూల్‌లో పోటీలు జరుగుతాయన్నారు. అందువలన ఆయా మండలాల్లో క్రీడలలో పాల్గొనే క్రీడాకారులకు సంబంధించిన స్కూల్ వ్యాయామ ఉపాధ్యాయులు మండల కేంద్రంలోని వ్యాయామ ఉపాధ్యాయులకు సమాచారాన్ని అందించాలని కోటేశ్వరరావు కోరారు.

వైఏ కళాశాలకు పతకాలు

చీరాలటౌన్, సెప్టెంబరు 18 : రాష్ట్ర స్థాయి రెడ్ రన్ (మారథాన్) 5కేఎం పోటీలలో చీరాల వైఏ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థినులు పతకాలు సాధించారు. ఇంటర్ సెకండియర్ విద్యార్థిని వి.చెన్ననీలకు రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానం, రమ్యజాయ్‌కు తృతీయ స్థానంలో నిలిచి నగదు పురస్కారాన్ని అందుకున్నారు. ఏపీ వైద్యారోగ్య శాఖ, ఎయిడ్స్ నియంత్రణ సంస్థ యువతలో మార్పు కోసం విజయవాడలో మంగళవారం ఈ కార్యక్రమం నిర్వహించారు. కళాశాల సిబ్బందితో పాటు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు విద్యార్థినులను అభినందించారు.


చెక్కును అందుకుంటున్న చెన్ననీల, రమ్యజాయ్


బాలామృతం పంపిణీ చేస్తున్న జిల్లా అధికారి ఉమ

అవగాహనతోనే సంపూర్ణ ఆరోగ్యం

జిల్లా అధికారి ఉమ

చీరాలటౌన్, సెప్టెంబరు 18 : గర్భిణులు, బాలింతలు ఆరోగ్య విషయాల్లో జాగ్రత్తలు పాటించాలని అప్పుడే ఆరోగ్యంగా ఉంటారని జిల్లా మహిళ, శిశు సంక్షేమ, సాధికారత అధికారి ఉమ అన్నారు. బుధవారం పురపాలక పరిధిలోని సెక్టార్‌సీ పరిధిలోని అంగన్వాడీ కేంద్రంలో పౌష్టికాహార మాసోత్సవాలను నిర్వహించారు. పౌష్టికాహారంపై ఆమె అవగాహన కల్పించారు. అనంతరం సీమంతం, అన్నప్రాసన నిర్వహించారు. బాలామృతం పంపిణీ చేశారు. ఏసీడీపీవో సుచిత్ర, సూపర్‌వైజర్ కుముద్వతి, హెచ్‌వి వసంతవల్లి, కార్యకర్తలు పాల్గొన్నారు.

నాణ్యమైన బోధన అందించాలి

యద్దనపూడి, (మార్టూరు) సెప్టెంబరు 18 : వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టిసారించి నాణ్యమైన బోధన అందించాలని ఎంఈవో పుల్లెల సుబ్రమణ్యేశ్వరరావు అన్నారు. బుధవారం యద్దనపూడి జడ్పీ హైస్కూల్‌లో ప్రాథమిక పాఠశాల సముదాయ సమావేశాలను ఆయన పరిశీలించారు. స్కూళ్లలో విద్యార్థులకు అందిస్తున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంలో ఎటువంటి లోటుపాట్లు ఉండకూడదన్నారు. నాణ్యత విషయంలో ఎటువంటి రాజీ వద్దని, మిగులు ఉన్న ఉపాధ్యాయులను కొరత ఉన్న పాఠశాలలకు సర్దుబాటు చేశామన్నారు. విద్యార్థుల హాజరు, పరీక్షపత్రాల తయారీపై దృష్టి సారించాలని అన్నారు. సమావేశంలో రిసోర్స్ పర్సన్స్ పి.రవికుమార్, మార్క్, వీరాంజనేయులు, శారద, సీఆర్‌పి మస్తానవలి పాల్గొన్నారు.


డిపో ముఖద్వారం వద్ద అడ్డదిడ్డంగా ఉన్న వాహనాలు

ఆర్టీసీ డిపోలోకి వెళ్లాలంటే తిప్పలే

చీరాల, సెప్టెంబరు 18 : ఆర్టీసీ డిపో ప్రధాన ముఖ ద్వారం నుంచి లోపలకు వెళ్లాలంటే ప్రయాణికులకు తిప్పలు తప్పడం లేదు. డిపో ముఖ ద్వారం వద్ద ద్విచక్ర వాహనాలను అడ్డదిడ్డంగా పార్క్ చేయడం అందుకు కారణం. ప్రధాన ద్వారానికి ఒక వైపు ఉన్న టీ దుకాణానికి వచ్చేవారు వారి వాహనాలను ఎక్కడ పడితే అక్కడ ఉంచుతున్నారు. కొందరు అక్కడే వాహనాలను నిలిపి కబుర్లు చెప్పుకుంటూ కాలక్షేపం చేస్తున్నారు. ఈ క్రమంలో బస్సు డిపోలోకి వెళ్లాలంటే ప్రయాణికులు ముఖ్యంగా మహిళలు తీవ్ర ఇబ్బందులుపడుతున్నారు. డిపోలోకి వెళ్లాలంటే పద్మవ్యూహాన్ని ఛేదించినట్లు ఉందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం పదుల సంఖ్యలో అక్కడ వాహనాలు అడ్డదిడ్డంగా ఉంటాయి. మధ్య ముఖద్వారం ఎదురుగా ఆటో డ్రైవర్లు ఆటోలను నిలుపుతున్నారు. ఈ కారణంగా డిపోలోకి వెళ్లాలంటే ఎవరైనా ఇబ్బంది పడాల్సిందే. నిత్యం జరిగే ఈ తంతు డిపో అధికారులకు కనిపించడం లేదా అని ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు. వెంటనే డిపో మేనేజర్ తగిన చర్యలు తీసుకుని ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా చూడాలని కోరుతున్నారు.

రైతు మృతిపై కేసు

బల్లికురవ, సెప్టెంబరు 18 : మండలంలోని గుంటుపల్లికి చెందిన రైతు చల్లగుండ్ల నాగేశ్వరరావు (58) పాము కాటుతో మృతి చెందిన సంఘటనపై బుధవారం కేసు నమోదు చేసిన్నట్లు ఎస్‌ఐ జీవీ చౌదరి తెలిపారు.



● చెరువులో మట్టి లేఅవుట్లకు...

నెల్లూరు రూరల్ మండలం నెల్లూరు చెరువు, కలివెలపాలెం చెరువుల్లో అక్రమార్కులు భారీగా గుంతలు తవ్వుతూ ఆ మట్టిని లేఅవుట్లకు అమ్ముకుంటున్నారు. నెల్లూరు చెరువు నుంచి పొట్టేపాలెంకు చెందిన ఓ టీడీపీ నేత, కలివేలపాలెం చెరువు నుంచి రియల్ ఎస్టేట్ వ్యాపారులు మట్టి తవ్వకాలు చేస్తున్నారు. వీటిపై ఆంధ్రజ్యోతిలో కథనాలు రావడంతో కలెక్టర్ సీరియస్ అయ్యారు. చెరువుల్లో మట్టి ఎత్తితే సస్పెండ్ చేస్తానని ఇరిగేషన్ అధికారులను హెచ్చరించారు. దీంతో మరోమారు అధికారులు అనుమతులు ఇవ్వలేదు. ఈ క్రమంలో ఇప్పుడు రాత్రివేళల్లో ఈ చెరువుల మట్టిని కొల్లగొడుతున్నారు. ఇక పెన్నానది నుంచి రాత్రిళ్లు దొంగచాటుగా ట్రాక్టర్లతో ఇసుకను తవ్వుకెళుతున్నారు. పొట్టేపాలెం, కోడూరుపాడు, పెన్నా బ్రిడ్జి దిగువ ప్రాంతాల్లో కూడా రాత్రివేళల్లో తవ్వకాలు జరుగుతున్నాయి.

పొట్టేపాలెం చెరువులో గ్రావెల్ తవ్వగా ఏర్పడిన గుంతలు

వెంటాడుతున్న పాపం

- గత ప్రభుత్వంలో విచ్చలవిడిగా ఇసుక, గ్రావెల్, మట్టి అక్రమ రవాణా
- బావులుగా మారిన వాగులు, వంకలు
- రూపు కోల్పోయిన చెరువులు
- అధికారమే అండగా దోపిడీ

నాటి నిర్వాకమే నేటి కొరతకు కారణం

నెల్లూరు, సెప్టెంబరు18 (ఆంధ్రజ్యోతి)

వైసీపీ ప్రభుత్వం చేసిన పాపం ప్రజలను ఇంకా వెంటాడుతూనే ఉంది. ఊరిపక్కన ఏట్లో ఉచితంగా దొరికే ఇసుకను గంపగుత్తగా అస్మదీయ కాంట్రాక్టర్లకు అప్పగించడంతో వాగులు బావులుగా మారా యి. అడ్డూఆపూ లేక ఇసుక రీచ్‌ల్లో తవ్వేయడంతో పర్యావరణానికి పెనుముప్పు ఏర్పడింది. దీంతో సర్వోన్నత న్యాయస్థానం ఇసుక తవ్వకా లపై ఆంక్షలు విధించింది. పర్యావరణశాఖ అనుమతి లేనిదే ఇసుక తవ్వకానికి వీలులేదని ఆదేశాలు జారీ చేసింది. న్యాయస్థానాల ఆక్షేపణ లు ఓ వైపు, విపరీతంగా తవ్వేసిన కారణంగా పర్యావరణశాఖ అనుమతి లభించక మరోవైపు... ఈ రెండు కారణాలు ఇసుక సంక్షోభాన్ని సృష్టించా యి. ఈ పరిస్థితులు ప్రజలకు ఉచితంగా ఇసుక ఇవ్వాలని నిర్ణయిం చుకున్న కూటమి ప్రభుత్వాన్ని నిస్సహాయ స్థితికి నెట్టేశాయి. అయినా సరే కూటమి ప్రభుత్వం ప్రజల అవసరాలను ఎంతోకొంత తీర్చాలన్న ఉద్దేశంతో నెల్లూరు, సంగం బ్యారేజీల్లో డీసిల్టేషన్ పేరుతో డ్రెడ్జింగ్ పద్ధతి ద్వారా ఇసుకను వెలికితీస్తున్నది. ఈనెల 19 (నేటి) నుంచి ఇసుక ను ప్రజలకు అందుబాటులోకి తెచ్చేలా చర్యలు తీసుకుంటోంది. ఇదంతా నాణేనికి ఒక వైపే...! మరో వైపు... ఇసుక కొరతను ఆదాయ మార్గంగా ఎంచుకొన్న కొన్ని రాజకీయ శక్తులు అక్రమ రవాణాకు తెరలేపాయి. అధికార బలాన్ని అడ్డుపెట్టుకొని కొందరు, ప్రతిపక్ష నేతలతో కలిసి కొన్నిచోట్ల రాత్రి సమయాల్లో ఇష్టారాజ్యంగా ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారు. భారీగా రేట్లు పెంచి ప్రజల రక్తం పిండుకుంటున్నారు. గతంలో ట్రాక్టర్ ఇసుక రూ. 2,500లకు దొరికేది. అక్రమార్కులు ఇప్పుడు రూ.9వేలకు విక్రయిస్తున్నారు. గతంలో టిప్పర్ ఇసుక రూ. 17వేలు. కానీ ఇప్పుడు బ్లాక్ మార్కెట్‌లో టిప్పర్ ఇసుక రూ. 45వేలకు అమ్ముతున్నారు. ఇలా ఇసుక విక్రయాల ద్వారా ప్రతిరోజు లక్షలకు లక్షలు పోగు చేసుకొంటున్నారు. అక్కడా.. ఇక్కడా.... అని కాదు..జిల్లా వ్యాప్తంగా ఇదేతరహా దోపిడీ సాగుతోంది. ఈ వ్యవహారంలో అధికార పార్టీనేతలకు కొంతమంది అధికారులు వంతపాడటం విశేషం.



ఉదయగిరి రూరల్ : దుత్తలూరు మండలం నందిపాడు సమీపంలోని వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్

అల్లూరు, కొండాపురం మండలాల్లో దోపిడీ

కావలి : ప్రాంతంలో ఇసుక రీచ్‌లు లేకపోవటంతో నిర్మాణాల కోసం స్థానికంగా ఉన్న వాగులు, వంకల నుంచి ఇసుకను తరలిస్తున్నారు. అల్లూరు, కొండాపురం మండలాల్లో మాత్రమే కొంతమంది రాజకీయ నాయకులకు ఇసుక రవాణాతో సంబంధాలు ఉన్నాయి. కావలికి కందుకూరు నియోజకవర్గ పరిధిలోని మన్నేరు, ఉప్పుటేరు వాగుల నుంచి ఇసుకను తరలిస్తున్నారు. అయితే అక్కడ పోలీసులు దాడులు చేస్తుండటంతో రవాణా కష్టతరంగా మారింది. కాగా అల్లూరు, కొండాపురం మండలాల్లో టీడీపీ, వైసీపీ నాయకులు ఇసుకను అక్రమంగా వాగుల నుంచి తీసుకువచ్చి అమ్ముతుండగా వారికి పోలీసులు సహకరిస్తున్నారు. ఇకపోతే బోగోలు, జలదంకి , కలిగిరి మండలాల్లో ఎక్కడా పెద్దగా వాగులు లేక పోవటంతో ఇసుక అక్రమ రవాణా జరగడం లేదు. ఒక్క బోగోలు మండలంలో వేస్తున్న లేఅవుట్‌కు మాత్రం స్థానిక టీడీపీ నాయకుడి సహకారంతో గ్రావెల్‌ను తరలిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.



కావలి : పెదపవని రోడ్డులో వస్తున్న ఇసుక ట్రాక్టర్

కందుకూరులో జోరుగా అక్రమ రవాణా

కందుకూరు : నియోజకవర్గంలో ఇసుక, గ్రావెల్ అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. రవాణాదారులు మారారే తప్ప వ్యవహారం మారలేదు. సెబ్ రద్దవుతుండటంతో మాకు పట్టదన్నట్లుగా సెబ్ అధికారులు వ్యవహరిస్తున్నారు. పోలీసులు అస్మదీయులకు రైట్‌రైట్ అంటూ సామాన్యులను పట్టుకుని కేసులు నమోదు చేస్తున్నారు. వివిధ మండలాల్లోని అధికార పార్టీ నేతల అండతో ఐదారు ట్రాక్టర్లతో రేయింబవళ్లు ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారు. టీడీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక కొద్దిరోజులు సామాన్యులకు ట్రాక్టరు ఇసుక రూ. 2 వేలకే లభించగా, ప్రస్తుతం ఇసుకాసురులు సిండికేట్ ఏర్పడటంతో ట్రక్కు ధర రూ. 3,500కి చేరింది. మొగిలిచర్ల, వీఆర్‌కోట, అన్నెబోయినపల్లి, దప్పళంపాడు, మాచవరం, భీమవరం, మన్నేటికోట తదితర ప్రాంతాల నుంచి జోరుగా ఇసుక అక్రమ రవాణా జరుగుతోంది. అలాగే పాలేరులో విక్కిరాలపేట, పలుకూరు తదితర ప్రాంతాల నుంచి కూడా అక్రమ రవాణా సాగుతోంది. మరోవైపు మట్టి మాఫియా కూడా ప్రభుత్వ భూములు, చెరువులు, దేవదాయ శాఖ భూముల్లో మట్టి తవ్వకాలు చేస్తున్నారు. ఉన్నతాధికారుల నుంచి ఒత్తిడి వస్తే కిందిస్థాయి సిబ్బందిని బలిచేసి చేతులు దులుపుకోవడం తప్ప జిల్లా అధికారులు ఏమీచేయపోతున్నారు.



ఉలవపాడు సమీపంలో జాతీయ రహదారి పక్కన మట్టి మాఫియా డంప్ చేసిన గ్రావెల్

నేతలకు ఎమ్మెల్యే కాకర్ల హెచ్చరికలు ?

ఉదయగిరి రూరల్ : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొంతమంది వైసీపీ నేతలు అధికార పార్టీ నాయకులతో చేతులు కలిపి మట్టి, ఇసుక, గ్రావెల్‌ను దోచుకుంటున్నారు. రెండు నెలల క్రితం దుత్తలూరు సమీపంలో ఓ వైసీపీ నాయకుడు అక్రమంగా గ్రావెల్ తరలిస్తుండగా, పోలీసులు వాహనాలను సీజ్ చేశారు. అనంతరం అధికార పార్టీ నాయకుల సిఫార్సుతో వదిలేశారు. అలాగే నందిపాడులో అధికార పార్టీకి చెందిన నాయకుడు మట్టి, ఇసుక తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నాడనే ఆరోపణలు ఉన్నాయి. వరికుంటపాడు మండలం కనియంపాడు, తూర్పుబోయమడగల, గణేశ్వరాపురం, తూర్పుచెన్నంపల్లి గ్రామాల సమీపంలో ఉన్న వాగుల నుంచి యథేచ్ఛగా పల్లెలకు ఇసుక తరలిస్తున్నారు. ఉదయగిరి మండలం అప్పసముద్రం, తిరుమలాపురం, అన్నంపల్లి ప్రాంతాల నుంచి కూడా ఇసుక తరలిస్తున్నారు. ఇటీవల చోటుచేసుకొన్న కొన్ని పరిణామాల దృష్ట్యా మట్టి, ఇసుక అక్రమ తరలింపుపై ఎమ్మెల్యే కాకర్ల సురేష్ సైతం నాయకులను తీవ్రస్థాయిలో హెచ్చరించారని సమాచారం.

నేటి నుంచి ఇసుక విక్రయాలు

జిల్లాలోని డీసిల్టేషన్ పాయింట్ల వద్ద ఏర్పాటు చేసిన స్టాక్ యార్డుల్లో గురువారం నుంచి ఇసుక విక్రయాలు ప్రారంభం కానున్నాయి. సీఎం చంద్రబాబు రాష్ట్ర స్థాయిలో ఈ పాలసీను ప్రారంభించనున్నారు. ఆ తరువాత నుంచి ఇసుక బుకింగ్‌లు మొదలుకానున్నాయి. రీచ్‌లలో ఇసుక తవ్వకాలకు పర్యావరణ అనుమతులు లేకపోవడంతో ఇసుక కొరతను తీర్చేందుకు ప్రభుత్వం డీసిల్టేషన్‌ను మొదలుపెట్టింది. సంగం బ్యారేజీ ఎగువున సంగం, సూరాయపాలెం వద్ద, నెల్లూరు బ్యారేజీ ఎగువున పోతిరెడ్డిపాలెం వద్ద డీసిల్టేషన్ జరుగుతోంది. అక్కడి నుంచి బోట్ల ద్వారా ఇసుకను సమీపంలో ఏర్పాటు చేసిన యార్డులకు తరలిస్తున్నారు. గడిచిన రెండు వారాలుగా ఈ మూడు పాయింట్ల వద్ద డీసిల్టేషన్ జరుగుతుండగా ఇప్పటి వరకూ 23 వేల టన్నుల ఇసుకను వెలికితీశారు. ప్రస్తుతం రోజుకు 1500 మెట్రిక్ టన్నుల ఇసుకను తెస్తున్నారు. ప్రభుత్వానికి ఎటువంటి ఆదాయం లేకుండా కేవలం తవ్వకాల చార్జీలు, రవాణా చార్జీలు, సీనరైజ్ చార్జీలు, మెయింటెనెన్స్ చార్జీలను మాత్రమే వసూలు చేయనున్నారు. వీటన్నింటిని కలుపుకొని టన్ను ఇసుక ధర రూ.380గా జిల్లా స్థాయి కమిటీ నిర్ణయించింది. అంతకుమించి వసూలు చేయడానికి వీల్లేకుండా పటిష్టమైన చర్యలు తీసుకుంటోంది. మైనింగ్ శాఖ వద్ద ఎంపానెల్ అయిన వాహనాలు మాత్రమే ఇసుక రవాణా చేసేందుకు అవకాశం కల్పించారు. కాగా ఇసుకను ప్రభుత్వ పనిదినాల్లో ఏపీ శాండ్ పోర్టల్ ద్వారా బుక్ చేసుకోవాల్సి ఉంటుంది. సచివాలయాల ద్వారా కూడా బుక్ చేసుకునే సదుపాయం కల్పించారు. అయితే పేమెంట్లు మాత్రం అంతా ఆన్‌లైన్ ద్వారానే చేయాల్సి ఉంటుంది. బుక్ చేసుకున్న మరుసటి రోజున ఇసుకను తీసుకెళ్లవచ్చు. ఒకవేళ వినియోగదారునికి వాహనం లేకపోతే ప్రభుత్వమే నేరుగా డోర్ డెలివరీ చేస్తుంది.

భద్రతపై భరోసా

- సోమశిలలో అత్యవసర పనులకు నిధులు
- గేట్లు, రోప్‌ల మరమ్మతులకు రూ.2.42 కోట్లు మంజూరు

నెల్లూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయంపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. ప్రాజెక్టు వద్ద అత్యవసర పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించింది. ఇందుకు సంబంధించి రూ.2.42 కోట్లను విడుదల చేస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. కొత్త రోప్‌ల ఏర్పాటుతోపాటు లీకేజీ గేట్లకు మరమ్మతులు చేసేందుకుగానూ ఈ నిధులు విడుదల చేస్తున్నట్లు ఆ ఉత్తర్వుల్లో పేర్కొంది. అలానే ఈ నిధులతో ఉపయోగంలేని రివర్స్ స్లూయిజ్‌ను కూడా మూసివేయనున్నారు.

2019, 2020, 2021 సంవత్సరాల్లో వచ్చిన భారీ వరదలకు సోమశిల ప్రమాదంలో పడింది. రోప్స్, గేట్ల నిర్వహణ సరిగా లేకపోవడం చాలా ఇబ్బందిగా మారింది. అత్యవసర సమయంలో ఇవి మొరాయించాయి. 11వ నెంబరు గేటు అయితే అసలు లేవలేదు. కనీసం గ్రీజు కూడా పూసే దిక్కు లేకపోవడంతో రోప్‌లు బాగా దెబ్బతిన్నాయి. వాటన్నింటినీ మార్చి వాటి స్థానంలో కొత్త రోప్‌లను ఏర్పాటు చేయాల్సి ఉంది. అదే సమయంలో గేట్లకు సంబంధించి నిర్వహణ లేకపోవడంతో లీకేజీ అవుతున్నాయి. ఈ నిర్వహణ పనులు అత్యవసరంగా చేపట్టాల్సి ఉంది. మళ్లీ భారీ వరద వస్తే జలాశయం మనుగడ ప్రమాదంలో పడుతుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సాగునీటి ప్రాజెక్టులకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ వస్తోంది. ఈ క్రమంలో సీఎం చంద్రబాబు తొలి ప్రాజెక్టు సందర్శన కూడా సోమశిలనే కావడం విశేషం. గత నెలలో సోమశిల జలాశయాన్ని ఆయన సందర్శించి అక్కడి పరిస్థితులను సమీక్షించారు. అప్రాన్ పనులు పూర్తి చేయడంతోపాటు రోప్‌లు, గేట్ల నిర్వహణ అత్యవసరంగా చేయాలని అధికారులు సూచించారు. దీంతో వెంటనే ఈ పనులు చేపడతామని సీఎం ప్రకటించారు. ఈ క్రమంలో ఇరిగేషన్ అధికారులు అత్యవసర పనులకు అవసరమైన ప్రతిపాదనలను రాష్ట్ర ప్రభుత్వానికి పంపారు. ప్రభుత్వం వీటికి అనుమతులిస్తూ రూ.2.42 కోట్లు మంజూరు చేసింది. ఈ సందర్భంగా సోమశిల ఎస్ఈ రమణారెడ్డి 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ సోమశిలలో అత్యవసరమైన రోప్‌లు, గేట్ల మరమ్మతుల పనులను వెంటనే చేపడతామని చెప్పారు.



జలాశయం వద్ద క్రేన్‌ల సహాయంతో పనులు చేస్తున్న అధికారులు

స్లూయిస్‌లో లీకేజీల కట్టడికి చర్యలు

అనంతసాగరం : సోమశిల వద్ద స్లూయిస్‌లో కొనసాగుతున్న లీకేజీల కట్టడిపై అధికారులు చర్యలు చేపట్టారు. లీకేజీ నీరుతో అప్రాన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులకు ఆటంకం కలుగుతోంది. ప్రొటెక్షన్ వాల్ పనులు పూర్తి చేయాలంటే లీకేజీలు అరికట్టక తప్పనిసరి. దీంతో ఆ దిశగా అధికారులు దృష్టిసారించి, విశాఖ నుంచి నిపుణుల బృందాన్ని పిలిపించి రెండురోజులుగా పనులు చేపడుతున్నారు. 95 శాతం లీకేజీలను అరికట్టడంతో ఇక ప్రొటెక్షన్ వాల్ పనులకు అడ్డంకి తొలగింది. ఈ క్రమంలో అప్రాన్ పనులు వేగంగా సాగనున్నాయి.

సీఆర్‌సీ సేవలను సద్వినియోగం చేసుకోండి

● కలెక్టర్ ఆనంద్

వెంకటాచలం, సెప్టెంబరు 18: దివ్యాంగుల నైపుణ్యాభివృద్ధి, పునరావాస కల్పన, సాధికారత సమ్మిళిత ప్రాంతీయ కేంద్రాన్ని (సీఆర్‌సీ) దివ్యాంగులు సద్వినియోగం చేసుకుని మానసికంగా దృఢంగా తయారు కావాలని కలెక్టర్ ఆనంద్ పిలుపునిచ్చారు. చవటపాళెం పంచాయతీ అనుపల్లిపాడు సమీపంలోని సీఆర్‌సీ కేంద్రాన్ని ఆయన బుధవారం సందర్శించారు. దివ్యాంగులు తమ నైపుణ్యాలతో తయారు చేసిన వివిధ వస్తువులను పరిశీలించారు. ఒకేషనల్ ట్రైనింగ్ సెంటర్, డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సు శిక్షణ, టైలరింగ్ మొదలైన వృత్తి నైపుణ్యాల వివరాలను తెలుసుకున్నారు. నైపుణ్యాలను అభివృద్ధి చేసుకునే అవకాశం ఉన్న ఈ కేంద్రాన్ని దివ్యాంగులందరూ సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. జిల్లాలో దివ్యాంగుల పింఛన్ పొందుతున్న వారిని గుర్తించడం, మండలాలవారీగా అవగాహన సదస్సులు నిర్వహించి దివ్యాంగులను ఎంపిక చేసి ఈ కేంద్రంలో వారికి వివిధ వృత్తి నైపుణ్య కోర్సులను నేర్పించేందుకు ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఈ కేంద్రానికి బస్సు సౌకర్యం ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ శ్రీనివాసులు, దివ్యాంగుల సంక్షేమ శాఖ ఏడీ వినయ్‌కుమార్, సీఆర్‌సీ ఇన్‌చార్జి డైరెక్టర్ రామాంజులు, శిక్షకులు దేవీప్రియ, శ్రీనివాసులు, మల్లికార్జున్, రమేష్, కృష్ణ ఉన్నారు.

జిల్లా రిజిస్ట్రార్ బదిలీ

ఒంగోలుకు బాలాంజనేయులు



నెల్లూరు(హరనాథపురం)8: స్టాంపులు-రిజిస్ట్రేషన్ల శాఖ జిల్లా రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న ఏ బాలాంజనేయులు ను ఒంగోలు రిజిస్ట్రార్‌గా బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పీ సిసోడియా బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన స్థానంలో ఇంకా ఎవరినీ నియమించలేదు. అలాగే నెల్లూరులో మార్కెట్ వ్యాల్యూ ఆడిట్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న సీఆర్ హరివర్మను అన్నమయ్యజిల్లా రాయచోటి రిజిస్ట్రార్‌గా నియమించారు. ఆయన స్థానంలో జిల్లా మార్కెట్ వాల్యూ, ఆడిట్ రిజిస్ట్రార్‌గా విజయనగరం జిల్లా రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న ఏపీ కుమారిని నియమించారు.

మాజీ మంత్రి అనీల్ పీఏ సస్పెన్షన్

నెల్లూరు(వ్యవసాయం), సెప్టెంబరు 18 : మాజీ మంత్రి, పీ అనీల్‌కుమార్‌యాదవ్ పీఏ(పర్సనల్ అసిస్టెంట్)గా పనిచేసిన నెల్లూరు మార్కెట్ అసిస్టెంట్ సూపర్‌వైజర్ షేక్ అప్సర్‌ను సస్పెండ్ చేస్తూ విజయవాడ మార్కెటింగ్‌శాఖ జేడీ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. అప్సర్ నెల్లూరు ఏసీ కూరగాయల మార్కెట్ అసిస్టెంట్ సూపర్‌వైజర్‌గా పనిచేసేవాడు. అయితే వైసీపీ ప్రభుత్వ హయాంలో నెల్లూరు నగర ఎమ్మెల్యే అనీల్ పీఏగా ఆయన్ను నియమించుకున్నారు. అయితే గత ఎన్నికలప్పుడు కోడ్ అమలులో ఉండగా ఆయన మార్కెటింగ్‌శాఖలో విధులకు హాజరు కాలేదు. పైగా అనారోగ్య కారణంతో సెలవు పెట్టారు. అదే సమయంలో నరసరావుపేట వైసీపీ ఎంపీ అభ్యర్థిగా బరిలో ఉన్న అనీల్‌కుమార్‌యాదవ్‌కు అనుకూలంగా ప్రచారం నిర్వహించినట్లు అప్సర్‌పై ఆరోపణలు వచ్చాయి. ఈ విషయమై నెల్లూరు నగర నియోజకవర్గ ఎన్నికల అధికారి నుంచి ఈసీకి ఫిర్యాదులు కూడా అందాయి. అంతేకాకుండా మార్కెట్‌లోని దుకాణాలను అద్దెకు ఇప్పిస్తానని కొంతమంది వద్ద నగదు వసూళ్లకు పాల్పడినట్లు కూడా ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలో విచారణ చేపట్టిన మార్కెటింగ్‌శాఖ ఉన్నతాధికారులు అప్సర్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

వైసీపీ జిల్లా అధ్యక్షుడిగా కాకాణి

- నెల్లూరు పార్లమెంట్ పరిశీలకుడిగా ఆదాల
- నెల్లూరు సిటీ, రూరల్ సమన్వయకర్తల నియామకం
- కార్పొరేషన్ పరిశీలకుడిగా అనీల్

నెల్లూరు, సెప్టెంబరు18 (ఆంధ్రజ్యోతి): కందుకూరుతోపాటు ఉమ్మడి నెల్లూరు జిల్లా వైసీపీ అధ్యక్షుడిగా కాకాణి గోవర్ధన్‌రెడ్డిని నియమించారు. ఈ మేరకు వైసీపీ కేంద్ర పార్టీ కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది. అంతకుముందు బుధవారం సాయంత్రం తాడేపల్లిలోని జగన్‌మోహన్‌రెడ్డి క్యాంప్ కార్యాలయంలో జిల్లా వైసీపీ నాయకులతో జగన్ సమావేశమై ఈ నిర్ణయం తీసుకున్నారు. ఉమ్మడి నెల్లూరు పరిధిలోని పది అసెంబ్లీ నియోజకవర్గాలు, కందుకూరు నియోజకవర్గాలతో మొత్తం 11 అసెంబ్లీ నియోజకవర్గాలతో కూడిన ఉమ్మడి నెల్లూరు జిల్లాకు అధ్యక్షుడిగా కాకాణిని నియమించారు. దీంతో కాకాణి మూడోసారి జిల్లా అధ్యక్ష బాధ్యతలు చేపట్టినట్లు అయింది.

ఇక నెల్లూరు పార్లమెంట్ పరిశీలకుడిగా ఆదాల ప్రభాకర్ రెడ్డిని నియమించారు. నెల్లూరు నగర సమన్వయకర్తగా ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, రూరల్ సమన్వయకర్తగా ఆనం విజయ కుమార్‌రెడ్డిలను నియమించారు. నెల్లూరు కార్పొరేషన్ పరిశీలకుడిగా నెల్లూరు నగర మాజీ ఎమ్మెల్యే అనీల్‌కుమార్ యాదవ్‌ను నియమించారు. రాష్ట్ర మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శిగా మొన్నటి ఎన్నికల్లో వైసీపీ నగర అభ్యర్థిగా పోటీ చేసిన మహమ్మద్ ఖలీల్ అహ్మద్‌ను నియమించారు. నియోజకవర్గాల పునర్విభజన జరిగి నెల్లూరు సిటీలో మూడో నియోజకవర్గం ఏర్పాటైతే ఆ స్థానం నుంచి అనీల్ పోటీ చేస్తారని జగన్ ప్రకటించినట్లు జిల్లా అధ్యక్షుడు కాకాణి తెలిపారు. జిల్లా పరిధిలోని మిగిలిన అసెంబ్లీ నియోజకవర్గాలకు గత ఎన్నికల్లో పోటీ చేసినవారే ఇన్‌చార్జులుగా వ్యవహరిస్తారు.



ఏ బ్రాండూ లేదు..!

- మందే లేదని తేల్చిచెబుతున్న సిబ్బంది
- ప్రభుత్వ మద్యం దుకాణాల్లో నో స్టాక్
- ఉన్న సరుకు బార్లు, బెల్టు షాపులకు తరలింపు
- విధులకు హాజరుకాకుండా కాలయాపన

నెల్లూరు (క్రైం) సెప్టెంబరు 18: రాష్ట్రంలో నూతన మద్యం పాలసీని అక్టోబరు ఒకటి నుంచి కూటమి ప్రభుత్వం అమలు చేయనున్నది. ఇందులో భాగంగా ప్రభుత్వ మద్యం దుకాణాలను తొలగించి, పాత పద్ధతిలో ఏర్పాటు చేయనున్నది. ఈ క్రమంలో ఇక మద్యం దుకాణాలు ఉండేది తక్కువ రోజులులేనని భావిస్తూ అక్కడున్న సిబ్బంది చేతివాటం చూపుతున్నారు.

● కొద్దిరోజులుగా నో స్టాక్

జిల్లాలో 160కుపైగా ఉన్న ప్రభుత్వ మద్యం దుకాణాలు, ఎలైట్లలో కొద్దిరోజులుగా మద్యం దొరకడంలేదు.ఏ సమయంలో మందుబాబులు వెళ్లినా తమకు కావాల్సిన బ్రాండ్లు లేవని దుకాణాల్లో సిబ్బంది చెబుతున్నారు. మద్యం కావాలని మందుబాబులు కోరుతుంటే ఇదిగో...డిస్‌ప్లేలో పెట్టిన బ్రాండ్లు మాత్రమే మా దగ్గర ఉన్నాయి. బీర్లు అసలే లేవు... అంటూ సమాధానం ఇస్తున్నారు. ఏమీ లేనప్పుడు దుకాణాలు మూసేస్తే సరిపోతుంది కదా... అంటూ మందుబాబులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ షాపులు ఉండేది ఈనెలాఖరు వరకు మాత్రమే. అందుకే పైనుంచి అధికారులు పెద్దగా బ్రాండ్లు పంపించడం లేదని సిబ్బంది సమాధానం ఇస్తున్నారు. దీంతో మందుబాబులు చేసేది లేక బార్లకు వెళ్లి అధిక ధరలు చెల్లించి మద్యం కొనుగోలు చేస్తున్నారు.

● బార్లు, బెల్టుకు సరుకు తరలింపు

ప్రభుత్వ దుకాణాల్లో మద్యం కొరతపై జిల్లా ఎక్సైజ్ ఈఎస్‌ను వివరణ కోరగా అలాంటిది ఏమి లేదని, దుకాణాలకు పూర్తిస్థాయిలో సరుకు సరఫరా చేస్తున్నామన్నారు. ఈ సమాధానాన్ని బట్టి చూస్తుంటే ఎలాగో ఉద్యోగాలు ఉండేది మరో 12 రోజులేగా.. అని భావిస్తున్న దుకాణాల్లోని సిబ్బంది నేరుగా దందాకు దిగినట్లు తెలుస్తోంది. బీర్లు, బాగా డిమాండ్ ఉన్న బ్రాండ్ల మద్యాన్ని బార్లకు, బెల్టు దుకాణాలకు తరలిస్తున్నారు. క్వార్టర్ బాటిల్ ఎమ్మార్పీపై రూ.10 నుంచి రూ.30 అదనంగా తీసుకొని అప్పగిస్తున్నట్లు తెలిసింది. ఇక దుకాణాల్లోని సిబ్బంది వ్యవహరిస్తున్న తీరు ఇబ్బంది కరంగా ఉంటున్నదని, నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని మందుబాబులు ఆరోపిస్తున్నారు. వారు విధుల్లో ఉండాల్సిన సమయంలో అనుమతి కూడా తీసుకోకుండా బయట తిరుగుతున్నారని వారు ఆరోపిస్తున్నారు.



నెల్లూరు : మద్రాసు బస్టాండ్ సమీపంలోని మద్యం దుకాణం వద్ద కొనుగోలుదారులు

దుకాణాలకు మద్యం పంపుతున్నాం



మద్యం దుకాణాలకు ఇండెంట్ ప్రకారం డిపో నుంచి మద్యం సరఫరా చేస్తూనే ఉన్నాం. దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు చేయిస్తూ నిర్లక్ష్యం వహించిన సిబ్బందిపై చర్యలు తీసుకుంటాం.

\- నాగమల్లేశ్వరరెడ్డి, ఎక్సైజ్ ఈఎస్

కావలి

కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

మొక్కలు నాటుదాం.. పుడమిని కాపాడుకుందాం



మొక్క నాటుతున్న ఎంపీడీవో, కూటమి నాయకులు

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), సెప్టెంబరు 18: మొక్కలు నాటి పుడమితల్లిని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఇన్‌చార్జి ఎంపీడీవో సంధ్యాలక్ష్మి పేర్కొన్నారు. బుధవారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా రెండోరోజు కూటమి నాయకులతో కలిసి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ప్రతిఒక్కరు అమ్మ పేరుతో ఓ మొక్క నాటి సంరక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నజీముల్లా, టీడీపీ, బీజేపీ నాయకులు చీదర్ల మల్లికార్జున, కాకర్ల మధు, సుబ్బారెడ్డి, చుండి హరిగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉదయగిరిలో: స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో రెండోరోజైన బుధవారం మండలంలోని గండిపాళెం, గడినరవ గ్రామాల్లో మొక్కలు నాటారు. ప్రతిఒక్కరు మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యతలు చేపట్టి వాయు కాలుష్యాన్ని నివారించాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కృష్ణ, పంచాయతీ కార్యదర్శి అమర్నాథ్‌రెడ్డి, ఉపాధి, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఐకి సన్మానం



ఎస్‌ఐకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న దేవప్రసన్న

ఉదయగిరి రూరల్, సెప్టెంబరు 18: మండల ఎస్‌ఐగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన శ్రీనివాసులును స్థానిక పోలీస్‌స్టేషన్‌లో జిల్లా పార్లమెంట్ క్రిస్టియన్ సెల్ అధ్యక్షుడు బిషప్ రెవరెండ్ ఓబులాపురం దేవప్రసన్నకుమార్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఓబులాపురం కొండలరావు, చేవూరి బాబు, చేవూరి సైమన్, పీటర్ తదితరులు పాల్గొన్నారు.

వరికుంటపాడు ఎస్‌ఐగా రఘునాథ్

వరికుంటపాడు, సెప్టెంబరు 18: వరికుంటపాడు ఎస్‌ఐగా ఎం రఘునాథ్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు. సిబ్బంది ఆయనకు అభినందనలు తెలిపి స్వాగతం పలికారు.

ఆటో కార్మికులను ఆదుకోవాలి

ఉదయగిరి రూరల్, సెప్టెంబరు 18: గత వైసీపీ ప్రభుత్వం వాహనమిత్ర పథకాన్ని ప్రవేశపెట్టి ఆటో కార్మికులపై కేసులు బనాయించి ఆర్థికంగా ఇబ్బందులకు గురిచేసిందని, కూటమి ప్రభుత్వమైనా ఆటో కార్మికులను ఆదుకోవాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి శంకర్‌కిశోర్ కోరారు. బుధవారం ఉదయగిరి పట్టణంలో ఆటో కార్మికులతో కలిసి ర్యాలీ చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సొంత వాహనాలు ఉన్న వారు చాలా తక్కువగా ఉన్నారని, ప్రభుత్వం ఆటో కార్మికులకు 50 శాతం సబ్సిడీతో ఆటోలు పంపిణీ చేయాలన్నారు. డీజిల్‌కు సైతం సబ్సిడీ ఇవ్వాలన్నారు. ఈ సందర్భంగా ఉదయగిరి మండల నూతన కమిటీని ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో ఆటో యజమానులు, డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు విరాళాల అందచేత



విద్యార్థులు అందచేసిన వరద సహాయాన్ని పాఠశాల కరస్పాండెంట్‌కు అందచేస్తున్న ఉపాధ్యాయులు

ఆత్మకూరు, సెప్టెంబరు 18: ఆత్మకూరు పట్టణంలోని ప్రగతి ఇంగ్లీషు మీడియం హైస్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు, పాఠశాల యాజమాన్యం విజయవాడ వరద బాధితుల సహాయార్థం బుధవారం రూ. 67,957 విరాళం అందచేశారు. ఈ విరాళాన్ని డిప్యూటీ విద్యాశాఖాధికారి గోపాల్ సమక్షంలో పాఠశాల కరస్పాండెంట్ ఎస్ రామమోహన్‌రెడ్డి, డైరెక్టర్ ఎస్ అమరావతిలకు అందచేశారు. ఈ మొత్తాన్ని జిల్లా ఆపస్మా ఆధ్వర్యంలో సీఎం రిలీఫ్‌ఫండ్‌కు పంపిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సృజనాత్మక విద్యనందించాలి

ఉదయగిరి రూరల్, సెప్టెంబరు 18: విద్యార్థులకు సృజనాత్మక విద్యనందించాలని ఎంఈవో-2 తోట శ్రీనివాసులు పేర్కొన్నారు. బుధవారం మండలంలోని గడ్డంవారిపల్లి ప్రాథమిక పాఠశాలలో జరుగుతున్న సముదాయ సమావేశాలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు చర్చించుకుని బోధనోపకరణాలతో విద్యార్థులకు విద్యనందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు మాలకొండయ్య, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కొలతల ప్రకారం పనులు చేయాలి : ఏపీవో

సీతారామపురం : ఉపాధి హామీ పథకం కింద మండలంలో పనిచేస్తున్న గ్రామీణ ప్రాంత కూలీలకు రోజువారీ వేతనం రూ.300 వచ్చేలా పనిచేయించాలని ఏపీవో సుభాషిణి సిబ్బందికి సూచించారు. మండలంలోని మారంరెడ్డిపల్లి గ్రామంలో బుధవారం జరుగుతున్న ఉపాధి హామీ పనులను సిబ్బందితో కలిసి ఆమె పరిశీలించి, మస్టర్లను తనిఖీ చేశారు.

ప్రపంచ రికార్డుపై హర్షం



కేక్ కట్ చేస్తున్న టీడీపీ, జనసేన నాయకులు

ఉదయగిరి రూరల్, సెప్టెంబరు 18: గతనెల 23న రాష్ట్ర వ్యాప్తంగా 13,326 పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించి రూ.4,500 కోట్ల విలువైన ఉపాధి హామీ పనులకు తీర్మానం చేయడంపట్ల ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ వరల్డ్ రికార్డ్స్ యూనియన్ చేతుల మీదుగా ధ్రువపత్రం అందుకోవడం పట్ల బుధవారం మండలంలోని గండిపాళెం గ్రామంలో టీడీపీ, జనసేన నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యాలయంలో కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. అనంతరం పంచాయతీ కార్యదర్శి గాజులపల్లి అమర్నాథ్‌రెడ్డిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులు ఇమ్రాన్, రెడ్డిబత్తిన సునీల్, రాయపాటి పీరావలి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఎంపికలు

వింజమూరు, సెప్టెంబరు 18 : మండలంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఈనెల 19వ తేదీ నుంచి 21 వరకు మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఎంపికలు జరుగుతాయని పీడీ ప్రభాకర్‌రెడ్డి మాచర్ల తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 19వ తేదీ అండర్-14, అండర్-17 బాలబాలికలకు అథ్లెటిక్స్‌లో, 20న అండర్-14, అండర్-17 బాల బాలికలకు కబడ్డీ, యోగా, షటిల్, బాల్‌బ్యాడ్మింటన్‌లలో, 21న అండర్- 14, అండర్ - 17 బాలబాలికలకు వాలీబాల్, చెస్ క్రీడల్లో ఎంపికలు నిర్వహించబడునని తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థినీ విద్యార్థులు పాల్గొనాలని తెలిపారు.

జీవునకు వేలంపాట

ఉదయగిరి రూరల్, సెప్టెంబరు 18: స్థానిక ఐసీడీఎస్ కార్యాలయానికి చెందిన పాత జీపుకు బుధవారం సీడీపీవో పచ్చవ లావణ్య ఆధ్వర్యంలో వేలంపాట నిర్వహించారు. ఈ వేలంపాటలో ఏడుగురు పాల్గొనగా రూ.8,700కు గిరి అనే వ్యక్తి వేలంపాట పాడి జీపును దక్కించుకున్నాడు.

ఉపాధి పనులలో ఎస్సీ, ఎస్టీలను ప్రోత్సహించండి

ఏఎస్ పేట, సెప్టెంబరు 18: ఉపాధి హామీ పనులలో ఎస్సీ, ఎస్టీ అబ్ధిదారులను ప్రోత్సహించాలని ఎంపీడీవో శ్రీనివాసులు తెలిపారు. బుధవారం ఆయన చిరమన గ్రామంలో చెక్‌డ్యాం పూడికతీత పనులను పరిశీలించారు. ప్రతిఒక్కరూ జాబ్‌కార్డు కలిగి ఉండాలని తెలిపారు. హార్టికల్చర్‌క్రింద మొక్కల పెంపకంచేస్తే ప్రభుత్వ సబ్సిడీ లభిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్లు సతీష్, చంద్రశేఖర్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఉపాధి హామీ లక్ష్యాలు సాధించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో ఐజాక్ ప్రవీణ్

ఆత్మకూరు, సెప్టెంబరు 18: ఉపాధి హామీ పథకం లక్ష్యాల సాధనకు సిబ్బంది, క్షేత్రసహాయకులు కృషి చేయాలని ఎంపీడీవో ఐజాక్ ప్రవీణ్ సూచించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆయన ఉపాధి సిబ్బంది, క్షేత్రసహాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కుటుంబానికి వంద రోజులు పని కల్పించడంతోపాటు రూ. 300 కూలి గిట్టుబాటు అయ్యేవిధంగా కొలతల ప్రకారం వారికి పనిచేసేలా అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో, ఈసీ, టీఏ, క్షేత్రసహాయకులు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

ఉదయగిరి రూరల్, సెప్టెంబరు 18: వరి పంట సాగులో తగు సస్యరక్షణ చర్యలు చేపడితేపెట్టుబడులు తగ్గించుకోవడంతోపాటు అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి ఆంజనేయుల నాయక్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని అప్పసముద్రం, గుడినరవ, నేలటూరు గ్రామాల్లో రైతులు సాగు చేసిన వరి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా పంటకు ఆకుముడత, కాండంతొలుచు పురుగులు ఆశించాయని గుర్తించి నివారణ చర్యలు వివరించారు.

క్రీడలతో క్రమశిక్షణ.. ఏకాగ్రత



మాట్లాడుతున్న ఎంఈవో గోవిందయ్య

కావలి టౌన్, సెప్టెంబరు 18: క్రీడలతో క్రమశిక్షణతో పాటు ఏకాగ్రత పెరుగుతుందని ఎంఈఓ గోవిందయ్య తెలిపారు. బుధవారం జడ్పీ క్రీడా మైదానంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మండలస్థాయి క్రీడా పోటీలు నిర్వహించి మండల జట్లను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడారు. బాల్యదశనుంచే క్రీడా నైపుణ్యం పెంపొందించాలన్న దృక్పథంతో ఎస్‌జీఎఫ్ కృషి చేస్తుందన్నారు. విద్యార్థులు ఇలాంటి అవకాశాలు అందిపుచ్చుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. జడ్పీ ప్రధానోపాధ్యాయురాలు నీరజ విజేతలను అభినందించారు. మండలస్థాయిలో ఎంపికైన విద్యార్థులు ఈ నెల 24, 25తేదీల్లో కావలి జడ్పీ మైదానంలో జరుగనున్న నియోజకవర్గ స్థాయి ఎంపికలకు అర్హులన్నారు. కార్యక్రమంలో పీఈటీలు, పీడీలు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

వింజమూరు, సెప్టెంబరు 18 : మండలంలోని చాకలికొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో వైద్యాధికారి మురళీధర్ ఆధ్వర్యంలో జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను మింగించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కేంద్ర సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శులకు మొక్కల పంపిణీ

ఏఎస్ పేట, సెప్టెంబరు18: స్థానిక ఎంపీడీవో కార్యలయంలో బుధవారం ఎంపీడీవో శ్రీనివాసులు పంచాయతీ కార్యదర్శులకు మొక్కలు పంపిణీ చేశారు. మండలంలోని 19 పంచాయతీలలో పంచాయతీకి 10 మొక్కలు చొప్పున అందించారు. వాటిని నాటి ఫోటోలు తీసి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల విస్తరణ అధికారి రవిశంకర్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఐటీఐలో సీట్లకు దరఖాస్తు చేసుకోండి

సంగం, సెప్టెంబరు 18: ఆత్మకూరు పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహిస్తున్న సంగం ప్రభుత్వ ఐటీఐలో ఖాళీగా ఉన్న ఫిట్టర్ ట్రేడ్‌లో చేరేందుకు ఆసక్తి కలిగిన విద్యార్థినీ, విద్యార్థులు ఈనెల 26లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఏడుకొండలు ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకున్నవారు ఈనెల 28వ తేదీ 10గంటలకు జరిగే కౌన్సిలింగ్‌కు ఒరిజనల్ సర్టిఫికెట్‌లతో హాజరుకావాలని కోరారు.

స్కూల్ గేమ్స్ ప్రారంభం

ఏఎస్ పేట, సెప్టెంబరు 18: స్కూల్ గేమ్స్ ఫేడరేషన్ ఆటల పోటీలను బుధవారం కావలి ఎడవల్లి గ్రామంలోని జడ్పీ హైస్కూల్‌లో ఎంఈవో సాయిప్రసాద్ ప్రారంభించారు. మండల స్థాయిలో అండర్-17, అండర్-14 విభాగాలలో ఆటల పోటీలు జరిగాయి. ఈ కార్యక్రమంలో పలు పాఠశాల హెచ్ఎంలు, వ్యాయమ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా పౌర్ణమి పూజలు

సంగం, సెప్టెంబరు 18: తిరుమనకొండలోని కాశీవిశేశ్వరస్వామి జ్ఞాన పీఠంలో భాద్రపద పౌర్ణమిని పురస్కరించుకుని బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి, అమ్మవార్లకు అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. పీఠాధిపతి రాజరాజేశ్వరానందస్వామి భక్తులకు ధ్యాన, యోగ, ప్రాణాయములపై అవగాహన కల్పించారు. మధ్యాహ్నం అన్నదానం ఏర్పాటు చేశారు. పలు గ్రామాల నుంచి భక్తులు పాల్గొన్నారు.

వరద బాధితులకు విరాళాల వెల్లువ



ఐటీ శాఖా మంత్రి నారా లోకేష్‌కు విరాళాల చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు



విరాళాలు ఇచ్చిన విద్యార్థులతో ఎమ్మెల్యే ఇంటూరి

కందుకూరు, సెప్టెంబరు 18: విజయవాడ వరద బాధితులను ఆదుకునేందుకు పలువురు నాయకులు, విద్యాసంస్థల ప్రతినిధులు, కాంట్రాక్టర్లు విరాళాలు సేకరించారు. ఆ మొత్తాన్ని బుధవారం నియోజకవర్గ ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుకు అందజేశారు. అందులో ఆక్స్‌ఫర్డ్ విద్యాసంస్థల మేనేజ్‌మెంట్, టీచర్లు, విద్యార్థులు రూ.2,76,063లు, గుర్రంవారిపాలెం టీడీపీ నాయకులు దామా వెంకటేశ్వర్లు రూ.లక్ష, పందలపాడు కాంట్రాక్టర్ రామాల వెంకట కృష్ణారెడ్డి రూ.50వేలు, పట్టణ సత్యసాయి జ్యూయలర్స్ యజమాని కాకు మాని ప్రవీణ్ కుమార్ రూ. 25వేలు ఇచ్చిన వారిలో ఉన్నారు. కార్యక్రమంలో ఆక్స్‌ఫర్డ్ విద్యాసంస్థల ఛైర్మన్ ఉన్నం భాస్కర్, కరస్పాండెంట్ వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్ నజీర్, పార్టీ నాయకులు దామా మల్లేశ్వరరావు, ఆర్యవైశ్య నాయకులు మురారిశెట్టి సుధీర్, కేశవరావు పాల్గొన్నారు.

నారా లోకేష్‌కు ఇంటూరి విరాళాల అందజేత

విజయవాడ వదర బాధితుల సహాయార్థం నియోజకవర్గంలోని పలువురు దాతలు అందచేసిన రూ.8,11,063 విరాళాల చెక్కును బుధవారం ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు రాష్ట్ర ఐటీ శాఖా మంత్రి నారా లోకేష్‌కు అందజేశారు. ఈ సందర్భంగా స్పందిచి బాధితలను ఆదుకునేందుకు ముందుకు వచ్చిన దాతలకు ప్రభుత్వం తరుపున ధన్యవాదాలు తెలపగా, అలాగే వారిని ప్రోత్సహించిన ఎమ్మెల్యే ఇంటూరిని లోకేష్ అభినందించారు. నియోజకవర్గంలోని పలు అభివృద్ధి కార్యక్రమాలపై లోకేష్‌తో చర్చించినట్లు తెలిపారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం



హనుమంతరావును సన్మానిస్తున్న ఎంఈఓలు రవికుమార్ మల్లికార్జున

వలేటివారిపాలెం, సెప్టెంబరు 18: నలదలపూరు హైస్కూల్ కాంప్లెక్ సమావేశం అనంతరం జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడు ముతకని హనుమంతరావును ఎంఈఓలు రవికుమార్, మల్లికార్జున హైస్కూల్ హెచ్ఎం మాధవ్ శాలువా, పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో టీచర్లు రమణమూర్తి, జనార్ధన్ పాల్గొన్నారు.

మాజీ ఎంపీటీసీ మృతికి నివాళి



నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి మహీధర్‌రెడ్డి

వలేటివారిపాలెం, సెప్టెంబరు 18: చుండి మాజీ ఎంపీ టీసీ సభ్యులు వరికూటి కొండారెడ్డి (60) గుండెపోటుతో సోమవారం మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న మాజీ మంత్రి మానుగుంట మహీధర్‌రెడ్డి అమ్మ పాలెంకు వెళ్లి కొండారెడ్డి మృతదేహనికి నివాళులర్పించి కుటుంబసభ్యులకు సానుభూతి తెలిపారు. నివాళులర్పించిన వారిలో పరిటాల వీరాస్వామి, కట్టా హను మం తరావు. ఇంటూరి హరిబాబు, అనుమోల వెంకటేశ్వర్లు, అనుమోల లక్ష్మీనరసింహం ఉన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి

లింగసముద్రం, సెప్టెంబరు 18: పర్యా వరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఎంపీడీఓ శ్రీనివాసులు తెలిపారు. బుధవారం ఉపాధిహామీ ఏపీఓ షేక్ సమీర్‌బాషా, సిబ్బందితో కలిసి పెదపవని ప్రాథమిక పాఠశాల, స్థానిక గ్రామ సచివాలయాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఈసీ చిన కోటయ్య, ఎఫ్ఎ ధనుం మధు, హిదయతుల్లా పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

నెల్లూరు(క్రైం), సెప్టెంబరు 18: చట్టాలపై పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలని చిన్నబజారు పోలీ సు స్టేషన్ ఇన్‌స్పెక్టర్ చిట్టెం కోటేశ్వరరావు విద్యార్థులకు సూచించారు. నగరంలోని మద్రాసు బస్టాండు సమీపం లోని కృష్ణచైతన్య కళాశాలలోని విద్యార్థులకు బుధవారం గుడ్ టచ్, బ్యాడ్ టచ్, మహిళల రక్షణ తదితర చట్టాలపై ఇన్‌స్పెక్టర్ అవగాహన కల్పించారు. అత్యవసర వేళల్లో 100, 112లకు ఫోన్ చేస్తే తక్షణమే స్పందించి చర్యలు తీసుకుంటామన్నారు.

అరుదైన ఏబీ-నెగటీవ్ రక్తదానం

- గర్భిణి ప్రాణాలు కాపాడిన చిరుద్యోగి

కందుకూరు, సెప్టెంబరు 18: స్థానిక ఏరియా ఆసుపత్రిలో బుధవారం నెల్లూరుకు చెందిన మహిళ కాన్పు కోసం చేరింది. ఆమెది ఏబీ-నెగటీవ్ గ్రూప్ కావడంతో ప్రకాశం, నెల్లూరులోని బ్లడ్ బ్యాంక్‌లలో కూడా అరుదైన ఆ గ్రూప్ రక్తం దొరకలేదు. కుటుంబ సభ్యులు సక్షం సంస్థ నిర్వాహకులను కలవగా ఆ గ్రూప్ రక్తం గల షేక్ ఖాజా ఆమెకు రక్తం దానం చేశారు. గర్భిణీ కాన్పుకు సహకరించిన చిరుద్యోగి ఖాజాను పట్టణంలోని పలువురు ప్రశంసించారు.

జనరిక్ మందుల దుకాణం పారంభం

కావలి, సెప్టెంబరు 18: స్థానిక టంకురోడ్డులో బీపీఎస్ సమీపంలో ఇలింద్ర మెడికల్స్ నిర్వాహకులు ఏర్పాటు చేసిన జనరిక్ మందుల షాపును బుధవారం ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి ప్రారంభించారు. అనంతరం జమునా కాంప్లెక్స్‌లో క్వాలిటీ స్వగృహ ఫుడ్స్ దుకాణాన్ని ప్రారంభించారు.

మున్సిపల్ షాపులకు వేలం

కందుకూరు, సెప్టెంబరు 18: స్థానిక మున్సిపల్ పరిధిలోని వివిధ షాపులకు ఈ నెల 24న వేలం పాట నిర్వహించనున్నట్లు కమిషనర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గవర్నమెంట్ హాస్పిటల్ ఎదురుగా ఉన్న వైఎస్ఆర్ షాపింగ్ కాంప్లెక్స్, పాత కూరగాయల మార్కెట్ స్కందపురి వాణిజ్య సముదాయములోని షాపులు, కల్లూరి కోటేశ్వరరావు షాపింగ్ కాంప్లెక్స్‌లో ఖాళీ అయిన షాపులు, ముత్యాలగుంట పార్కు వద్ద ఖాళీ చేసిన షాపులకు అద్దె ప్రాతిపదికపై బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

లింగసముద్రంలో నిత్యం ట్రాఫిక్ సమస్య

- ఆక్రమణలతో కుంచించుకుపోయిన రోడ్డు
- రహదారిపైనే ద్విచక్ర వాహనాలు, ఆటోల పార్కింగ్
- పట్టించుకోని అధికారులు



బస్టాండ్ సెంటర్‌లో ట్రాఫిక్‌జామ్ ఏర్పడడంతో నిలిచిపోయిన బస్సులు

లింగసముద్రం, సెప్టెంబరు 18 : గ్రామంలో ఆర్అండ్‌బీ రోడ్డు మార్జిన్‌ల ఆక్రమణలతో ప్రతినిత్యం ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయి.ఈ రో డ్డు మార్జిన్‌ల ఆక్రమణలు యథేచ్ఛగా జరుగుతున్నా, వీటిని అడ్డుకునే అధికారే లేరా ? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.గత 20 ఏళ్ల నుంచి ఈ రోడ్డు మార్జిన్‌ల ఆక్రమణలు జరుగుతున్నా ఆర్అండ్‌బీ అధికారులు, పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు.అంతేకాక గత నాలుగైదు ఏళ్ల నుంచి ఈ ఆక్రమణలు ఇంకా ఊపందుకున్నాయి.ఈ ఆక్రమణలు కృష్ణమోహన్ వైద్యశాల నుంచి కల్యాణ మండపం వరకు ఉన్నాయి.చాలా మంది తమ ఇళ్ల, దుకాణాల ముందు ఉన్న రోడ్డు మార్జిన్‌లను ఆక్రమించి ఎత్తుగా మట్టి వేయడం, పందిళ్ల వేయడం చేస్తున్నారు. వీటి గురించి అటు పంచాయతీ అధికారులు గానీ, ఆర్అండ్‌బీ అధికారులు గానీ పట్టించుకోవడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు.దీనికి తోడు రోడ్డుపైనే ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్లు, ఇతర వాహనాలు నిలిపి ఉంచుతున్నారు.దీంతో ఎదురెదురుగా బస్సులు, లారీలు, టర్బోలు వస్తే ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది.దీంతో ప్రజలు, వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు.కనీసం ఈ సమస్య గురించి పోలీసులు కూడా పట్టించుకోవడం లేదని తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.ఇప్పటికైనా ఆయా శాఖల అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాల్సి ఉంది.

రైసు మిల్లుల కాలుష్యం - రైతుల ఆందోళన



కాలుష్యాన్ని విడుదల చేస్తున్న రైస్ మిల్లు

తోటపల్లిగూడూరు, సెప్టెంబరు 18: యజమానుల నిర్లక్ష్యం వల్ల రైసుమిల్లుల నుంచి కాలుష్యం వెదజల్లడంతో పంటలు పండక రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొంతకాలంగా మండలంలోని ఇస్కపాలెం, సాలిపేట సెంటర్‌లోని రైసుమిల్లు నుంచి విడుదల అవుతున్న కాలుష్యపు నీటిని రోడ్డు పక్కనే ఉన్న పొలాల్లోకి వదిలేస్తున్నారు. దీంతో ఆ భూముల్లో పంటలు పండడం లేదు అంతేకాక రైసు మిల్లు నుంచి దుర్గంధం వెదజల్లుతున్నా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో రైతులు ఆగ్రహిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన రాఅండ్‌బాయిల్డ్ రైసుమిల్లులకు పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు ఎలా అనుమతులు మంజూరు చేశారన్నది అర్థం కావడంలేదు. రైసు మిల్లుల యజమానుల నుంచి భారీగా ముడుపులు తీసుకుని, అనుమతులు మంజూరు చేశారన్న ప్రచారం జోరుగా సాగుతోంది. జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకుని నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు అయిన రైసుమిల్లులపై చర్యలు తీసుకుని తమ పంటలను కాపాడాలని రైతులు కోరుతున్నారు.

వాడవాడలా స్వచ్ఛత హి సేవ

బుచ్చిరెడ్డిపాళెం, సెప్టెంబరు 18: బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీతోపాటు మండలంలోని వాడవాడలా బుధవారం స్వచ్ఛత హి సేవ కార్యక్రమాలను పలు శాఖల అధికారులు, ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు మొక్కలు నాటారు. బుచ్చి నగర పంచాయతీ కమిషనర్ ఆధ్వర్యంలో బుచ్చి తహసీల్దారు కార్యాలయం, సామాజిక ఆరోగ్య కేంద్రం, పోలీస్‌స్టేషన్, డీఎల్ఎన్ఆర్ హైస్కూలు, తదితర ప్రభుత్వ కార్యాలయాల వద్ద మొక్కలు నాటారు. పెనుబల్లి గ్రామంలోని పాఠశాలల ఆవరణలతోపాటు పలుచోట్ల తహసీల్దారు అంబటి వెంకటేశ్వర్లు, సర్పం చు ఊడా పెంచలయ్య, సెక్రటరీ చలపతి, ఇతర నా యకులు, సచివాలయ సిబ్బంది మొక్కలు నాటారు. అలాగే బుచ్చిరెడ్డిపాళెంలోని వవ్వేరు కోఆపరేటివ్ క్రెడిట్ బ్యాంకులో జిల్లా సహకార శాఖాధికారి బి గురప్ప మొక్కలు నాటారు. అనంతరం కాలువల్లో వ్యర్థాలు తొలగించి పారిశుధ్యం మెరుగుపరిచారు. ఈకార్యక్రమంలో బ్యాంకు పర్సన్ ఇన్‌చార్జ్ సుబ్రమణ్యం, సబ్ డివిజినల్ సహకార అధికారి కె సుభాషిణి, సంఘం సీఈఓ పాల్గొన్నారు.

మొక్కలకు రక్షణ కరువు



కావలి, సెప్టెంబరు 18 : పట్టణ సుందరీకరణలో భాగంగా గత టీడీపీ ప్రభుత్వంలో ట్రంకురోడ్డులోని డివైడర్‌లో మొక్కలు నాటారు. అధికారుల నిర్లక్ష్యంతో వాటికి కరువవుతోంది. మొక్కల సంరక్షణకు ఏర్పాటు చేసిన ఇనుప గ్రిల్స్ పలుచోట్ల విరిగిపోయాయి. అయినా అధికారులు పట్టించుకోవటంలేదనే ఆరోపణలు ఉన్నాయి. ట్రంకు రోడ్డుపై ఉత్తరాన బాష్యం స్కూల్ నుంచి దక్షిణాన బృందావనం హౌసింగ్ కాలనీ వరకు డివైడర్ నిర్మించారు. అందులో క్రూటన్ మొక్కలు నాటారు. సగభాగం వరకు ఇనుప గ్రిల్స్‌ను ఏర్పాటు చేశారు. మిగతా భాగం పశువులకు అందకుండా ఎత్తుగా డివైడర్‌ను నిర్మించారు గ్రిల్స్ నిర్మించిన చోట అధికారుల పర్యవేక్షణ లేక కొన్నిచోట్ల విరిగిపోయాయి. ఇప్పటికైనా గ్రిల్స్ బాగుచేసి, డివైడర్‌పై మొక్కల సంరక్షణకు అధికారులు తగిన చర్యలు చేపట్టాల్సి ఉంది.